సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక

RNI No. APTEL 2015/ 66622

# రాజధాని వార్తలు

www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv

అమరావతి సోమవారం 21 - ఆదివారం 27 నవంబర్, 2016 సంపుటి : 2 సంచిక 9 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు పత్రిక | Whatsapp No: 9440662699 | పేజీలు 8 వెల : రూ. 5.00



## దేశ రాజకీయాలకు ఇందిరా దిశానిర్దేశం

ప్రజల మద్దతు తరచు పొందవలసిన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎక్కువ కాలం అధికారంలో కొనసాగే అవకాశం అరుదుగా మాత్రమే కొద్ధిమంది నాయకులకు మాత్రమే లభిస్తుంది. అత్యాధిక సంఖ్యాకులైన ప్రజలు కటిక దారిద్ర్యంలో ఉన్న భారత దేశంలో దారిద్ర్య నిర్మూలనుకు, అన్నిరంగాలలో స్వయం సంమృద్ధి సాధనకు అత్యధిక ప్రాముఖ్యం ఇచ్చిన నాయికురాలు ఇందిరా గాంధీ. శతజయంతి సంవత్సరంలో అడుగు పెట్టిన ఇందిరా గాంధీ 16 సంవత్సరాలు ఏకధాటిగా 11 సంవత్సరాలు (1966-77) ఆ తర్వాత ఐదు సంవత్సరాలు (1980-84) ప్రధాన మంత్రి పదవిలో ఉన్నారు. ప్రధాన మంత్రి పదవిలోనే హత్యకు గురై 1984లో ( 1917నవంబరు 19, 1984అక్టోబరు 31)లో కన్ను మూసారు. ప్రధాన మంత్రి పదవి పొందటానికి తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ కూతురు కావటం ఇందిరా గాంధీకి ఉపయోగపడి ఉండవచ్చు. కానీ ఆ తర్వాత 16 సంవత్సరాలు అధికారంలో ఉండడం -ముఖ్యంగా దేశంలో అంతర్గత అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) వంటి ప్రజావ్యతిరేక చర్య తీసుకొని 1977 ఎన్నికలలో ఘోరపరాజయం తర్వాత 1980 ఎన్నికలలో ప్రజలమద్దత్తుతో విజయం సాధించటం ఆమె నాయికత్వంపై ప్రజలలో ఆమె నాయికత్వంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనం. పేదప్రజలు బడుగు బలహీన వర్గాల ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సాహసోపేతమైన స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవటం ప్రజల మనసులలో ఆమెకి చోటు లభించేటట్లు చేసింది.

- వివరాలు 3లో ▸

# బాబుతో నడుస్తా : మొయినుద్దీన్

విద్యావంతుడు, వినయశీలి, సామాజిక స్పృహ, రాష్ట్ర అభ్యున్నతి సహకారం అందించగలిగిన అడ్వొకేట్ మొయినుద్దీన్, గుంటూరు జన చైతన్యయాత్రలో చురుకుగా పాల్గొంటున్నారు. ఈ సందర్భంలో రాజధాని వార్తలు ప్రతినిధులతో మొహినుద్దీన్‌తో జరిపిన ఇంటర్వ్యూ...

**రాజధాని నిర్మాణంపై మీ అభిప్రాయం ?**

రాష్ట్ర పరిపాలనా వ్యవస్థకు అతి కీలకమైన రాజధాని నిర్మాణం పర్యవేక్షణలో నారా చంద్రబాబునాయుడు చూపిన దూరదృష్టి, ప్రజ్ఞ అద్వితీయం. ఆయన పాలన సకల జనామోదంగా ఉంది.

**మరి చంద్రబాబు మంత్రుల మాట**

ఆంధ్రప్రదేశ్‌లోవున్న మంత్రులందరూ ఉద్దండులే.. అందువల్ల క్లిష్ట సమస్యలను సైతం సునాయాసంగా పరిష్కరించి ప్రజల మన్ననలను పొందుతున్నారు.

**500, 1000 నోట్లు నల్లధనం, అవినీతి నిర్మూలనపై మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనలకు స్పందించి మన ప్రధాని మోడీ నిర్ణయంపై మీ అభిప్రాయం ?**

నల్ల కుబేరులు చీకటియాత్ర ప్రారంభించారు అనుకోవచ్చు... అందమైన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పొట్టి శ్రీరాములు గారి ఆత్మాహుతి ఫలితంగా కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. తెలంగాణ విడిపోవడంతో 13 జిల్లాలతో ఆంధ్రప్రదేశ్ మిగిలింది. పాత రాష్ట్రమే అయినా ఒక కొత్త రాష్ట్రంలా మళ్ళీ అన్ని రంగాల్లో జవసత్వాలు నింపుకొని ముందుకు అడుగు వేస్తోంది. అక్షర క్రమంలోనే కాకుండా ప్రపంచ పటంపై విశిష్ఠ స్థానాన్ని ఆక్రమిస్తుంది..సందేహం లేదు.

**ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఏడు లక్ష్యాలు, ఐదు గ్రిడ్లు , ప్రచార ఉద్యమాల గురించి వివరిస్తారా ?**

కష్టాలను ఎదుర్కోవడంలోనే మన సామర్థ్యం బయటపడుతుందని ప్రగాఢంగా నమ్మే ముఖ్యమంత్రి రాష్ట్ర విభజన తెచ్చిన నష్టాలను, కొత్త రాష్ట్రంలో ఎదుర్కొంటున్న కష్టాలను అధిగమించడానికి కొత్త లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి రంగంలో ఉన్నత ప్రమాణాలతో సమ్మిళిత వృద్ధి సాధించడమే ముఖ్యమంత్రి లక్ష్యం. వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వైద్యరంగాలలో సుస్థిరమైన సమ్మిళిత వృద్ధి (ఇంక్లూజివ్ గ్రోత్) సాధించడానికి ఏడు లక్ష్యాలే ఉత్ప్రేరికాలు కానున్నాయి.

### ప్రాథమిక రంగ మిషన్

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు, అనుబంధ రంగాలతో కలిపి రైతులు ఆదాయం అర్జించేందుకు ప్రాథమిక రంగ మిషన్ తీసుకున్నారు. జల సంరక్షణ చేస్తూ, ఉత్తమ పద్ధతుల ద్వారా దిగుబడి పెంచుతూ, రైతాంగానికి రాబడి పెరిగేలా చూడటమే ప్రాథమిక రంగ మిషన్ లక్ష్యం.

రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధించాలంటే సంతులిత అభివృద్ధి చెందాలంటే ప్రాథమిక రంగం అభివృద్ధి తప్పనిసరి, రాష్ట్ర జనాభాలో 63 శాతం ప్రజానీకానికి అదే జీవనాధారం. 2015-16 ఆర్థిక సంవత్సరంలో ప్రాథమిక రంగం 8.4 శాతం వృద్ధిరేటును నమోదు చేసింది. వర్షాభావ పరిస్థితుల వల్ల సస్యరంగంలో వార్షిక ఫలితాలు అంతకుముందు ఏడాది కంటే 7.01 శాతం తరుగుదలను చూపించినా, వ్యవసాధారిత రంగంలో ఆకర్షణీయమైన వృద్ధి రేటు కనిపించింది. పండ్లతోటల పెంపకంలో 9.96 శాతం, పాడి పరిశ్రమలో 11.22 శాతం మత్స్యరంగం 32.78 శాతం వృద్ధి రేటును సాధించింది.

### సామాజిక రంగ మిషన్

ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనారిటీలు, మహిళల అభ్యున్నతి కోసం సామాజిక సాధికారతా లక్ష్యంగా తీసుకున్నారు. సాంఘికంగా, ఆర్థికంగా బలహీనులైన అన్ని వర్గాలకు సామాజిక సాధికారత సమకూర్చడానికి ఈ మిషన్ దోహదం చేస్తుంది. విద్య, వైద్య రంగాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో మిషన్ సహకరిస్తుంది. 2019 నాటికి రాష్ట్రంలో దారిద్ర్యాన్ని పూర్తిగా నిర్మూలించే దిశగా మిషన్ కృషి చేస్తుంది.

### పారిశ్రామిక రంగ లక్ష్యం

రాష్ట్రంలో సుస్థిర ఆర్థికాభివృద్ధికి అవసరమైన పరిశ్రమల ఏర్పాటుకు ఉద్దేశించినదే పారిశ్రామిక రంగ మిషన్. 2015 ఏప్రిల్ 29న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఇండస్ట్రియల్ సెక్టార్ మిషన్ ఆరంభించారు. విద్యుత్, వ్యవసాయం, ఆహారశుద్ధి, మౌలిక వసతులు, తయారీరంగం, పెట్రో కెమికల్స్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, టెక్స్‌టైల్ రంగాలలో వేల కోట్లు పెట్టుబడులను ఆకర్షించడమే ఈ మిషన్ లక్ష్యం. ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటుచేయడం ఈ మిషన్ లక్ష్యాలలో ఒకటి. ఎలక్ట్రానిక్స్ రంగాన్ని అభివృద్ధి చేసి హార్డ్‌వేర్ హబ్‌ను నెలకొల్పుతారు. పారిశ్రామిక కారిడార్లను ఏర్పాటుచేస్తారు.

పారిశ్రామిక రంగంలో 2015-16 ఆర్థిక సంవత్సరంలో 11.13 శాతం వృద్ధి రేటును సాధించటం విశేషం. పారిశ్రామిక రంగంలోని అన్ని విభాగాల్లోనూ వృద్ధి కనిపిస్తోంది. వస్తూత్పత్తి, గనుల తవ్వకం, విద్యుత్, సహజవాయువు, నిర్మాణ రంగాలలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొనడం మేలికొలుపు.

### మౌలిక సదుపాయాల మిషన్

పెట్టుబడులను ఆకర్షించాలంటే మౌలిక సదుపాయాలను కల్పించటం అత్యంత అవసరం. ఆంధ్రప్రదేశ్‌ను జాతీయ, అంతర్జాతీయ లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో మౌలిక సదుపాయాల మిషన్ ఏర్పాటుచేశారు.

పోర్టులు, ఎయిర్‌పోర్టులు, మెగాసిటీలు, స్మార్ట్‌సిటీలు, మాన్యు ఫ్యాక్టరింగ్ జోన్లు, జాతీయ జలమార్గాలు, జాతీయ రహదారులు, జాతీయ విశ్వవిద్యాలయాలు, అంతర్జాతీయ విద్యాసంస్థలు, బీచ్ కారిడార్లు, ఇండస్ట్రియల్ కారిడార్లు,



సీఎం చంద్రబాబుతో లాయర్ మొహినుద్దీన్ (ఫైల్)

నోడ్స్, కన్వెన్షన్ సెంటర్లు, క్రీడామైదానాలు, వ్యర్థాల నుంచి ఇంధనం తయారుచేసే ప్లాంట్లు, పవర్‌గ్రిడ్, ఫైబర్ ఆప్టిక్ గ్రిడ్, గ్యాస్ గ్రిడ్, మెట్రో రైళ్ల మార్గాలను అభివృద్ధి చేస్తారు.

### పట్టణాభివృద్ధి మిషన్

పట్టణాభివృద్ధికి అవసరమైన రోడ్ మ్యాప్ రూపకల్పన చేసి వనరులను సమీకరించి అభివృద్ధిని వేగవంతం చేయడానికి పట్టణాభివృద్ధి మిషన్ తీసుకువచ్చారు. పట్టణ ప్రాంతాలలో రవాణా సౌకర్యాలను విస్తృతి చేయడం, గృహ వసతి కల్పించడం, ఘన వ్యర్థాల నిర్వహణ, పచ్చదనం-పరిశుభ్రత వంటి కార్యక్రమాలన్నీ శరవేగంతో సాగడానికే పట్టణాభివృద్ధి మిషన్ చేపట్టారు.

### సేవారంగ మిషన్

పర్యాటక రంగం, నిర్మాణ రంగం, ఆతిథ్య రంగం, ఆర్థిక సేవలు, విద్య, వైద్యం, ఐటీ తదితర సేవల కోసం ఉద్దేశించినదే సర్వీస్ సెక్టార్ మిషన్. విద్య, వైద్య రంగాలలో ఆంధ్రప్రదేశ్ ప్రపంచ దేశాలకు గమ్యస్థానంగా వుండాలన్న లక్ష్యాన్ని ముందు పెట్టుకుని ఆ రంగాలను అభివృద్ధి చేస్తున్నారు.

రాష్ట్ర, స్థూల ఉత్పత్తిలో సేవారంగానిది 46.6 శాతం వాటా. జనాభాలో అత్యధిక సంఖ్యాకులకు సేవారంగమే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తోంది. 2015-16 ఆర్థిక సంవత్సరంలో సేవారంగం అంతకుముందు సంవత్సరం కన్నా 11.39 శాతం పెరుగుదల సాధించింది. ఐటీ, కమ్యూనికేషన్స్, పౌర పరిపాలన, వాణిజ్యం, హోటళ్లు రెస్టారెంట్లు, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, రియల్ ఎస్టేట్, రవాణా, పర్యాటకం, సంస్కృతి, ఇతర విభాగాల ద్వారా ఆర్థిక వనరుల్ని పెంచుకోవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది. సేవారంగంలోనే పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పన సాధ్యమవుతుందనేది నిర్వివాదాంశం.

### నైపుణ్యాభివృద్ధి మిషన్

విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంపొందించింది. ఉపాధి అవకాశాలను కల్పించడం, పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడం లక్ష్యాలుగా నైపుణ్యాభివృద్ధి మిషన్ తీసుకువచ్చారు. రాష్ట్రాన్ని నాలెడ్జ్‌హబ్‌గా తీర్చిదిద్దడం ముఖ్య ఉద్దేశ్యం. ఉద్యోగులు, నిరుద్యోగ యువతలో సామర్థ్యం, నైపుణ్యాలను పెంపొందించేందుకు తగిన శిక్షణ కల్పిస్తారు. పరిశ్రమలను, విశ్వవిద్యాలయాలకు అనుసంధానించి వాటి అవసరాలకు అనుగుణంగా సాంకేతిక శిక్షణ అందిస్తారు. యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందిస్తారు. నిజానికి ఈ రాష్ట్రంలో అన్ని వనరులూ ఉన్నాయి. అపారమైన ఖనిజరాని భూమి లోపలి పొరల్లో పరచుకుని వుంది. ఈ వనరులన్నీ సమర్ధవంతంగా వినియోగించుకునే కార్యాచరణ చేపడితే నవ్యాంధ్రను స్వర్ణాంధ్రగా మార్చవచ్చు. ఈ లక్ష్యంతోనే 5 గ్రిడ్లు తీసుకుని వాటిని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావించింది.

వనరుల పంపిణీ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సమంగా జరపాలన్న వ్యూహంతోనే ఈ గ్రిడ్లను ఏర్పాటు చేశారు. దీంతోమౌలిక సదుపాయాలు అన్ని ప్రాంతాల ప్రజలకు సమానంగా అందుతాయి. మారుమూల గ్రామీణ ప్రాంతాలకు కూడా ప్రభుత్వ ప్రయోజనాలు దక్కుతాయి.

గ్యాస్ గ్రిడ్

కేజీ బేసిన్‌లో అపార చమురు నిక్షేపాలు రాష్ట్రాభివృద్ధికి బాటలు వేస్తున్నాయి. రానున్న ఐదేళ్లలో ఇంటింటికి పైపులైన్ల ద్వారా గ్యాస్ సరఫరా చేసేందుకు ప్రభుత్వ కార్యాచరణ చేస్తోంది. విశాఖ జిల్లా గంగవరం సమీపాన ఎల్‌పీజీ టెర్మినల్ ఏర్పాటు చేస్తున్నారు. కాకినాడ డిప్ వాటర్ పోర్టు దగ్గర ఫ్లోటింగ్ స్టోరేజి రీ-గ్యాసిఫికేషన్ యూనిట్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.

కాకినాడ నుంచి విశాఖపట్టణం వరకు గ్యాస్ పైప్‌లైన్ వేసి, ఫ్లోటింగ్ స్టోరేజి, రీగ్యాసిఫికేషన్ యూనిట్ పనులు పూర్తిచేసి ఈ ఆర్థిక సంవత్సరంలోనే ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. 2016-17 లోగా తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలలో ఇంటింటికి గ్యాస్ పంపిణీ

- బోస్

- మిగతా 2 లో...

## ఈవారం రాజధాని

- రైతులపై ప్రభావం చూపుతున్న పెద్ద నోట్ల రద్దు
- నవ్యాంధ్రలో పెట్టుబడులకు అనేక అవకాశాలు : గంటా
- ప్రపంచ శ్రేణి వైద్య, విద్యా హబ్‌గా అమరావతి : చంద్రబాబు
- చిన్ననోట్లు రూ. 10 వేల కోట్ల పంపమని కేంద్రానికి ముఖ్యమంత్రి లేఖ
- అంతర్జాతీయ విద్యాసంస్థలకు ఎ.పి. అనుకూలం : అమెరికా పర్యటనలో మంత్రి గంటా
- సచివాలయంలో మహిళరైతు బజార్‌ను ఏర్పాటు చేయమని వినతిపత్రం అందించిన సులోచన : మహిళా ఉద్యోగల సంఘం అధ్యక్షురాలు
- రాజధాని ప్రాజెక్టులకు రూ.14,500 కోట్లరుణాలు సిద్ధం
- స్మార్ట్ సిటీలో మహిళలకు పెద్దపీట వేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళ కమిషర్ అధ్యక్షురాలు కె. శివాణి
- భవన నిర్మాణాల అనుమతులకు సిఆర్‌డిఎ కార్యాలయంలో ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు
- ఇందిరాగాంధీ శత జాయంతి ఉత్సవాలను శనివారం నుండి ఏడాదిపాటు నిర్వహణ :ఎన్. రఘువీరా రెడ్డి
- టి.డి.పితోనే ప్రజాసంక్షేమం సాధ్యం : శ్రావణ్‌కుమార్
- రాజకీయలకు అతీతంగానే రైల్వే బడ్జెట్ తొలగింపు : మోదీ
- ప్రభుత్వానికి ఆదాయం తగ్గింది : అజయ్‌కల్లం

# వైఎస్ఆర్‌సీపీ నేతల గృహనిర్బంధం



**అనంతపురం :** అనంతపురం పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. తుంగభద్ర ఆయకట్టుకు నీరు ఇవ్వాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శనివారం చేపట్టిన ఆందోళన తీవ్రరూపం దాల్చింది. దీంతో వైఎస్ఆర్‌సీపీ నేతల ఆందోళనలపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ నేపథ్యంలోనే వైఎస్ఆర్‌సీపీ నేతలు అనంత వెంకట్రామిరెడ్డి, గుర్నాథరెడ్డి, పద్మావతిని హౌస్ అరెస్ట్ చేశారు. ప్రతిపక్ష నేతలు చేపట్టిన ఆందోళనకు మద్దతు తెలిపిన వామపక్షపార్టీలు సీపీఐ, సీపీఎం నేతలను కూడా పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఆయకట్టుకు నీరు అడిగితే గృహనిర్బంధం చేయడంపై వైఎస్ఆర్‌సీపీ నేతలు మండిపడుతున్నారు.

## రాజధానిలో ఎస్ఐబి బ్రాంచ్ ప్రారంభం




తుళ్ళూరులో నూతనంగా ప్రారంభించిన ఎస్ఐబి బ్యాంక్

**రాజధాని ప్రతినిధి, తుళ్లూరు :** ఎనభై ఏళ్లకు పైగా బ్యాంకింగ్ అనుభవం కల సౌత్ ఇండియన్ బ్యాంకు (ఎస్ఐబీ) బ్రాంచి తుళ్లూరు మేరీమాత స్కూలు ఆవరణలో శుక్రవారం ఉదయం వైభవంగా ప్రారంభమైంది. నూతన బ్రాంచిని ఎంపీపీ వడ్లమూడి పద్మలత ప్రారంభించగా, ఏటిఎంను మేరిమాత డిస్పెన్సరీ డాక్టర్. సిస్టర్. ముత్తే జైన్ రిబ్బన్ కటింగ్ చేశారు. రాబోయే రోజుల్లో తుళ్లూరు శాఖ పెద్ద బ్రాంచి అవుతుందని ఎస్ఐబీ చీఫ్ మేనేజర్ టోనీ జోస్ తెలిపారు. కొద్ది రోజుల్లో తిరుపతి గుంటూరుల్లో తమ బ్రాంచీలను ప్రారంభిస్తామన్నారు. అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆంటోని మాట్లాడుతూ తమ బ్యాంకు లక్ష కోట్ల రూపాయల డిపాజిట్లు సేకరించిందని, 2020 నాటికి రెండు లక్షల కోట్ల రూపాయలను సేకరించే లక్ష్యంతో పనిచేసేస్తున్నామన్నారు. ఎస్ఐబీ లో కరెంటు, సేవింగ్స్ల లావాదేవీలను డెబిట్ కార్డు, మొబైల్ బ్యాంకింగ్‌ల ద్వారా చేసుకోవచ్చన్నారు. బ్రాంచి

- మిగతా 2 లో...

## రాజమహేంద్రవరంలో చంద్రబాబు పర్యటన

**రాజమహేంద్రవరం:** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన కొనసాగుతోంది. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రూ. 7కోట్లతో నిర్మించిన పరిపాలనా భవనాన్ని, ఖైదీల కోసం నిర్మించిన 50 పడకల ఆసుపత్రిని సీఎం ప్రారంభించారు. అనంతరం శాటిలైట్ సిటీలో సీఎం పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రులు చినరాజప్ప, దేవినేని ఉమా మహేశ్వరరావు, ఎంపీ మురళీ మోహన్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరిస్తా

**జిల్లా జేసీగా బాధ్యతలు స్వీకరించిన కృతికా శుక్లా**



**రాజధాని ప్రతినిధి-గుంటూరు :** గుంటూరు జిల్లా జాయింట్‌కలెక్టర్‌గా కృతికా శుక్లా శుక్రవారం కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 12.20 గంటలకు గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్లతో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కృతికా పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. నాలుగునెలల నుంచి గుంటూరు జిల్లా జాయింట్‌కలెక్టర్ పదవీ ఖాళీగా ఉన్నందున ప్రభుత్వం తనను భర్తీ చేసిందన్నారు. రాజధాని ప్రాంతానికి జాయింట్‌కలెక్టగ్‌గా రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో రెవెన్యూ, పౌరసరఫరాల శాఖలపై ప్రత్యేక్షంగా దృష్టిని కేంద్రీకరిస్తామన్నారు. జిల్లాలో ఉన్న 57 మండలాల్లో పర్యటించి అక్కడ ప్రజల సమస్యలను తెలుసుకుంటుమన్నారు. ప్రజలతో మంచి సంబంధాలను కొనసాగించి ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుంటామన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తనకు తెలియజేయవచ్చునన్నారు.

**నూతన జాయింట్ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలతో అభినంధనలు**

గుంటూరు జిల్లా నూతన జాయింట్‌కలెక్టర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన కృతికా శుక్లాకు జిల్లా రెవెన్యూ అధికారి నాగబాబు, ఇతర రెవిన్యూ డివిజన్ల అధికారులు, పౌరసరఫరాశాఖ అధికారులు, గృహనిర్మాణశాఖ అధికారులు, కలెక్టరేట్‌లో అధికారులు పుష్పగుచ్ఛాలిచ్చి ప్రత్యేకంగా అభినంధించారు.

## మాజీ ముఖ్యమంత్రుల విగ్రహాలు నెలకొల్పాలి : వీకే తిలక్

**రాజధాని ప్రతినిధి- విజయవాడ :** అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మితమవుతున్న అమరావతిలో మాజీ ముఖ్యమంత్రుల విగ్రహాలు నెలకొల్పాలని సీనియర్ పాత్రికేయుడు వీకే తిలక్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. సమైక్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన స్వర్గీయ ఎన్‌టీఆర్ ట్యాంకుబండిపై నన్నయ, తిక్కన ఎర్రాప్రగడ, బమ్మెరపోతన, శ్రీనాథుడు, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, కందుకూరి, తెలుగు కవయిత్రి మొల్ల, బూర్గుల రామకృష్ణ , సురవరం ప్రతాపరెడ్డి, గురజాడ, శ్రీశ్రీ వంటి తెలుగు కవులు, ప్రసిద్దుల విగ్రహాలు నెలకొల్పారన్నారు. సమైక్య ఆంధ్రప్రదేశ్ నుంచి నవ్యాంధ్ర ప్రదేశ్ వరకు 18 మంది ముఖ్యమంత్రులు పనిచేశారన్నారు. అయితే చంద్రబాబు నాయుడుతో సహా మరో ముగ్గురు మాత్రమే మనమధ్య ఉన్నారన్నారు. రాష్ట్రానికి ఎనలేని సేవలు అందించిన స్వర్గీయులు టంగుటూరి ప్రకాశం పంతులు, బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజవయ్య, కాసు బ్రహ్మానందరెడ్డి, పీవీ నరసింహారావు, జలగం వెంగళరావు, మర్రి చెన్నారెడ్డి, టంగుటూరి అంజయ్య, భవనం వెంకట్రామ్, కోట్ల విజయ భాస్కర రెడ్డి, ఎన్‌టీరామారావు, నాదేండ్ల భాస్కరరావు, నేదురుమిల్లి జనార్ధన రెడ్డి, రాజశేఖర రెడ్డిల కాంస్య విగ్రహాలను అమరావతిలో నెలకొల్పాలని ఆయన కోరారు. ఆ మహనీయులను రాబోయే తరాలు స్మరించుకునే అవకాశం ఉంటుందని,తద్వారా దేశవ్యాప్తంగా నూతన సంప్రదాయాన్ని సృష్టించిన వారవుతారన్నారు. ముఖ్యమంత్రి పదవినలంకరించి వారిలో నాదేండ్ల భాస్కరరావు, కొణిజేటి రోషయ్య, నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులు మన మధ్య ఉన్నారన్నారు.

## లోపలి పేజీల్లో ...


- దాడులకు పాల్పడితే సీపీఐ ప్రత్యక్షపోరు 2లో
- 27న రుద్రాక్ష పూజ 3లో
- సాయంకాలంలో భోజనం ఏ విధముగా తినాలి 4లో
- గెలిచి ఓడిన ట్రంప్... 5లో
- చాంతాడులే చిన్నబోయే క్యూలైన్లు 8లో

# రాజధాని వార్తలు


కలం

## కులభోజనాలకు రండి...

ఎండవేడిని తగ్గిస్తూ , రాత్రిపూట చంద్రకాంతిని ప్రసరిస్తూ కార్తీక మాసం మొదలైంది. ఈ మాసంలో వనభోజనాలకు పెట్టింది పేరు. విదేశీయులు ప్రతి వారాంతాలు తమతమ స్నేహితులతో పిక్నిలకు వెళుతుంటారుగాని, భారతీయులు మాత్రం ఈ మాసంలో స్నేహితులు, సన్నిహితులు, తోటి ఉద్యోగస్తులతో తప్పనిసరిగా వనభోజనాలకు వెళ్లి ఆడి, పాడి ఆనందోత్సవాల మధ్య ఇంటికి చేరుకుంటారు. రోజూ ఒకే విధమైన జీవనంతో బోర్ కొడుతుందనే ఉద్ధేశంతోనూ, సహవాసులందరిలో సుహృద్భావన కలిగించాలని బహుశా మన పెద్దలు ఈ వెలుసుబాటు కలిగించి ఉంటారు. అప్పట్లో వనాలను సంరక్షించాలన్న ధ్యాసతో, రకరకాలయిన చెట్లు మానవుని ఆయుష్షు పెంచుతాయని కూడా మన పూర్వీకులు వీటిని ప్రారంభించి ఉంటారు. మరీ ముఖ్యంగా ఉసిరి చెట్టు క్రింద వీటిని ఏర్పాటు చేసే వారు. మహిళలంతా చెట్లు కింద దేవీ స్తుతి, వనలక్ష్మి పాటలు పాడి పసందైన శాఖాహార భోజనం ఆరగించేవారు. వనాలతో మంచి గాలిని, దీంతో ఆరోగ్యాన్ని అభివృద్ధి చేసుకుంటూ, చెట్ల ఫలాలను పొందటం ఆ హాయి.. ఈ తరానికి తెలియకుండా పోతోంది. ఎంత ధనం పోసినా, ఎన్ని ఆధునిక సౌకర్యాలు ఉన్నా పచ్చటి పర్యావరణం ముందు అవన్నీ బలాదూరే అని తెలియచేసే వారు కూడా లేకపోవడం ప్రస్తుత తరం దురదృష్టం.ఎంత శారీరకంగా ఎంత శ్రమ పడ్డా, మానసికంగా హాయిగా ఉండేవారు. నిజం చెప్పాలంటే ప్రకృతితో సహజీవనం చేసి, ఆయురారోగ్య, ఐశ్వర్యాలను పొందేవారు.

అయితే ప్రస్తుతం వనం అన్నది లేదు. ఇంకా చెప్పాలంటే చెట్లు చేమలు అన్నీ నరికివేసి అందమైన బహుళ అంతస్థులు నిర్మించారు. ఇదే అభివృద్ధి అని చెప్పేవాళ్లు కూడా చాలా మంది ఉన్నారు. అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని నాశనం చేసే ప్రక్రియ ప్రారంభం అయ్యింది. అంతేకాదు వనభోజనాల దీని మౌలిక సూత్రాన్ని కూడా స్వార్థరాజకీయ నాయకులు తమకోసం వాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వన భోజనాలు కాస్త ..కుల భోజనాలుగా మారాయి. సహవాసులతో వెళ్లవలసిన కార్యక్రమం కాస్తా కులపోళ్లతో వెళ్ల వలసి వస్తోంది. కుల, మత తత్వాలను తగ్గించే ఈ ప్రక్రియ వాటిని ప్రోత్సహించే దిశలో మరింత పెరుగుతోంది. ఎక్కడ పడితే అక్కడ కులభోజనాలు జరుగుతున్నాయి. కులాల్లోని గొప్పోళ్లు విడిదిని ఏర్పాటు చేసి (వనాలు లేనందున) ఎన్నికల్లో వాడుకుంటున్నారు. లేదా హాజరయినవారి సంఖ్య బట్టి బలాన్ని చూపి రాజకీయ స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నారు. కులాలు, మతాల ప్రభావాన్ని పెంచుతూ, వారిలో కక్ష్యలు, కార్పణ్యాలు ఎగదోసి తమ పబ్బం గడుపుకుంటున్నారు. వాళ్లు రాజకీయంగా ముందున్నారంటే, వీళ్లు ముందున్నారని కాకి లెక్కలు చెబుతూ జాతిగా ఎదగాల్సిన వారిని కులాలు మతాలుగా విడదీస్తున్నారు. ఫంక్షన్ హాళ్లల్లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, మాంసాహార విందులతోనూ, మగవారు మద్యంతోనూ ఈ కార్యక్రమాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. నిజానికి ఈ పద్ధతి నిషిద్ధం. ఒక 20 ఏళ్ల క్రితం ఈ పద్ధతి లేదు. సహోద్యోగులు, కాలనీ వాసులు, సహచరులతో ఈ కార్యక్రమం జరుపుకునే వారు. మనిషిని మనిషిగా గుర్తించడానికే ఏ పండుగలైనా.. అంతేకాని కులం, మతం, ప్రాంతంగా విడదీయటం భారతీయతకు చేటని గుర్తించాలి. వనభోజనాలను ఆదరించి, కులభోజనాలను నిరసించాలి....

## రాజధానిలో ఎస్ఐబీ బ్రాంచ్ ప్రారంభం



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ వడ్లమూడి పద్మలత

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయం అమరావతి రోడ్డుపై వాహనాల పార్కింగ్ సదుపాయంతో ఉందన్నారు. ఖాతాదారుల కోసం 24 గంటల సేవలు అందుబాటులో ఉండటానికి ఏటీఎం ప్రారంభించామన్నారు. ముఖ్య అతిథి పద్మలత మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రాంతాన్ని రాజధానిగా ప్రకటించడంతో ఇక్కడి భూములకు అధిక రేట్లు వచ్చాయని, భూములను అమ్ముకున్న వారంతా వారి నగదును ఈ బ్యాంకులో జమ చేయవచ్చన్నారు. బ్యాంకు సిబ్బంది ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని ఆమె ఈ సందర్భంగా కోరారు. ఎస్ఐబీ తుళ్లూరు శాఖ ఇన్‌చార్జి ఆలపాటి బదరీ కుమార్ మాట్లాడుతూ ఏడాది క్రితం ఇక్కడ బ్రాంచి ప్రారంభించినపన్పుడు డాక్టర్ సిస్టర్. జైన్ రూ. 24 లక్షల చెక్ డిపాజిట్ చేశారని, మళ్లీ అక్టోబర్‌లో మరొక 24 లక్షలు డిపాజిట్ చేశారన్నారు. ఇప్పటివరకు బ్యాంకులో 100 మంది ఖాతాదారులున్నారన్నారు. తుళ్లూరు సర్పంచ్ ఇందుర్తి నరసింహారావు, తెలుగుదేశం నాయకుడు దామినేని శ్రీనివాసరావు, జొన్నల గడ్డ రవిలు బ్యాంకు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మేరీమాత స్కూలు, డిస్పెన్సరీ డాక్టర్. సిస్టర్ సోలీ మరికొంతమంది సిస్టర్లు, ఖాతాదారులు , పాల్గొన్నారు.




# ప్రయాణ సమయం తగ్గించే ప్రయత్నం

సామాన్య ప్రజానీకం నవ్యాంధ్ర రాజధాని అమరావతికి చేరటానికి సమయం తగ్గించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు చేపట్టారు. నవ్యాంధ్రలోని జిల్లా ప్రధాన కేంద్రాలనుండి అమరావతికి కేవలం 6 గంటల్లో చేరుకునేలాగా రహదారుల నిర్మాణం చేపట్టారు. ముందుగా రాయలసీమ జిల్లా నుంచి ప్రయాణకాలం తగ్గించే దిశగా ముఖ్యమంత్రి ముందుకు సాగుతున్నారు.

సామాన్యునికి అందుబాటులో ఉన్న ప్రయాణ సాధనం బస్సు. రాయలసీమ జిల్లా కేంద్రాల నుంచి అమరావతికి చేరాలంటే సరాసరి బస్సు సౌకర్యం లేదనే రహదారుల నిర్మాణం తర్వాత ప్రతి కేంద్రం నుంచి అమరావతికి బస్సు సౌకర్యం కల్పించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని బస్సుల సంఖ్యను నిర్ణయించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

అమరావతికి అత్యంత దూరంగా ఉన్న జిల్లా ముఖ్య పట్టణం అనంతపురం. ఈ రెండు పట్టణాల మధ్య దూరం 386 కి.మీ.రోడ్డు రవాణా సంస్థకు చెందిన ఎక్స్‌ప్రెస్ సర్వీసులో ప్రయాణించి, ప్రయాణీకుడు గమ్యంచేరాలంటే 8,9 గంటల సమయం పడుతుంది. ఈ కాలవ్యవధిని కేవలం అయిదు గంటలకు కుదించాలని ముఖ్యమంత్రి ప్రయత్నించటం ప్రశంసనీయం. ప్రయాణ సమయం తగ్గటం వల్ల సమయం ఆదా అవుతుండటమేకాదు. ఖర్చు కూడా తగ్గుతుంది. ఇంధనం వాడకాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ఇంధన వాడకం తగ్గటంవల్ల, కాలుష్యాన్ని అదుపుచేయగల సామర్థ్యం పెరుగుతుంది. విడి భాగాల అరుగుదల తగ్గుతుంది.

ప్రయాణ సమయం తగ్గించాలంటే ప్రయాణ దూరం తగ్గించాలి. అలా తగ్గించాలంటే, రహదారులను మలుపులు తేకుండా, తిన్నగా తీర్చిదిద్దాలి. రహదారుల్లోని వంకరులు సవరించి రహదారిని తిన్నగా చేయాలంటే కొంత భూమిని సేకరించాలి. కేవలం రహదారుల వంకర్లు సవరించటంతోనే సరిపోదు. గ్రామాలను అవసరమైతే పట్టణాలను తాకకుండా బైపాస్ రహదారులు నిర్మించాలి. అందుకు కూడా కొంత భూమిని సేకరించటం అనివార్యమే ! ఇంకో ప్రధాన విషయం ఇక్కడ ముచ్చటించక తప్పదు. మన రాష్ట్రంలో ఉన్న రోడ్డుల్లో 90 శాతం వరకు ఎదురుగా మరో వాహనం వస్తే, వేగాన్ని తగింగంచి, ప్రక్కకు జరగాల్సినవే. అలాంటి ఇరుకు రహదారుల స్వభావం మార్చే ప్రయత్నం జరుగుతోంది. అనంతపురం అమరావతి నగరాల మధ్య అయిదు వరుసల రహదారిని నిర్మించే ప్రయత్నం మొదలైంది. రహదారులను వెడల్పు చేయటంతోనే, ప్రయాణ సమయాన్ని తగ్గించటానికి వీలుచిక్కుతుంది. వాహనాలన్నీ ఒకే వేగంతో ప్రయాణీంచవు. గంటకు 30 కి.మీ నుంచి, 140,150 కి.మీ వేగంతో ప్రయాణించే వాహనాలు మనకు అందుబాటులోకి వచ్చాయి. తక్కువ వేగం గల వాహనం తన వేగాన్ని తగ్గించుకొనే అవసరం లేకుండా, ఎవరి వరుసలో వారే,ముందుకుపోయే అవకాశం ఏర్పడుతుంది. వాహనాలు ఎదురవుతాయన్న భయంగాని, వేగం తగ్గించాల్సిన అవసరంగాని ఉండనే ఉండదు.

రహదారుల వంకర్లు సవరించి, వరుసలను పెంచటంతో మాత్రమే సమయం ఆదా కాదు. ప్రయాణంలో చాలాచోట్ల కాలాన్ని హరించేవి ఘాట్‌మార్గాలు. అవసరాన్ని బట్టికొండల పైకి ఎక్కటం దిగటం చేయాలి. ఇలా ఎక్కటం, దిగటం సూటిగా జరగదు. పలుమలుపులు తిరగటానికే సరిపోతెంది. ఇలాంటి ఘాట్ రహదారుల్లో ప్రయాణం నివారించటానికి కూడా చర్యలు మొదలయ్యాయి. ఘాట్‌లపైకి ఎక్కటానికి, మార్గానికి కొండలు, గుట్టలు అడ్డంగా లేకుండా చేయాలి. ఘాట్‌లు ఎక్కే అవసరం లేకుండా అధికారులు చర్యలు చేపట్టబోతున్నారు. ప్రయాణ మార్గాన్ని తగ్గించే దిశగా రూపొందించిన మ్యాప్ ఆధారంగా, అడ్డంగా నిలిచిన కొండలను, గుట్టలను తొలచి, రంధ్రాలు చేసి, సొరంగ మార్గం ఏర్పాటుచేయాలని అభిప్రాయ పడుతున్నారు. సొరంగ మార్గాలు ఏర్పాటు చేయటం వల్ల రహదారుల దూరం గణనీయంగా తగ్గుతుంది. అమరావతి–అనంతపురం మధ్య దూరం తగ్గించటానికి దాదాపు 23కి.మీ. దూరం సొరంగం ఏర్పాటుచేయాల్సి వస్తుంది. ముఖ్యమంత్రి సంకల్పిస్తున్న ప్రణాళిక తు.చ. తప్పకుండా అమలు జరిగితే సుమారు 86కి.మీ.మేర రహదారి తగ్గుతుంది. అంత దూరం ప్రయాణించే సమయం ఆదా అవుతుంది.

### అమరావతి – అనంతపురం

ఈ రెండు పట్టణాల మధ్య ప్రస్తుత దూరం సుమారు 472 కి.మీ. ముఖ్యమంత్రి చేపట్టబోయే రహదారుల దూరం తగ్గింపు ప్రక్రియ సక్రమంగా అమలైతే 386 కి.మీ.కి పరిమితమౌతుంది. అంటే 86 కి.మా. దూరం తగ్గుతుంది. 386 కి.మీ. రహదారి మొత్తం ఇపుడు నిర్మించాల్సిన అవసరం వుండదు. 50 కి.మీ. దూరం ప్రస్తుతం కొనసాగుతున్న రహదారినే కొనసాగిస్తారు. అయితే ఆమేర వెడల్పు చేయాల్సి ఉంటుంది. సుమారు 22 కిలోమీటర్లు సొరంగ మార్గం ఏర్పాటు చేయాలి. వాటితో పాటు మరో 10 రైల్వే వంతెనల నిర్మాణం అవసరం. ఇందుకోసం రూ.8,668 కోట్లు ఖర్చవుతుందని అంచనా. ప్రస్తుతం రాష్ట్రానికున్న ఆర్థికవనరుల దృష్ట్యా అదిపెద్ద మొత్తంగానే భావించాలి. ప్రస్తుతం ఖర్చు భవిష్యత్ ఆదాయానికి, ఆదాకు పోల్చితే చాలా తక్కువేనని చెప్పాలి. అనంతపురం – అమరావతిల మధ్య ఆరు వరుసల రోడ్డు నిర్మాణం పూర్తయితే. ఈ రెండు నగరాల మధ్య ప్రయాణ కాలంలో మూడున్నర గంటలు తగ్గిపోతుంది. రోజుకు వేల వాహనాలు నడిచే ఈ రహదారి ఏర్పాటు వల్ల ఆదా జరిగే గంటలు లక్షల్లో ఉంటాయి. అందువల్ల ప్రజలకు ఎంత కర్చు తగ్గుతుందో ప్రస్తుతానికి ఊహలకు అందదు. అనంతపురంలో బయలుదేరిన వాహనాలు తాడిపత్రి, రోతంగపురం, అంగిరెడ్డి పల్లి, కాటపాడు, మెక్కినాని పల్లి, కేతగుణిపి, నరసరావుపేట, గుంటూరు మీదుగా అమరావతికి చేరవచ్చు.

### అమరావతి – కర్నూలు

ఈ రెండు పట్టణాల మధ్య దూరం 311 కి.మీ. కొత్తగా రూపొందించిన ప్రణాళిక ప్రకారం ఈ నగరాల మధ్య ఆరు వరుసల రోడ్డు నిర్మాణం జరిగితే 268 కి.మీ.కే పరిమితమౌతుంది. సుమారు 43 కి.మీ. దూరం తగ్గుతుంది.ప్రయాణ సమయం రెండున్నర గంటలు తగ్గుతుంది. ఈ రోడ్డు నిర్మాణం అంచనా వ్యయం రూ.4,459 కోట్లు. ఈ మార్గంలో నిర్మించాల్సిన సొరంగం కేవలం ఏడు కి.మీ.మాత్రమే అందుకే అంచనా వ్యయం తక్కువగా ఉంది. చిన్నచిన్న నదులపై వంతెనలు 3,పై వంతెనలు (ఫ్లైఓవర్లు) 16 నిర్మించాల్సి ఉంటుంది. గతంలో కర్నూలు నుంచి అమరావతి ప్రయాణించటానికి ఉపయోగించే రహదారిని ఒక్కమీటరు కూడా ఇపుడు ఉపయోగించరు. కర్నూలుకు బయలుదేరిన వాహనాలు సందికొట్కూరు, చెలిమెల, డోర్నాల, కొత్తపల్లి, ఉప్పలపాడు, గుజ్జర్లపూడి మీదుగా అమరావతి చేరుకుంటాయి.

### అమరావతి – కడప

అమరావతి – కడప నగరాల మధ్యగల 370 కి.మీ. దూరాన్ని 85 కి.మీ. తగ్గించి, 285 కి.మీ దూరానికి పరిమితం చేయటానికి ప్రణాళిక సిద్ధమైంది. రాజధాని నగరమైన అమరావతి నుంచి జిల్లా ముఖ్యపట్టణాలకు మాత్రమే రహదారులను వెడల్పు చేసేందుకు ప్రణాళికను పరిమితం చేయలేదు. ఇతర ముఖ్యకేంద్రాల మధ్య కూడా రహదారుల విస్తరణ కార్యక్రమం చేపట్టారు. కృష్ణపట్నం – కోడూరు, కడప – రేణిగుంట, కడప – రావూరు, కడప – తాడిపత్రి, గుంటూరు – మాచర్ల రహదారుల వెడల్పు కార్యక్రమానికి కూడా ఇప్పటికే ప్రణాళిక సిద్ధమైంది.

### గుంటూరు – మాచర్ల

ఈ రెండిటి మధ్య దూరం 126 కి.మీ.110 కి.మీ.కు పరిమితం చేసి 16 కి.మీ. తగ్గించే ప్రయత్నం జరుగుతోంది. అంచనా వ్యయం రూ.21.44 కోట్లు తగ్గే ప్రయాణ సమయం గంటన్నర. సొరంగం 4కి.మీ. ఏర్పాటు చేయాలి. నదులపై రైల్వే వంతెనలు నిర్మించాలి. గుత్తికొండ, జూలకొల్లు, కారంపూడి, దుర్గిల మీదుగా ప్రయాణించే అవకాశం ఏర్పడుతుంది.

### కావలి – కడప

కావలి – కడపల మధ్య ప్రస్తుత రహదారి మార్గం 172 కి.మీ. దానిని 143 కి.మీ. తగ్గించేవిధంగా ప్రణాళిక రూపొందించారు. దీని నిర్మాణం అంచనా రూ. 4,652 కోట్లు, ప్రస్తుత రహదారిలోని 35 కి.మీ. ఉపయోగించుకొని, 93 కి.మీ. పొబవున 3 సొరంగాలు ఏర్పాటు చేయాలి. 4 రైల్వే వంతెనలు, 1 సాధారణ వంతెన నిర్మించాలి. జలదంకి, అయ్యపురెడ్డిపాలెం, పెదకొండూరు, బసిరెడ్డి పాలెం, సిద్ధవటంల మీదుగా ఈ రహదారి సాగుతుంది.

### రావూరు – దత్తలూరు

ఈ రెండు నగరాల మధ్య రహదారి దూరం 118కి.మీ. దాన్ని 75 కి.మీ. తగ్గించే ప్రణాళిక సిద్ధమైంది. దీని నిర్మాణ వ్యయం రూ.1,092 కోట్లు. ప్రస్తుత రహదారిలోని కేవలం 2 కి.మీ. మాత్రమే ఉపయోగించుకొని, 73 కి.మీ. కొత్తగా నిర్మించవలసి ఉంటుంది. ప్రయాణ సమయం 2 గంటలు తగ్గుతుంది. 2 రైల్వే వంతెనలు, 2 నదులపై వంతెనలు నిర్మించాలి. పొంగూరు, కంద్రిక, రాచవారి పల్లెల మీదుగా ఈ రోడ్డు నిర్మాణం జరుగుతుంది.

### మాచర్ల – కొనదీనమెట్ల

ఈ రెంటిమధ్య దూరం 137 కి.మీ. 97 కి.మీ. తగ్గించటానికి ప్రణాళిక సిద్ధమైంది. దాని నిర్మాణం అంచనా వ్యయం రూ. 2, 947 కోట్లు 40 కి.మీ. తగ్గటం వల్ల ప్రయాణ సమయం 2 గంటలు తగ్గుతుంది. 8.5 కి.మీ. సొరంగం ఏర్పాటుచేయాలి. 2 పై వంతెనలు, ఒక నదిపై వంతెన,1 సాధారణ వంతెన నిర్మించాలి. కొండాయపాలెం, దొనకొండ, ఆవుల మంద, గండి గనుమాల, కోలగట్ల మీదుగా కొత్త రహదారి రూపుదిద్దుకొంటుంది.

– అమరావతి నేడు–నాడు–రేపు
అనే పుస్తకం నుంచి దాసరి ఆళ్వారస్వామి



స్థానికులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

# దాడులకు పాల్పడితే సీపీఐ ప్రత్యక్షపోరు

**సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్**

**రాజధాని ప్రతినిధి–(తుళ్ళూరు) రాయపూడి :** కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దళితులపై దాడులకు పాల్పడితే సీపీఐ ప్రత్యక్ష పోరుకు దిగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ హెచ్చరించారు. రాజధాని ప్రాంతమైన రాయపూడి దళితవాడలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన కొంకలూరి ఆదెమ్మ మాట్లాడుతూ నాకు 25 సెంట్ల లంక భూమి ఉంది. ఐదుగురు పిల్లలకు పెళ్ళి చేసి పంపించాను. లంక భూమి ఉన్నదనే సాకుతో పింఛన్ ఇవ్వడం లేదని ఆదెమ్మ వాపోయింది. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలోని అనేక రాష్ట్రాలలో దళితులపై నానాటికి దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాడులకు వ్యతిరేకంగా దళితులు ఏకం కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఎస్సీ,ఎస్టీ, సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పడుతున్న ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. సబ్‌ప్లాన్ నిధులను ఓసీ ఏరియాలలో ఖర్చు చేస్తున్నారని అన్నారు. ప్రైవేటు రంగంలో బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ, మహిళలకు రిజర్వేషన్లు అమలుచేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లి విల్సన్ మాట్లాడుతూ ఉపాధి పథకం కింద 200 రోజులు పనిదినాలు కల్పించి రోజుకు రూ.300 వేతనం ఇవ్వాలని కోరారు. జన్మభూమి కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాదయాత్రలో సీపీఐ రాజధాని ప్రాంత కార్యదర్శి పచ్చల సాంబశివరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కాబోతు ఈశ్వరరావు, నాయకులు సిహెచ్ రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాని కార్యదర్శి పత్తిపాటి రోశయ్య, డీహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రసాద్, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి భైరాంపట్నం రామకృష్ణ, పార్టీ నాయకులు గుంటుపల్లి వెంకటేశ్వరరావు, చింతరాల కోటేశ్వరరావు, గుర్రం కొండ సత్యానందం, రేపూడి శ్రీనివాసరావు, ఏ మురళి, శివయ్య, సంగీతరావు, దేవుని దయ, గోవింద్, పాములు, బాబురావు, స్వామి, దిబ్బయ్య, ప్రసాద్, సుధాకర్‌రావు, ఏసోబు, రవి అజయ్ కుమార్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# బాబుతో నడుస్తా : మొహినుద్దీన్

(మొదటి పేజీ తరువాయి)

జరిపి రాష్ట్రంలో గ్యాస్ గ్రిడ్ తొలిదశను ప్రారంభించనున్నారు.

ఫ్లోటింగ్ స్టోరేజ్ మరియు రీగ్యాసిఫికేషన్ యూనిట్ (ఎఫ్ఎస్ఆర్‌యూ)కు సంబంధించిన పర్యావరణ అనుమతి (ఈసీ) అందిస్తూ ఫిబ్రవరి 9న లేఖ వచ్చింది. ప్రాజెక్ట్ జియో టెక్నికల్ సర్వే వర్క్ జూన్ 15 నాటికి పూర్తవుతుంది. పోర్టు సర్వీస్ అగ్రిమెంట్ జూన్ 30న జరుగనున్నది. 2017 జూన్ నాటికి ప్రాజెక్ట్ పూర్తవుతుంది. ఎఫ్ఎస్ఆర్‌యూ వెండర్లతో సంస్థ సాంకేతిక బృందం లండన్‌లో సాంకేతిక వాణిజ్య అంశాలపై చర్చలు జరుపుతోంది.

కాకినాడ–శ్రీకాకుళం గ్యాస్ పైప్‌లైన్‌కు సంబంధించి జూన్ 15 నాటికి రైట్ సర్వే పూర్తవుతుంది. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కోసం గోదావరి గ్యాస్ లిమిటెడ్ కంపెనీని ఏర్పాటు చేస్తున్నారు. జూలై 31 నాటికి సంబంధిత సర్వే పూర్తవుతుంది. కొవ్వూరు సీఎన్‌జీ స్టేషన్ ప్రారంభమైంది. రోజూ సగటు అమ్మకం 50 కేజీలుగా వుంది. మరో 10 సీఎన్‌జీ స్టేషన్లను అందుబాటులోకి తేనున్నారు.

### వాటర్ గ్రిడ్

రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు 365 రోజులూ త్రాగునీటి సదుపాయం కల్పించడానికి ప్రభుత్వం వాటర్ గ్రిడ్ ఏర్పాటుచేసింది. గృహ అవసరాలు, వ్యవసాయ, పారిశ్రామిక అవసరాలకు జల వనరుల పంపిణీ సక్రమంగా జరపడానికే ఈ గ్రిడ్ ఏర్పాటు చేశారు. 2019 నాటికి రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో పూర్తిస్థాయిలో తాగునీటి సమస్య లేకుండా చేయడానికి ప్రభుత్వం తీవ్ర కృషి చేస్తోంది. దీనికి రూ. 10 వేల కోట్లు అవసరం అవుతాయని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించింది. 2016–17లో చేపట్టిన పనులను పూర్తిచేయడానికి అవసరమైన రూ. 1000 కోట్లను చీ=ణఫొ క్రింద రాబట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

### ఫైబర్ గ్రిడ్

ఇవాళ ఇంటర్నెట్ వాడని ఇల్లు లేదు. బ్రాడ్‌బాండ్ లేని గ్రామమే లేదు. ఇంటర్నెట్, మొబైల్ విప్లవంతో ప్రపంచం ఒక కుగ్రామంగా మారిపోయింది. చిట్టచివరి గ్రామం కూడా కమ్యూనికేషన్‌కు నోచుకుంటోంది. బ్రాడ్‌బాండ్ విస్తరణలో కేవలం 10 శాతం పెరుగుదల వున్న అల్పాదాయ దేశాల్లో జాతీయోత్పత్తిలో గణనీయమైన పెరుగుదల కనిపిస్తోందని ప్రపంచబ్యాంక్ పరిశోధనలో తేలింది. ఇంటర్నెట్ ఒక మానవ హక్కుగా మారిన తరుణంలో బ్రాడ్‌బాండ్ విప్లవానికి తెరతీసి సత్వర అభివృద్ధి సాధించాలన్నది ప్రభుత్వ ప్రయత్నం. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి బ్రాడ్‌బాండ్ విప్లవం ఒక ప్రధాన సాధనం అవుతుందని ప్రభుత్వం గట్టిగా విశ్వసిస్తోంది. ఓ పక్క ప్రభుత్వ విభాగాలన్నింటిలోనూ నూరుశాతం డిజటలైజేషన్ ప్రక్రియ పూర్తిచేస్తూ కొత్త శఖానికి నాంది పలికిన ప్రభుత్వం, మరోపక్క ఇంటర్నెట్ సేవలను ప్రజల ముంగిటికి చేర్చాలని నిర్ణయించింది. దాని ఫలితమే ఫైబర్ గ్రిడ్ ఏర్పాటు.

### రూ. 149/-లకే ఇంటింటికి ఇంటర్నెట్

ఇంటింటికీ ఇంటర్నెట్ సౌకర్యం అందించడమే కాకుండా కేబుల్ టీవీ ప్రసారాలను, టెలిఫోన్ సౌకర్యాన్ని రూ. 149/-లకే అందించాలని ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ చేపట్టింది. రూ. 320 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్ట్ ద్వారా 2016 జూలై నాటికి 10 నుంచి 15 ఎంబీపీఎస్ సామర్థ్యం కలిగిన కనెక్టివిటీని ప్రతి ఇంటికీ అందించనున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలలో ఈ సదుపాయం ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది. త్వరలో రాష్ట్రమంతటా విస్తరించనున్నారు. దేశంలో ఇటువంటి ప్రయత్నం చేపట్టిన మొట్టమొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కావడం ఒక విశేషం. ఈ పథకాన్ని దేశమంతటా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం మన సహాయాన్ని అభ్యర్థించటం మరో విశేషం.

### రోడ్ గ్రిడ్

ప్రతి గ్రామానికి బీటీ రోడ్లు, గ్రామాల నుంచి మండల కేంద్రానికి సింగిల్ లేన్ రోడ్లు, మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి రెండు వరుసల రోడ్లు, జాతీయ మార్గాల అవసరాలను బట్టి 4.6 వరుసల రోడ్లుగా మార్చడానికే రోడ్ గ్రిడ్ ఏర్పాటుచేశారు. జిల్లా కేంద్రం నుంచి ప్రధాన నగరాలకు 6 వరుసల రోడ్లు నిర్మిస్తారు. ప్రధాన నగరాల చుట్టూ ఔటర్‌రింగ్ రోడ్లు ఏర్పాటవుతాయి.

ఓడరేవులతో రాష్ట్ర రహదారులకు కనెక్టివిటీ పెంచి రాష్ట్రం నుంచి దేశమంతటికీ రవాణా సౌకర్యం వుండేలా చేయడంలో రోడ్ గ్రిడ్ దోహదపడుతుంది. రాష్ట్రంలోని 46,440 కిలోమీటర్ల రహదారులను క్రమంగా జాతీయ రహదారులకు అనుసంధానిస్తారు. రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, ఓడరేవులకు ఈ రహదారులను అనుసంధానించి కారిడార్లుగా వినియోగించుకునేందుకు వీలుగా ప్రణాళికలు రూపొందించారు. అన్ని ఓడరేవులు, పర్యాటక ప్రదేశాలు, పారిశ్రామికవాడలు, విమానాశ్రయాల మార్గాలను సమీపంలోని జాతీయ రహదారికి కలుపుతారు.

### పవర్ గ్రిడ్

విద్యుత్ ఉంటేనే పరిశ్రమలు వస్తాయి. పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందితేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుంది. రాష్ట్ర ప్రగతిచోదకంగా నిలిచే విద్యుచ్ఛక్తి రంగాన్ని ప్రభుత్వం అత్యంత కీలకంగా గుర్తించింది. విద్యుత్ సరఫరా సవ్యంగా జరపడానికి పవర్ గ్రిడ్ ఏర్పాటు చేశారు.

అధికారంలోకి రాగానే ప్రభుత్వం 'అందరికీ విద్యుత్' పథకం క్రింద నిరంతరం విద్యుత్ సరఫరాకు కేంద్రంతో ఒప్పందం చేసుకుంది. గృహావసరాలకు, వాణిజ్య అవసరాలకు, పారిశ్రామిక రంగానికి నాణ్యమైన, విశ్వసనీయమైన విద్యుచ్ఛక్తి నిరంతరం అందుతోంది. వ్యవసాయ రంగానిక 7 గంటల పాటు విద్యుత్ అందిస్తున్నారు. ఎటువంటి ప్రకృతి వైపరీత్యాలు విరుచుకుపడ్డా విద్యుత్ సరఫరాలకు అంతరాయం లేకుండా రూ. 3010 కోట్లుతో భూగర్భ విద్యుత్‌లైన్లకు ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి.

### ప్రచార ఉద్యమాలతో ప్రజా చైతన్యం

శ్రీకాకుళంనుంచి చిత్తూరు వరకు ఈ రాష్ట్రాన్ని అమూలాగ్రం అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పం. రాష్ట్రంలో ఏ ఒక్క ప్రాంతం నిర్లక్ష్యానికి గురికాకుండా, అన్ని ప్రాంతాలలో సమగ్రమైన అభివృద్ధి జరగాలి. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త బయటకు రావాలి. ఇంటింటిలో ఒక ఇ–లిటరేట్ వుండాలి. మహిళాశక్తిని, యువశక్తిని వినియోగించి రాష్ట్రంలో పారిశ్రామిక, ఆర్థిక విప్లవాన్ని సృష్టించాలి. వీటన్నింటి కోసం నీరు–చెట్టు, బడి పిలుస్తోంది, పొలం పిలుస్తోంది, పేదరికంపై గెలుపు, పరిశుభ్రం–ప్రజారోగ్యం అనే పేర్లతో 5 ప్రచార ఉద్యమాలు తీసుకున్నారు. వీటి ద్వారా పరిపాలనను ప్రజా ఉద్యమంగా మలచడమే ధ్యేయం. ఉద్యమ స్ఫూర్తితో ముందడుగు వేయడమే లక్ష్యం.

"నానీలు "
ఒక 'ఐడియా'
జీవితాన్ని
మార్చగలదేమో!
నోటుని మాత్రం కాదు!!

చిల్లర విలువ
అందలమెక్కింది
నడివీధిలో
నోటు వెలవెలబోయింది

హుండీని చేరింది
నల్లధనం
తెల్లబోయి చూసింది
చేసిన పాపం!

పట్టాలు తప్పింది నోటు
నల్లకుబేరుల
గుండెలో పోటు!

– దేగల అనితాసూరి

# ఇందిరా గాంధీ శతజయంతోత్సవాలు

రాజధాని ప్రత్యేక ప్రతినిధి, కె.పాండురంగారావు, 9949023180




(హైదరాబాద్) : రాచరిక వ్యవస్థ, ఆ తరువాత బ్రిటీషు వలస పాలనావ్యవస్థ దేశ ప్రజలలో అత్యధికులు పేదరికంలో ఉండటానికి కారణమైంది. ఈ కారణంగానే స్వతంత్రభారత సంగ్రామంలో పాల్గొన్న రాజకీయ పక్షాలు సమాజంలో ధనికులు పేదల మధ్య అంతరాన్ని నిర్మూలించటానికి కృషి చేయాలని అనుకున్నారు. స్వాతంత్ర ఉద్యమానికి నాయకత్వం వహించిన కాంగ్రెసు పార్టీ కూడా సహజంగా అదే మార్గాన్ని అనుసరించింది. ఈ కారణంగా అప్పట్లో రాజకీయ పార్టీలు కమ్యూనిస్టులు, సోషలిస్టు భావాలకు ప్రాముఖ్యత ఇచ్చారు. స్వతంత్రం తరువాత మన ప్రజాస్వామ్య వ్యవస్థను ఎన్నుకున్న రాజకీయ నాయకులు మన రాజ్యాంగాన్ని రూపుదిద్దేటప్పుడు కూడా సమాజంలోని అట్టడుగులో ఉన్న వారి పరిస్థితులను మెరుగు చేయడానికి అవసరమైన మార్గాలను రూపొందించారు. రాజ్యాంగాన్ని రూపొందించటంలో ప్రధాన పాత్ర వహించిన డా. అంబేద్కర్ బడుగు బలహీన వర్గాలకు రాజ్యంగ రక్షణ కల్పించటం పై ప్రత్యేక శ్రద్ధ వహించారు.



అయితే శతాబ్ద కాలంలో ఉన్న వ్యవస్థ రాజ్యాంగంతో మారిపోదు. రాజ్యాంగంలో ఉన్నటువంటి వాటిని అమలుపరచటానికి దృఢమైన సంకల్పం ఉంటేనే అదిసాధ్యమవుతుంది. ఇందిరాగాంధీలో అటువంటి సంకల్పం ఉండటం అధికారంలో ఉన్నప్పుడు ఆమె అనుసరించిన మార్గమే స్పష్టం చేస్తుంది. దేశంలో అత్యధిక సంఖ్యాకులైన ప్రజలకు ఉపయోగం కలగటానికి రాజ భరణాల రద్దు, బ్యాంకుల జాతీయోకరణం వంటి చారిత్రాత్మక నిర్ణయాలు ఆమె తీసుకున్నారు. అఖిల భారత సర్వీసులలో షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు రిజిర్వేషన్లు అమలు చేయటమే కాదు రాజకీయరంగంలో వెనుక బడిన తరగతుల వారికి



అవకాశం కల్పించటానికి చర్యలు తీసుకున్నారు. వలసపాలనలో చితికిన దేశాన్ని అన్నిరంగాలలో మెదట హరితవిప్లవం ద్వారా ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించారు. వివిధ రంగాలలో దేశాన్ని స్వయం సమృద్ధి సాధించటానికి వైజ్ఞానిక పరిశోధనలకు పెద్ద పీట వేశారు.



సరిహద్దులో సమస్యలను సృష్టిస్తున్న పాకిస్థాన్‌ను యుద్దంలో మట్టి కరిపించటమేకాక, తూర్పు పాకిస్థాన్‌ను బంగ్లాదేవ్ అవతరణకు సహకరించారు. పేదరిక నిర్మూలన బడుగు బలహీన వర్గాలలో వెనుకబడిన వారికి పరిపాలనలో భాగస్వామ్యం భారతదేశ రాజకీయాలలో కల్పించే మార్గాన్ని ఇందిరాగాంధి ఎన్నుకున్నారు. పేదరిక నిర్మూలనలో ఇందిరా గాంధి విధానాలు కేవలం జనాకర్ష వినాదాలే అని ఆమె బతికి ఉండగానే కాదు ఇప్పుడుకూడా విమర్శిస్తున్నారు. జనాకర్ష నినాదాలుగా ఆమె నిర్ణయాలను విశితంగా విమర్శిస్తున్నవారు అదే మార్గాన్ని అనుసరించటం గమనించవలసిన అంశం. ఈమార్గాన్ని అనుసరిస్తున్న వారిలో దేశానికి ప్రస్తుతం ఆధ్వర్యం వహిస్తున్న వారు కూడా మినహాయింపుకాదు.

## ప్రపంచ ప్రమాణిక గ్రంథం 'భగవద్గీత'

**రాజధాని ప్రతినిధి-కోనసీమ, జిన్‌రావ్ :** ప్రపంచ ప్రమాణిక గ్రంథంగా భగవద్గీత నిలుస్తుందని జిల్లాపరిషత్ చైర్మన్ నామన రాంబాబు పేర్కొన్నారు. ప్రపంచానికి శ్రీకృష్ణభగవానుడు గీత రూపంలో దిశానిర్దేశం చేశారన్నారు. బండారులంక జ్యోతిర్లింగ ట్రస్టు ఆధ్వర్యంలో పేరి వెంకటేశ్వరశర్మ, సత్యనారాయణశర్మల కన్వెన్షన్ హాలులో శ్రీమత్ భగవద్గీత జ్ఞానయజ్ఞాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ట్రస్టు చైర్మన్ కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి ఆధ్వర్యంలో జరిగిన సభలో జడ్పి చైర్మన్ నామన రాంబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అలాగే ఎమ్మెల్యే ఆనందరావు, మాజీమంత్రి పినిపే విశ్వరూప్‌లు మాట్లాడుతూ దైవసమానులైన తల్లితండ్రులపై భక్తి, గురువులపై గౌరవం తప్పనిసరిగా ఉండాలన్నారు. అటువంటి నైతిక విలువలు ఎన్నింటినో అందించిన ఘనత భగవద్గీతకు దక్కుతుందన్నారు. అంతర్జాతీయంగా ఖ్యాతినొందిన విశ్వవిద్యాలయాలు కూడా భగవద్గీతను విద్యార్థులకు వివరిస్తున్నాయన్నారు. కార్యక్రమానికి ముందుగా బండారులంక వీరభద్రస్వామి ఆలయం వద్ద నుండి ఆలయం వద్ద నుండి ప్రారంభమైన శోభాయాత్ర వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలతో గీతాజ్ఞాన యజ్ఞ ప్రాంగణానికి చేరుకుంది. ట్రస్టు సభ్యులు ఆకుల బాపన్ననాయుడు, పేరి శంకరశర్మ, నాళం సత్యశ్రీనివాస్, బళ్ల విశ్వప్రసాద్, కటకం గణపతిరావు, సమయంతుల పండు తదితరులు ఈ యాత్రలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన ప్రారంభోత్సవ సభలో మాజీ ఎమ్మెల్యే కుడుపూడి చిట్టబ్బాయి, ఎంపిపి బొర్రా ఈశ్వరరావు, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మెట్ల రమణబాబు, జడ్పిటిసి అధికారి జయవెంకటలక్ష్మి, మాజీ జడ్పిటిసి చింతా శంకరమూర్తి, నాయకులు నల్లా పవన్, ఆర్‌వి.నాయుడు, పుత్సల వరదరాజులు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కల్వకొలను తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకామాక్షీ పీఠంలో అన్నప్రసాద వితరణ

**రాజధాని ప్రతినిధి-కోనసీమ, జిన్‌రావ్ :** అమలాపురం పట్టణం కృష్ణారావు వీధిలో ఉన్న శ్రీకామాక్షీ పీఠంలో కార్తీక శుద్ధ పౌర్ణమి రోజున అన్నప్రసాద వితరణ జరిగింది. ముమ్మిడివరంకు చెందిన గణేశుల లక్ష్మి వర్ధంతిని పురస్కరించుకుని దివంగత గణేశుల వెంకటేశ్వరరావు-లక్ష్మిల పేరున ఆయన కుటుంబీకులు కామాక్షీ పీఠంలో బాలబాలికలకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు అడబాల వెంకటరమణ(బాబులు)-కమల దంపతులు, గారపాటి నాగేశ్వరరావు-భాగ్యలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కామాక్షీ పీఠాధిపతి కామేశ మహర్షి వారికి అభినందనలు తెలియజేశారు.

## కాపునాడు, కాపు యువసేన సమావేశం

**రాజధాని ప్రతినిధి-కోనసీమ, జిన్‌రావ్ :** రాష్ట్ర కాపునాడు,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపుయువసేన సమావేశం అమలాపురంలోని స్థానిక కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో ఉభయగోదావరి జిల్లాల పర్యవేక్షకుడు ఎన్.సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు,కాపుయువసేన జాతీయ అధ్యక్షుడు తాడివాక రమేష్‌నాయుడు ఆదేశాల మేరకు కాపునాడు, కాపుయువసేన కమిటీలు పలుచోట్ల పూర్తయ్యాయని, మిగిలిన చోట్ల కమిటీల నియామకం త్వరలో పూర్తి చేస్తామన్నారు ఎన్.సురేష్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు, కాపుయువసేన జాతీయ ప్రచార కార్యదర్శిగా గారపాటి నాగేశ్వరరావును నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అమలాపురం నియోజకవర్గ కాపుయువసేన కన్వీనర్ కొప్పుల భాస్కరరావు, జిల్లా కాపుయువసేన అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి వానపల్లి సూరిబాబు, కాపునాడు తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి మురమళ్ల శివవీరారెడ్డినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామివారికి అన్నాభిషేకం

**రాజధాని ప్రతినిధి-కోనసీమ, జిన్‌రావ్ :** అమలాపురం పట్టణంలోని ఎన్‌టిఆర్ మార్గ్‌లో వేంచేసియున్న శ్రీపూర్ణా పుష్కాలాంబ సమేత అయ్యప్పస్వామివారికి అన్నాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం పెద్దఎత్తున అన్నసమారాధన జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ గోకరకొండ గంగన్నస్వామినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసీలో రూ.110 కోట్లు వసూలు

**హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి) పరిధిలోని ప్రాపర్టీ ట్యాక్స్, ట్రేడ్ లైసెన్సుల బిల్లులు చెల్లించడానికి రాత్రి 9 గంటల వరకు మాత్రమే అవకాశం ఉందని కమిషనర్ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. ఆ తరువాత అపరాధ వడ్డీతో సహా బకాయిలు వసూలు చేస్తామని హెచ్చరించారు. పెద్దనోట్ల రద్దు నేపథ్యంలో చేపట్టినస్పెషల్ డ్రైవ్‌లో ఇప్పటి వరకు రూ.110 కోట్లు వసూలైందని తెలిపారు.నేడు చెల్లించని వారు వచ్చే ఏడాది మార్చి 31వ తేదీలోగా 24 శాతం వడ్డీతో సహా చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. మరోవైపు బకాయి దారులను స్వయంగా కలిసి పన్ను బకాయిలను వసులూ చేసేందుకు బిల్లు కలెక్టర్లు ఇంటింటికి తిరుగుతున్నారు. ఏళ్ల తరబడి పన్ను కట్టని డిఫాల్టర్లకు ఫోన్లు చేసి, ఎస్‌ఎంస్‌లు పంపిన అలర్ట్ చేస్తున్నారు. 2016-17 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిహెచ్‌ఎంపి పరిధిలో రూ.1500 కోట్ల ఆస్తి పన్నును సేకరించాలని జిహెచ్‌ఎంపి లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. మరోవైపు జలమండలిలో మూడు రోజుల్లో 25కోట్ల రూపాయల బకాయిలు వసూలయ్యాయి. బకాయి పన్ను కట్టనివాళ్ల కలెక్షన్లను జలమండలి అధికారులు తొలగిస్తున్నారు.

## బాలలను ప్రేమించడంలో ఎంతో ఆనందం ఉంది!

**బాలల దినోత్సవంలో ఉండి ఎమ్మెల్యే శివరామరాజు.**



**తాళం హనుమంతరావు, ఉండి(రా.వా):** నేటి బాలలే రేపటి పౌరులే కాదు...దేశాభివృద్ధికి దిక్సూచికలని ఉండి ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. మహదేవపట్నం, ఎన్నార్పీ అగ్రహారం స్కూళ్లలో జరిగిన బాలల దినోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లలతో ఆటలు ఆడారు. అనంతరం హెచ్‌ఎంల అధ్యక్షతన జరిగిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ బాల్యంలోనే విద్యార్థుల్లో నిబడీకృతంగా ఉండే టాలెంటులను గుర్తించి తగిన తర్ఫీదు నిస్తే దేశం గర్వించే మేధావులుగా వారిని తీర్చిదిద్దవచ్చునన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో విద్యాబుద్ధులను అందించిడం ద్వారా ఎందరో ఆణిముత్యాల్లాంటి వానిని తయారు చేయవచ్చునన్నారు. ఈకార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనం తగ్గడం ఆందోళనకరం!

**గ్రంథాలయ ఉత్సవాల్లో ఉండి సర్పంచ్ ముదునూరి విజయ.**

**తాళం హనుమంతరావు,ఉండి(రా.వా):** అన్ని వర్గాల్లోనూ రాను రాను పుస్తక పఠనంపై పాఠకుల ఆసక్తి సన్నగిల్లడం ఆందోళన కల్గిస్తోందని, దాని ప్రాధాన్యతలను అందురూ గుర్తించి ప్రోత్సహించాలని ఉండి సర్పంచ్ ముదునూరి విజయ అన్నారు.ఉండిలో 49వ జాతీయ గ్రంథాలయ ఉత్సవాలను సర్పంచ్ ప్రారంభించారు. తొలుత చాచా నెహ్రూ చిత్రపటానికి పులమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రాంథాలయాలు విజ్ఞాన దేవాలయాలన్నారు. గ్రంథాలయాల నర్వహణకు అధికంగా నిధులు కేటాయించాలన్నారు. విద్యార్థులు, యువత టీవీలకు అతుక్కుపోవడం, ఇతర వ్యాసకాలతో పుస్తకాలను చదవడం పట్ల శ్రద్ధాశక్తులు చూపడం లేదన్నారు. ఈవైఖరిలో మార్పుకు అందరూ కృషి చేయాలన్నారు. గ్రంథాలయ అధికారి, ఉత్సవాల కన్వీనర్ ముదునూరి మహంకాళిరాజు వారోత్సవాల వివరాలను తెలిపారు. సాహితీవేత్త గాదిరాజు రంగరాజు నెహ్రూ జీవిత విశేషాలను సభికులకు వివరించారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి పద్మావతి, తెలుగునాయకులు కృష్ణరాజు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## ఉండిలో బహుళ ప్రయోజన యంత్రంతో పనులు!




**ఉండి అంగన్‌వాడీ సెంటరు వద్ద ఈయంత్రంతో రోడ్డును నిర్మిస్తున్న దృశ్యం**

**తాళం హనుమంతరావు, ఉండి(రా.వా) :** ఉండి ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు ఆద్వర్యంలో రూపొందించిన బహుళ ప్రయోజన యంత్రం(మల్టీ పర్పస్ మెషిన్)తో ఉండి కాపుల పేటలో రోడ్డు అంచులను క్లీన్ చేసారు. అంతే కాకుండా ఉండి అంగన్ వాడీ సెంటరు వద్ద ఈయంత్రంతోనే గ్రావెల్‌ను సర్ధించి, చదును చేసారు. ఈయంత్రాలను ఏలూరులో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించి మెషిన్ పనితీరు గురించి తెల్సుకున్నారు. దీంతో రోడ్డు బెర్మలను క్లీన్ చేయడం, డ్రైనేజీలను బాగు చేయడం, రోడ్డులను నిర్మించడం, రోలింగ్ చేయడం, మెటీరియల్స్‌ను రవాణా చేయడంపొదులు, చిట్టడవి, చెట్లను తొలగించడం తదితర పనులను ఈ యంత్రంతోనే చేసే విధంగా ఉండి ఎమ్మెల్యే శివ దీన్ని డిజైన్ చేయించారు. దీని ఖరీదు రూ18లక్షలు అవుతుంది. ఇలాంటి 3యంత్రాలను దాతలు సహకారంతో నియోజకవర్గంలోని వివిధ పనులను తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో నెరవేర్చడం కోసం ముఖ్యమంత్రి సమక్షంలో ఉండి ఎమ్మెల్యే శివకు అందజేసారు. ఆదివారం ఈయంత్రంతో వివిధ పనులను ఉండి ఎంపిటిసి మోపిదేవి మంగమణి, ఈమె భర్త నాగ శ్రీనివాస్‌ల ఆద్వర్యంలో నిర్వహించారు. బహుళ ప్రయోజన యంత్రాన్ని స్థానికులు ఆసక్తితో గమనించి ఉండి శివకు అభినందనలు తెలిపారు. కేవలం 3లీటర్ల డీజిల్‌తో 3గంటల పైగా ఈయంత్రంతో పనులు చేయవచ్చు.

## పెదపుల్లేరులో అన్న సమారాధన!

**ముఖ్య అతిథిగా హాజరైన ఉండి ఎమ్మెల్యే శివరామరాజు.**



**తాళం హనుమంతరావు, ఉండి(రా.వా) :** పెదపుల్లేరు గ్రామంలోని గ్రామ దేవత శ్రీసత్తెమ్మ అమ్మవరా ఆలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. పలు కార్యక్రమాలతో ఆద్యంతం ఆసక్తిదాయకంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఉండి ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు మాట్లాడుతూ కార్తీక మాసంలో సమారాధన కార్యక్రమాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. అన్ని కులాలు, మతాల మధ్య సుహృద్భావనలను ఇలాంటి కార్యక్రమాలు కల్గిస్తాయన్నారు. ఈకార్యక్రమంలో జమిందారు కృష్ణరాజు, కలిదిండి శ్రీనుబాబు, భాస్కరరాజు, సూర్యనారాయణరాజు, నడింపల్లి సత్తిబాబు, టిడిపీ నాయకులు జుత్తిగ శ్రీనివాస్, కాగిత మహంకాళి, సర్పంచ్ హేమలత, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## గ్రంథాయాలల్లో మౌలిక వసతులు మెరుగుపరుస్తాం!

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీరామ్మూర్తి.**




**కార్టూనిస్టు రంగరాజును సత్కరిస్తున్న దృశ్యం**

**హనుమంతరావు, ఉండి(రా.వా) :** జిల్లా వ్యాపితంగా గ్రంథాలయాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీరామ్మూర్తి అన్నారు. 49వ గ్రంథాలయ జాతీయ వారోత్సవాల్లో భాగంగా ఉండి ఉండి శాఖ గ్రంథాలయ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రంథాలయ పాలకులు ముదునూరి మహంకాళిరాజు అధ్యక్షతన జరిగిన సభలో శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ రూ6కోట్ల వ్యంతో జిల్లాలోని 73 శాఖాగ్రంథాయాలు, 12గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న గ్రంథాలయాల అభివృద్ధికి, కొత్త భవనాలకు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. త్వరలో ప్రముఖ గ్రంథాలయాల్లో పనిచేస్తున్న వారికి వృత్తి శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తామన్నారు. ఏలూరు గ్రంథాలయంలో పోలీసు కానిస్టేబుల్స్‌కు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. అనంతరం ప్రముఖ కార్టూనిస్టు గాదిరాజు రంగరాజు ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆయన ప్రారంభించి, రంగరాజు సత్కరించారు. చాచా నెహ్రూ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ నిర్వహణ బాగుందని గ్రంథాలయ పాలకులు మహంకాళిరాజును ఆయన అభినందించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముదునూరి విజయకృష్ణరాజు, తెలుగుదేశం నాయకులు ముదునూరి కృష్ణరాజు, ఉండి ఏఎంసి వైస్ చైర్మన్ కట్టా గంగాధరరావు, ఆర్య వైశ్య సంఘం నాయకులు బొండాడ కేశవరావు, సాయిబాబా, కె బ్రహ్మానందం, మండా వెంకయ్య, పాశా నరిసింహారావు, వి. భరద్వాజ్ మాష్టారు, చదువుల సంఘం అధ్యక్షులు దాడి జగ్గరాజు తదితరులు మాట్లాడారు.

## పెద్ద కరెన్సీ నోట్ల రద్దుతో రోడ్డెక్కిన సామాన్యుడు

**రాజధాని ప్రతినిధి-కోనసీమ, జిన్‌రావ్ :** కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతాపార్టీ ప్రభుత్వ నరేంద్ర మోడీ రూ.500, రూ.1000 కరెన్సీ నోట్ల రద్దుతో దేశవ్యాప్తంగా గందళగోళం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ పెద్ద నోట్ల రద్దుతో సామాన్య మానవుడి కష్టాలు చెప్పలేని స్థితిలో ఉన్నాయి. దినసరి కూలీలు తమ పనులు మానుకుని యాజమానులు ఇచ్చిన పాతనోట్లు మార్చుకునేందుకు బ్యాంకుల వద్ద క్యూ లైన్లలో నిలుచోలేక నానా అవస్థలు పడుతున్నారు. పాతనోట్లు తీసుకోమని అధికారులు చెపుతున్నా ఎక్కడా పాత నోట్లను తీసుకుని వారికి కావాల్సిన సేవలు అందించడంలేదు. సూపర్ మార్కెట్లు, పెట్రోల్ బంకులు, కాయగూరల దుకాణాలు, బంగారు వర్తకులు, మిల్క్ డైయిరి, మీ సేవా కేంద్రాలు, ప్రైవేటు బ్యాంకులు కూడా ఈ నోట్లను వ్యతిరేకిస్తున్నారు. సహకార బ్యాంకులు కూడా రూ.500, రూ.1000 నోట్లను తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు. అయితే రూ.500, రూ.1000 నోట్ల రద్దు, దాని స్థానంలో రూ.2000నోటు విడుదల కావడంతో వాటికి కూడా చిల్లర ఇవ్వకపోవడం, రూ.500, రూ.1000 నోట్లు ఇంతవరకు విడుదల చేయకపోవడంతో




ప్రజానీకం పడుతున్న కష్టాలు వర్ణాతీతం. ఏటిఎంలు, బ్యాంకులు కూడా విత్‌డ్రాలు చేసుకునేందుకు నగదుపై పరిమితి విధించడంతో కష్టాలు ఎదురవుతున్నాయి. ఇక వివాహాది శుభకార్యాలకు కూడా నగదు మారకం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పెద్ద కరెన్సీ నోట్ల రద్దుతో ధనవంతుల కంటే సామాన్యులే ఎక్కువ ఇక్కట్లుకు గురవుతున్నారు.

## 27న రుద్రాక్ష పూజ

**రాజధాని ప్రతినిధి-కోనసీమ, జిన్‌రావ్ :** అమలాపురం రమణవీధి శివాలయంరోడ్డులో వేంచేసియున్న శ్రీసర్వమంగళ రామంలింగేశ్వర ప్రసన్నాంజనేయ షిర్డిసాయి స్వామివార్ల ఆలయంలో నవంబర్ 27 ఆదివారం కార్తీకమాస మాసశివరాత్రి మహాపర్వదినం సందర్భంగా షష్టాదశ(16వ) శతసహస్ర పంచముఖి రుద్రాక్ష పూజా మహోత్సవం శ్రీశ్రీశ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతి మహాస్వామివారి ఆశీస్సులతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త మాచిరాజు రవికుమార్ తెలిపారు. కార్యక్రమాల్లో భాగంగా సర్వమంగళ రామలింగేశ్వరస్వామివారికి శ్రీవాడ్రేవు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 16వ శతసహస్ర పంచముఖి రుద్రాక్ష పూజ, సర్వమంగళాదేవి అమ్మవారికి శతసహస్ర కుంకుమపూజ, శ్రీమోక్షగణపతికి శతసహస్ర గరికపూజ, శ్రీషిర్డిసాయిబాబా వారికి శతసహస్ర బిల్వార్చన, శ్రీప్రసన్నాంజనేయ స్వామివారికి శతసహస్ర సింధూర, నాగవల్లీదళ పూజలు బ్రహ్మశ్రీ అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితావధాని ఆచార్య బ్రహ్మత్వంలో 22మంది ఋత్వికులచే పూజా కార్యక్రమాలు నిర్వహించబడును. ఉదయం 9.15 గంటలకు పుర



ప్రముఖులచే సప్తనదీ జలాలతో శ్రీజగద్గురు పుష్పగిరి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతి మహాస్వామివారిచే మహిమాన్విత పంచముఖి శతసహస్ర రుద్రాక్షలకు సంప్రోక్షణ, సాయంత్రం 6గంటలకు స్వామివారి ప్రవచనము నిర్వహించనున్నారు. అనంతరం రాత్రి 7.30గంటల నుండి ఆలయ ప్రాంగణం వద్ద కార్తీక సమారాధన, ప్రసాద వితరణ నిర్వహించబడును.

## క్లబ్ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన!



**ఆటల పోటీలో విజేతలకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం.**

**తాళం హనుమంతరావు, ఉండి(రా.వా) :**పవిత్రమైన కార్తీక మాసంలో ప్రకృతి వడిలో గడపడం, భోజనాలు చేయడం వల్ల ఆరోగ్యపరంగానూ, ఆద్యాత్మికపరంగానో ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్షులు భూపతిరాజు సుబ్బరాజు అన్నారు. మహదేవపట్నం గ్రామంలోని సుగుణ వృద్ధుల ఆశ్రమంలో క్లబ్ ఆద్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగింది. ఈసందర్భంగా క్లబ్ సభ్యులకు లెమెన్ అండ్ స్పూన్, జికే, క్విజ్ తదితర పోటీలను నిర్వహించారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేసారు. ఈసందర్భంగా జరిగిన సభకు అధ్యక్షత వహించిన సుబ్బరాజు మాట్లాడుతూ ప్రకృతి ధర్మాలను మానవులు దిక్కరించడం వల్లే ప్రకృతి ప్రకోపాలకు గురికావల్సి వస్తుందన్నారు. ప్రకృతిని ప్రసన్నం చేసుకోవల్సిన బాద్యత మానవాళిపై ఉందన్నారు. ప్రధాన కార్యదర్శి పి నరసింహారావు మాట్లాడుతూ కార్తీక మాస విశిష్టతలను వివరించారు. రుద్రరాజు నరసరాజు మాట్లాడుతూ క్లబ్ ఆద్వర్యంలో క్రమం తప్పకుండా విద్య, వైద్య సేవలను అందించమే కాకుండా సభ్యులలో ఐకమత్యం, భావస్వారూప్యతలను కాపాడ్డానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానూ దోహదపడతాయన్నారు. అనంతరం వృద్ధాశ్రమ అధినేత పెరుమాళ్ళ ఫణికుమార్‌కు వృద్ధుల పరుపుల కోసం రూ5వేల నగదును అధ్యక్షులు సుబ్బరాజు చేతుల మీదుగా అందజేసారు. సాహితీవేత్త గాదిరాజు రంగరాజు మాట్లాడుతూ తులసి, మామిడి, ఉసిరి వంటి వనాల మధ్య భోజనాలు చేయడం ఎంతో శ్రేయస్కరమన్నారు. ఈకార్యక్రమంలో జోన్ చైర్మన్ కన్నెగంటి రూత్‌కళ, బొండాడ కేశవరావు, నంబూరి కాశీ విశ్వేశ్వరరావు, హరినాధరాజు, కూనపరాజు రామరాజు, పెన్మెత్స పద్మావతి, వేగేశ్న అనంతలక్ష్మి, కాగిత మహంకాళి, గాదిరాజు వెంకటేశ్వరరాజు, రామసూరి, సన్నిధి నరసింహారావు, వాసు, కలిదిండి సీతారామరాజు, పెదఅప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛభారత్‌కు కార్పోరేట్ సంస్థల సహకారం

**జిల్లా కలెక్టర్ అరుణ్‌కుమార్**

**రాజధాని ప్రతినిధి-కోనసీమ, జిన్‌రావ్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వచ్ఛభారత్‌కు కార్పోరేట్ సంస్థలు, స్వచ్ఛంధ సంస్థలు సహకారం అందించేందుకు ముందుకొస్తున్నాయని జిల్లా కలెక్టర్ అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా నిర్మించి వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు ఎటువంటి నిధుల కొరత లేదన్నారు. ఓఎన్‌జిసి, కెయిర్న్ వంటి చమురు సంస్థలు, నాగార్జున కనస్ట్రక్షన్స్ వంటి సంస్థలు తమవంతు సాయం అందిస్తున్నాయన్నారు. అమలాపురంలోని అంబేద్కర్ సామాజిక భవనంలో జడ్పి సిఈవొ కె.పద్మ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో ఐఎస్‌ఎల్ నిర్మాణంలో ఉన్న కొత్తపేట మండలం ముందంజలో ఉందని అనాతవరం, ఐ.పోలవరం, పి.గన్నవరం మండలాలు ఉన్నాయన్నారు. చిట్టచివర ముమ్మిడివరం నిలిచిందన్నారు. సిసి రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా డంపింగ్ యార్డులకు అనువైన స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో డ్వామా పిడి నాగేశ్వరరావు, డిఆర్‌డిఎ పిడి ఎస్.మల్లిబాబు, గృహనిర్మాణ శాఖ పిడి సెల్వరాజ్, ఆర్డివొ జి.గణేష్‌కుమార్, పంచాయితీరాజ్ ఈఈ సత్యనారాయణ, డివిజనల్ పంచాయితీ అధికారి జెవిఎస్‌ఎస్ శర్మ పాల్గొన్నారు.

# చిన్నవ్యాపారాలపై రాష్ట్రాలకే అజమాయిషీ

**న్యూఢిల్లీ :** వస్తు వినియోగ పన్నుతో వ్యాపారాలపై కేంద్రం గుత్తాధిపత్యాన్ని రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ వారం కేంద్రంతో సమావేశమవుతున్న రాష్ట్రాలు ఈ విషయంలో తమ వాదనను బలంగా వినిపించనున్నాయి. రూ. 1.5 కోట్లు టర్నోవర్ ఉండాలని కేరళ, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ ప్రభుత్వాలు కోరుతున్నాయి. పన్నుచెల్లింపుదారులను నిలువునా విభాగించడం ద్వారా పన్ను చెల్లింపులు, ఆడిట్‌లు సమస్యలకు దారితీస్తాయన్నారు. కేరళ, బెంగాల్, తమిళనాడు, బీహార్, ఢిల్లీ, ఒడిశా లాంటి రాష్ట్రాలు పన్ను విధింపులో ద్వంద్వ వ్యవస్థలు (కేంద్ర, రాష్ట్ర) ఉండాలని కోరుకుంటున్నాయి. వస్తు వినియోగ పన్నులో నాలుగంచెల పథకం 5,12,18,28 శాతం పన్నులుండాలని కేంద్రం భావిస్తోంది. దీంతో నవండరు 4న కేంద్రం రాష్ట్రాలతో జరిపిన వేశం విఫలం అయ్యింది. ఏ పన్నులు కేంద్రాధి కారంలో ఉండాలి. ఏపన్నులు రాష్ట్రాధికారంలో ఉండాలనేదానిపై ఇంతవరకు స్పష్టత రాలేదు.

అన్ని రాష్ట్రాల ఆర్థికమంత్రులు ఈనెల 20న ఈ విషయంపై సయావేశం కానున్నారు. ఆపై నవంబరు 24 - 25 తేదీల్లో తదుపరి చర్చలు జరుపుతారు. వాణిజ్యాన్ని నిలుపు, అడ్డం విభాగాలుగా చేయడం వల్ల పన్ను చెల్లింపుదారులు పరిపాలనా, ఆడిట్ విభాగాలుగా విభజనకు గురవుతారు. రూ. 1.5 కోట్లు పైగల వ్యాపారాలపై కేంద్రానికి, రాష్ట్రాలకు కూడా అధికారాలుంటాయి. అంతకంటే తక్కువ వ్యాపారాలావాదేవీలు నడుపుతున్న వాటిపై రాష్ట్ర ప్రభుత్వాలకు మాత్రమే అధికారం ఉంటుంది. నిలువు విభజన మూడేళ్లలో పన్ను, ఆడిట్ అమలుకు కాగా, అడ్డ విభజన అసమగ్రంగా ఉందని రాష్ట్రాలు భావిస్తున్నాయి.

# నోట్ల మార్పిడి నిబంధనలు పాటించాలి

**ముంబై :** రూ.500, వెయ్యినోట్ల నగదు మార్పిడి విషయంలో కచ్చితమైన నియమ, నిబంధనలు పాటించాలని భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) అర్బన్ కో - ఆపరేటివ్, స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంకులను ఆదేశించింది. ముఖ్యంగా ఖాతాదారుల నుంచి నగదు స్వీకరణలో కొ- ఆపరేటివ్ బ్యాంకుల నుంచి సహకారం లేదంటూ పలు చోట్ల ఫిర్యాదు అందిన నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ ఆదేశాలు జారీ చేసింది. 'అర్బన్ కో- ఆపరేటివ్ బ్యాంకుల ప్రాంతీయ కార్యాలయాలు, స్టేట్ కో- ఆపరేటివ్ బ్యాంకులు, నాబార్డులు.. ఆర్‌బీఐ నియమ, నిబంధనలను కచ్చితంగా పాటించాలి' అని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

# పెద్దనోట్ల రద్దుతో ... గందరగోళంలో గల్ఫ్ భారతీయుల

**దుబాయ్ :** గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న వాస్తవ్యులు నల్లధనం నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న పెద్దనోట్ల ఉపసంహరణకు సానుకూలంగా స్పందించినప్పటికీ, విదేశాల్లో పలు ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుందని ఆందోళన వెలిబుచ్చారు. దేశంలో నకిలీ కరెన్సీ నియంత్రణకు, పెద్ద ఎత్తున పేరుకుపోతున్న నల్లధనంపై చెక్ పెట్టేందుకు మోడీ ప్రభుత్వ నిర్ణయం పట్ల ఎక్స్‌ప్రెస్ మనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధేష్ గిరియాన్ తమ హర్షాతిరేకాన్నివ్యక్తం చేసారు. పారదర్శకతకు ప్రధాని పెద్దపీటవేశారని, న్యాయపరమైన ఆర్జనకు భయపడవలసిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో వినియోగదారులు కొంతవరకు అసౌకర్యానికి గురైనప్పటికీ నూతనవిధానాలకు తెరదీస్తుందన్నారు. బ్యాకింగ్ వ్యవస్థ మరింత లాభపడనుందనీ, బ్యాంకుల రుణ సౌకర్యం మరింత పెరగనుందని తెలిపారు. రియల్ ఎస్టేట్ రంగం మరింత నష్టపోతుందన్నారు. నోట్ల ఉపసంహరణతో భారతీయ ఆర్థికవ్యవస్థ మరింత పురోగమించే ందుకు అవకాశాలుఎక్కువగా ఉన్నాయని అండ్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పొర్ట్స్ ప్రమోషన్ కైన్సిల్ గ్రూప్ డైరెక్టర్ కమల్‌వాచాని వెల్లడించారు. తాత్కాలికంగా మార్కెట్ నష్టపోయినప్పటికీ, ప్రజలు క్యాష్ డిపాజిట్లకు మొగ్గ చూపుతారని కమల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సౌదీ అరేబియా, దమాన్‌లోని ఇండియన్ ఐటి ప్రొఫెషనల్ అర్షద్ హుస్సేన్ మాట్లాడుతూ, పెద్దనోట్ల ఉపసంహరణతో కేవలం 10 శాతంకన్నా తక్కువమందిపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. ఎన్‌ఆర్‌ఐలు తమ వద్దనున్న నోట్లను మార్చలేరనీ సౌదీలోని రెబిట్టెన్స్ సెంటర్లలో సైతం ఈ నోట్లను తీసుకునేందుకు అంగీకరించడంలేదన్నారు. ఈ విధానంతో భారతీయులు తమ స్వదేశానికి వెళ్లేందుకు పలు ఇబ్బందులను ఎదుర్కోవలసివస్తుందన్నారు. ఒకే వ్యక్తి కేవలం రూ.8,000లను మాత్రమే తన వద్దనున్న క్యాష్‌ను పోస్ట్ ద్వారా పంపిచాననీ తెలిపారు. దుబాయ్‌లోని గ్రాఫిక్ డిజైనర్ సంజయ్ ప్రసాద్ మాట్లాడుతూ, దీర్ఘకాలంలో ప్రధాని తీసుకున్న నిర్ణయం ప్రయోజన కరంగా ఉంటుందని సంతోషాన్ని వెలిబుచ్చారు. ఇప్పటి వరకు తాము నాన్ రెసిడెంట్ ఆర్డినరీ రూపీ ఎకౌంట్‌లోనే తాము డిపాజిట్ చేసుకోవచ్చునని, దీర్ఘకాలంలో దీని వలన పలు ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుందన్నారు.

# ఏపీకి రూ.1000కోట్ల పతంజలి పెట్టుబడి

**సీఎం చంద్రబాబుతో భేటీ అయిన బృందం**



**రాజధాని ప్రతినిధి ,(విజయవాడ) :** దక్షిణ భారతదేశంలోనే మొదటిసారిగా ఏపీలో మెగా ఫుడ్ పార్కు ఏర్పాటుకు దేశీయ ఉత్పత్తుల అగ్రగామి సంస్థ పతంజలి గ్రూపు సంసిద్ధత వ్యక్తం చేసింది. సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయిన పతంజలి గ్రూపు వ్యవస్థాప కులు ఆచార్య బాలకృష్ణ తమ ప్రతిపాదనలను వివరించారు. ఏపీలో మెగా ఫుడ్ పార్కు ఆవుల సంతతి పరి రక్షణ కేంద్రం, అయుర్వేద విశ్వవిద్యాలయం ఏర్పాటుకు పతంజలి గ్రూప్ సిద్ధంగా వుందని సీఎంకు వివరించారు. ఈ ప్రాజెక్టుల ఏర్పాటుకు సంబంధించి విశాఖ, విజయనగరం ప్రాంతాఓల్ల ఇప్పటికే స్థలపరిశీలన చేసినట్లు చెప్పారు. పతంజలి గ్రూపు ప్రధానంగా 5 ప్రాజెక్టుల ఉర్పాటుకు సన్నద్ధమవుతుండగా, వీటిలో రెండు ప్రాజెక్టులు గోశాల నిర్వహణతోపాటు గోసంతతి అభివృద్ధి కేంద్రం, ఆయుర్వేద విశ్వవిద్యాలయం ఏర్పాటు సహాయయంతో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉత్తరాంధ్రలో మెగాఫుడ్ పార్కు ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపారు. బిస్కట్లు వంటి ఆహారపదార్థాల ఉత్పత్తుల తయారీ పరిశ్రమ ఏర్పాటుతోపాటు యోగ, నేచురోపతి సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. ఈ 5పరిశ్రమల ఏర్పాటు ప్రతిపాదనలో వచ్చిన పతంజలి ప్రతినిధులను సీఎం అభినందించారు.

విరాట్ పై ముందడుగు : భారత నావికాదళానికి చెందిన విశ్రాంత యుద్ధనౌక ఐఎన్ఎస్ విరాట్‌ను ఏపీ టూరిజం శాఖకు అప్పగించే అంశంపై చర్చజరిగింది. నేవీ వైస్ అడ్మిరల్ హెచ్‌సీఎస్ బిస్త్ భేటీ సీఎంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు విరాట్‌పై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుంత్వాలు సంయుక్తంగా ఒక కంపెనీ ఏర్పాటు చేసి విరాట్‌ను ఆకర్షణీయ పర్యాటకకేంద్రంగా ఏర్పాటు చేద్దామని ప్రతిపాదించారు. ఇందుకోసం ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నామని చెప్పారు.

# శ్రీస్వామి ఆలయంలో ఘనంగా లక్షబిల్వార్చన



**తాళం హనుమంతరావు, ఉండి(రా.వా) :** చెరుకువాడ గ్రామంలో శ్రీపార్వతీ సమేత చెన్నమల్లేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా లక్ష బిల్వార్చన మహోత్సవం జరిగింది. ఉదయం నుంచి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పంచగమ్యం, మండపారాధన, అఖం స్థాపన, మహాన్యాస పారాయణ, ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, నవగ్రహ హోమం, రుద్ర హోమంలను వేద విద్వాంసులు సంగమేశ్వర మల్లిఖార్జున శర్మ, శ్రీనివాస శర్మ, కాళ్లకూరి గణపతి శర్మల ఆద్వర్యంలో సంప్రదాయబద్ధంగా వైభవంగా జరిగాయి. హోమంలో పీతలపై మాజీ సర్పంచ్ సన్నిధి నరసింహరావు, ఉండి పిహెచ్‌సి కమిటీ చైర్మన్ కట్టా రాంబాబు, ఆలయ కమిటీ చైర్మన్లు పెనెమత్స పద్మావతి, చిట్టిబొమ్మల నరసింహస్వామి, పచ్చిపులుసు శేషుగుప్త, వెలిగట్ల ప్రసాదు తదితరులు కూర్చుని పూజలు జరిపారు. సాయంత్రం శ్రీస్వామి వారికి నీరీజన మంత్ర పుష్పం, తీర్థప్రసాదవినియోగం జరిగాయి. పూర్ణాహుతి కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని హారతి తీసుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పెనెమత్స పద్మావతి, ట్రస్టీలు చిక్కాల కృష్ణమూర్తి, జన్ను సత్యనారాయణ, జయమంగళ నాగరాజు, పుల్లూరి వెంకటేశ్వరరావు, జాలే చిన నరసన్ను, బలభద్ర నాగ వెంకటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తోట శ్రీనివాసరావు, సుబ్బరాజు గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం

# సాయంకాలంలో భోజనం ఏ విధముగా తినాలి



డాక్టర్. మంతెన సత్యన్నారాయణ

**సూ**ర్యుడిని బట్టి జీర్ణక్రియ ఉంటుంది. మధ్యాహ్నం సూర్యుడు తీవ్రంగా ఉన్నట్లే, జీర్ణక్రియ కూడా చురుగ్గా అరిగించేట్లుగా ఉంటుంది. దీనిని బట్టి మనం తేలిగ్గా, తర్వాత జీర్ణమయ్యే ఆహారాన్నే సాయంకాలం భోజనంలో తీసుకోవాలి. మనం తిన్న ఆహారం తర్వగా అరిగిపోతే అప్పట్నుండీ మన శరీరం క్లీనింగ్ అనే రెండు పనులను వెంటనే ప్రారంభించి మనల్ని రక్షించే ప్రయత్నం చేస్తుంది. ఈ సత్యాన్ని మన పూర్వీకులు ఎప్పుడో తెలుసుకుని ఆచరణలో పెట్టి, మనకు తెలియజేసారు. ప్రొద్దుపోయి తింటే జబ్బులొస్తాయని, రాక్షసుల్లా రాత్రికి తిసకండనే మాటల ద్వారా మందిలించేవారు, సాయంకాలం భోజనం విషయంలో మన పెద్దలు చెప్పిన కొన్ని నియమాలను పరిశీలిద్దాం. సాయంకాలం భోజనంలో పెరుగువేసుకూడదని, కాస్త వెలితిగా తినమని, కంది, పెసరపప్పు సాయంకాలం వండకూడదని దుంపకూరలు సాయంకాలం అరగవని, అలాగే ఆకుకూరలు, నూనె కూరలు సాయంకాలం వండుకోకూడదని నియమాలను పెట్టారు. ఇవి చాలా కరెక్టు. ఎందుకంటే రాత్రికి విశ్రాంతి తీసుకోవలసిన శరీరానికి ఎక్కువ శక్తి నిచ్చే ఆహారాలు, ఎక్కువ సమయం జీర్ణానికి పట్టే ఆహారాలు పనికిరావు. ఒక వేళ తింటే లావు పెరగడం, జబ్బులు రావడం జరుగుతుంది. సాయంకాలం భోజనం మాత్రం ఆరోగ్యం విషయంలో ప్రముఖ పాత్ర పోషిస్తుంది. సాయంకాలం భోజనంలో తినకూడనివి, తినకూడనంత, తినకూడని సమయంలో తినడం వల్ల సగానికిపైగా మన జబ్బులకు కారణమవుతందని చెప్పవచ్చు. ఈ రోజుల్లో వైద్యులకు కూడా ఈ సిద్దాంతం అంతగా తెలియదు. ఒక ఇంట్లో చిన్నపిల్లల దగ్గర్నుండీ, ముసలివాళ్ళ వరకు అన్ని రకాల వయస్సుల వారు కూడా ఉంటూ ఉంటారు. అది తప్పు, ఒక్కొక్కరి శరీర అవసరాలు వేరు. ఒక్కొక్కరి వయస్సు వేరు. అందరి పనులు వేరు. ఇలాంటప్పుడు అందరూ ఒకే రకంగా తినడం ఎంతో దోషం. మన అవసరాలు, వయసు, శరీరాన్ని బట్టి మన భోజనముండాలి. సాయంకాలం వండే కూరలను మాత్రం చాలా చప్పగా, ఉప్పు, నూనెలు లేకుండా వండుకుంటే తర్వగా అరిగి శరీరానికి సహకరిస్తాయి. ప్రయత్నించి చూడండి. మధ్యాహ్నం ఎలా వండినప్పటికీ, సాయంకాలం మాత్రం జాగ్రత్తపడండి. ఎవరు, ఎలా తింటే మంచిదో ఆలోచిద్దాము.

**అన్నం తినతగిన వారు**

బాగా కష్టపడి ఎండలో చెమటలు కార్చిపనిచేసేవారు, ఎదిగే వయస్సులో ఉన్న పిల్లలు, బాగా సన్నగా నీరసంగా ఉన్నవారు అన్నం తినే అర్హతను కలిగి ఉంటారు. ఆ అన్నం ముడి బియ్యపు అన్నం అయితే మరీ మంచిది. కూరలను చక్కగా వండి, 40 శాతం కూర, 60 శాతం అన్నం కలుపుకుని తినాలి. పొట్టను మాత్రం 80 శాతం నింపి 20 శాతం ఖాళాగా ఉండాలి. పెరుగుమాని మజ్జిగ వాడితే సరిపోతుంది. నిండుగా తింటే త్వరగా అరగదు.

**రొట్టెలు, ఉడికిన కూర తినతగిన వారు**

బరువు తగ్గవలసిన వారు, సుగరు వ్యాధి తగ్గవలసినవారు, తగినంత ఉండి బరువు ఇక పెరగకుండా ఉండాలనుకునేవారు, శ్రమ చేయక నీడ పట్టున ఉండేవారు మొదలగువారికి ఇది మంచిది. ఆడించిన పిండితో రొట్టెలు పుల్కాలుగా నూనె లేకుండా పెనంపై కాల్చుకుని, 3,4 పెట్టుకుని అందులోకి చప్పటి కూరను బాగా ఎక్కువగా 75 శాతం పెట్టుకుని తినవచ్చు. కావాలంటే చిన్నకప్పు మజ్జిగ తాగవచ్చు. ఇక అన్నం వద్దు. ఇక్కడితో హద్దు.

**రొట్టెలు, పచ్చికూర తినతగిన వారు**

బాగా సుగరు వ్యాధి కంట్రోలులో లేక ఇబ్బంది పడేవారు, ఎక్కువ అధిక బరువుతో బాధపడేవారు. మొండి కీళ్ళ నెప్పులున్నవారు, దీర్ఘకాలిక చర్మ వ్యాధులున్నవారు, వంటపని లేకుండా తిందామనుకునే వారికి ఇది మంచిది. ఉడికిన కూర చప్పదనం కంటే పచ్చికూరలే ఇవి మరీ మంచిది. వీరు 3,4 గోధుమ పుల్కాలు, కావలసినంత ఎక్కువ పచ్చి కూరతో తింటే మంచిది.

**పండ్లు తినవలసిన వారు**

నిద్రమత్తు తగ్గాలనుకునే వారు, గురకపొట్ట పోవాలనుకునేవారు, త్వరగా నిద్ర రావాలనుకునేవారు, ధ్యాన ఆసక్తి ఉన్నవారు, ఆధ్యాత్మిక సాధనాపరులు, రోగాలు కాకుండా జీవిద్దాం అనుకునేవారు రిటైరైన దంపతులు, సాయంకాలం పొయ్యిని వద్దనుకునేవారు, రెక్కలు కదలని, చెమటలు పట్టని పనిచేసేవారు, బరువు తగ్గవలసినవారు, పెందకడనే ఇంటికి రావడం కుదరనివారు కేవలం పండ్లనే తిని సరిపెట్టుకునే అదృష్టాన్ని పొందితే మంచిది. నీరసం రాకుండా 10,15 ఖర్జూరం పండ్లను కూడా పండ్లతో కలిపి తీసుకోవచ్చు. పుల్లటి పండ్ల రసాలను (నారింజ, కమల) పండ్లు తినడానికి 1-2-1 గంట ముందు రసం తీసుకుని తాగడం మంచిది (సా॥5-6గం॥మధ్య) 6 నుండి 6.30 మధ్య పండ్లను తింటే మంచిది. ఏ కాలంలో దొరికే పండ్లను ఆ కాలంలో పొట్ట నిండా తినవచ్చు. డబ్బులు లేనివారు జామకాయలను, అరటిపండ్లు, ఖర్జూరాన్నే ఆహారంగా ముగించవచ్చు. మొక్కజొన్న పొత్తులు లేతగా ఉన్నవాటిని కూడా అలానే కాల్చకూండా తిని దోషం లేదు. పండ్లు తిన్నవారికి 1. 1-2 -2 గంటలోనే ఆ ఆహారం అరిగి శరీరం త్వరగా రాత్రి కార్యక్రమాన్ని ప్రారంభిస్తుంది. అందుచేతనే అన్నింటికంటే ఈ రోజుల్లో వారికి ఇది మంచి మార్గము.

**గమనిక :** సుగరు ఉన్నవారు అరటిపండ్లు, ఖర్జూరం సుగరు పూర్తిగా కంట్రోలు అయ్యేవరకు తినకూడదు.

# పల్లెల అభివృద్ధే తెలుగుదేశం ధ్యేయం!

**ఉండి ఎమ్మెల్యే వెంకట శివరామరాజు**



చిలుకూరులో సీసీ రోడ్డుకు ప్రారంభోత్సవం చేస్తున్న ప్రజాప్రతినిధులు

**తాళం హనుమంతరావు, ఉండి(రా.వా):** దేశానికి పట్టుకొమ్మలైన పల్లేసీమల అభివృద్ధే తెలుగుదేశ ప్రభుత్వ లక్ష్యమని ఉండి ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. చిలుకూరు, మహదేవపట్నంచ ఎన్నార్పీ అగ్రహారం గ్రామాల్లో జన చైతన్యయాత్ర ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. ఊరూరా జెండాలను ఆవిష్కరించారు. ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు ముదునూరి వెంకట సోమవాజు, వేగేశ్న అనంతలక్ష్మి, దూసనపూడి రాంబాబుల అధ్యక్షతన సభలు జరిగాయి. ఈసందర్భంగా జరిగిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. మహదేవసట్నంలో అంగన్‌వాడీ భవనాలకు, బాక్స్ కల్వర్టుకు శంకుస్థాపన చేసారు. అండర్ డ్రైనేజీ సిష్టం ఏర్పాటు చేయిస్తానన్నారు. ఉత్తరపాలెం, ఉప్పర గూడెం, మండపాక వారి వీధి, భవానీపేట, ఎస్సీ ఎస్టీ, బీసీ పేటల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారంభించారు.

చిలుకూరు-పులిగొమ్మ పుంతరోడ్డు, చిలుకూరు-గరగపర్రు ఆర్ అండ్ బి రోడ్డును రూ2కోట్ల నిధులతోనూ, చిలుకూరు-మహదేవపట్నం రోడ్డును రూ3కోట్లతోనూ పూర్తి చేసినట్లు చెప్పారు. రెండవ ఓవర్ హెడ్ స్కీముకు రూ45లక్షలతో ప్రతిపాదనలు పంపానన్నారు. ఎస్సీ సబ్ ప్లాను నిధులతో పేటల్లో సీసీ రోడ్లు నిర్మిస్తానన్నారు. గ్రామాల్లో జరిగిన మోటారు సైకిల్ ర్యాలీల్లో పార్టీనేతలు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈకార్యక్రమాల్లో ఎంపిపి దలియ లక్ష్మి, జడ్‌పిటిసి కరిమెరక తులసి, సర్పంచ్ మేడిద ప్రియదర్శినివిజయరత్నం, సాయిరాజు, సుబ్బరాజు, గంధం బుజ్జి, వనిమా సుబ్బలక్ష్మిశ్రీనివాస్, నరిసే భారతి, గిడుతూరి కాశీ, అనంతలక్ష్మి, సుజాత తదితరులు ప్రసంగించారు.

# కార్మిక హక్కులకు భంగం

**'ఏపీ మున్సిపల్ వర్కర్స్' రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగనాయకులు**

**రాజధాని ప్రతినిధి, (గుంటూరు కార్పొరేషన్ ) :** కార్మిక హక్కులను హరించి పనిభారాన్ని పెంచే జీఓ 279ని తక్షణమే రద్దు చేయాలని ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. రంగనాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని మల్లయ్యలింగం భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీఓ 151, జీఓ 193ని అమలు చేయాలని కోరారు. 16 రోజుల సమ్మె కాలానికి రాష్ట్ర క్యాబినెట్ ఇచ్చిన హామీ మేరకు వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో 279ని రద్దు చేస్తామంటే కార్మికుల నమ్మబోరని తెలిపారు. రోజుకు రూ.10లు ఖర్చు అయ్యేదానికి రూ.30లు ఖర్చుతో ఆయా మున్సిపాలిటీలపై పెనుభారం మోపడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికే చంద్రబాబు ప్రవేశపెట్టిన పొదుపు సంఘాలు ఆయన మానసపుత్రికగా రాష్ట్రంలో మెజారిటీ ప్రాంతాలలో పొదుపు సంఘాలు ఎక్కువగా మున్సిపాలిటీలలో పనిచేస్తుంటే, మున్సిపాలిటీలో పనిచేసే కార్మికుల పొట్టలను కొట్టడానికి కంకణం కట్టుకున్నారని చెప్పారు. 2011లో 15 రోజుల సెలవులు , వారాంతపు సెలవులు, మెటర్నిటి సెలవులు ఇస్తామని ఉత్తర్వులు జారీఅయినా అమలు కాలేదన్నారు. వీటిని అమలు చేయని కమిషనర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రచార ఆర్భాటాలతో వీధులలో నాయకులు, ప్రజాప్రతినిధులు చీపుర్లు పట్టి 5 నిముషాలు పత్రికలలకు ఫోజు ఇస్తే స్వచాంధ్రప్రదేశ్ సాధ్యమౌతుందా అంటూ ప్రశ్నించారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోట మాలాద్రి మాట్లాడుతూ జీఓ 279 పేరుతో అనేక సంవ్వతరాలుగా ఉపాధి పొందిన రిటైర్డ్ కార్మికులు, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలను ఇబ్బంది పెట్టొదన్నారు. గతంలో లాగే మున్సిపల్ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జీఓ 151ని అమలు పరచి ఇంజనీరింగ్ విభాగంలోని డ్రైవర్స్ కంప్యూటర్ ఆపరేటర్స్, విద్యుత్ విభాగాలకు జీతాలు తొందరగా ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కానిపక్షంలో డిసెంబర్ 5 నుంచి 23 వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బండెల రవికుమార్, గుంటూరు, కృష్ణా జిల్లాల నగర అధ్యక్షులు మేకల నరసింహులు, రమేష్, గుంటూరు నగర కోశాధికారి వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# 7న పీఎస్ఎల్‌వీ ప్రయోగం

**శ్రీ హరికోట :** పీఎస్ఎల్ వీ-సి 36ను వచ్చే నెల 7న నెల్లూరు జిల్లాఓని షార్ (శ్రీహరికోట) నుంచి నింగిలోకి పంపాలని ఇస్రో శాస్త్రవేత్తలు నిర్ణయించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాకెట్ సన్నద్ధత సమావేశం (ఎంఆర్ఆర్) నిర్వహించారు. శాస్త్రవేత్తలు రాకెట్ అనుసంధానం, ఉపగ్రహ పరీక్షలపై సమీక్షించారు. పీఎస్ఎల్‌వీ వాహకనౌక 1225 కిలోల బరువు ఉన్న రిసోర్స్‌శాట్-2ఎ ఉపగ్రహాన్ని మోసుకెళ్లనుండి.

# నోట్ల రద్దుతో ఆర్థిక గందరగోళం

**వడోదర :** కేంద్రం అనూహ్యంగా తీసుకున్న పెద్ద నోట్ల రద్దు నిర్ణయాన్ని బ్యాంకు యూనియన్లు విమర్శించాయి. ఎలాంటి ముందస్తు ప్రణాళికలు లేకుండా కేంద్రం తీసుకున్న అనాలోచిత నిర్ణయం వల్ల దేశంలో ఆర్థిక గందరగోళం ఏర్పడిందని ఇండియన్ బ్యాంకు అసోసియేషన్ (ఐబీఏ), ఆల్ ఇండియన్ బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏఐబీఓఏ) , ఆల్ బ్యాంకు ఎంప్లయిస్ అసోసియేషన్ (ఏఐబీ ఈఏ) విమర్శించాయి. కేంద్రం నిర్ణయంతో దేశంలో అన్ని బ్యాంకుల్లోనూ గందరగోళ పరిస్థితి ఏర్పడింది. దీని వల్ల అధికారులు, ఉద్యోగులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని

**బ్యాంక్ యూనియన్లు**

ఏఐబీఓఏ కార్యదర్శి ఎస్ నాగరాజు, ఏఐబీఈఏ కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం పేర్కొన్నారు. రూ.500,రూ.1000 నోట్లను రద్దు చేయడంతో చాలామంది కస్టమర్లు రూ.100 నోట్లనే అడుగుతున్నారు.

కానీ రూ.100 నోట్ల లోటు తీవ్రత చాలా ఉంది. కొత్తగా ఆర్బీఐ విడుదల చేసిన రూ.2000 నోట్లను తీసుకోవడానికి కస్టమర్లు ఏ మాత్రం ఆసక్తి చూపడం లేదని వారు తెలిపారు. ఓ పెద్ద నిర్ణయం తీసుకునే ముందు ప్రస్తుతం ఎన్ని చిన్ననోట్లు చలామణిలో ఉన్నాయో కేంద్రం, ఆర్బీఐ పక్కా లెక్కలు తెలుసుకొని బాగుండేదని వారు అన్నారు. రూ.500 నోట్ల రద్దు చేసిన ప్రభుత్వం వాటి స్థానంలో కొత్తగా ముద్రించిన రూ.500 నోట్లను ఎందుకు సరఫరా చేయడం లేదో అర్థం కావడం లేదన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 2.20 లక్షల ఏటీఎంలలో కొన్ని పూర్తిగా ముతపడ్డాయి. మరికొన్ని పాక్షికంగానే పనిచేస్తున్నాయి. దీంతో కస్టమర్లు డబ్బులు కోసం బ్యాంకులకు వస్తున్నారు.దీని వల్ల బ్యాంకు ఉద్యోగులపై అధిక ఒత్తిడి పడుతోందని వాపోయారు. వీలైనంత తొందరగా కొత్తగా ముద్రించిన రూ.500 నోట్లతో పాటు మరిన్ని రూ.100 నోట్లను కూడా విడుదల చేయాలని ఆర్బీఐకి వారు విజ్ఞప్తి చేశారు.

# నోట్ల రద్దు
# చంద్రబాబుకు ముందే ఏలా తెలుసు..!

కాంద్రు సుధాకర్‌బాబు

**రాజధాని ప్రతినిధి ,(విజయవాడ) :** పెద్దనోట్లు రద్దు విషయం చంద్రబాబుకు ముందే తెలిసి తన నల్లధనాన్ని వైట్‌గా మార్చుకున్నారని, దానిలో భాగంగానే తమ కుటంబకంపెనీ అయిన హెరిటేజ్ కంపెనీని అమ్మేయ్యడం అనుమానాలకు తావిస్తుందని దీనిపై విచారణ చేపట్టాలని సామాజిక సాధికార కమిటి అధ్యక్షులు కాంద్రు సుధాకర్‌బాబు తెలిపారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్దనోట్లు రద్దు చేయడం అవివేక చర్యగా అభివర్ణించారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని 100 రోజుల్లో తీసుకువచ్చి పేద ప్రజల బ్యాంకు ఖాతాలో వేస్తామని చెప్పిన ప్రధాని ప్రస్తుతం ప్రజలను బ్యాంకుల చుట్టూ తిప్పుతూ ఉండలో గంటల తరబడి క్యూలో నిలబడేలా అష్టకష్టాల పాలు చేస్తున్నారన్నారు. ప్రధాని తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రజలు పిచ్చి తుగ్లక్ నిర్ణయంగా అభివర్ణిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ నిర్ణయం వలన దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్థంగా తయారయ్యే అవకాశముందన్నారు. 500, 1000 రూపాయల నోట్లను రద్దు చేసిన ప్రభుత్వం 2000 వేల నోటును విడుదల చేయడం వలన నల్లధనాన్ని నియంత్రించకపోగా నల్లకుభేరులకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి. చైతన్య, కె.దయాకర్‌బాబు కె.సాల్మన్‌బాబు పాల్గొన్నారు.

# బీచ్ ఫెస్టివల్‌తో భారతీయ సంస్కృతిపై దాడి

**రాజధాని ప్రతినిధి ,(విజయవాడ) :** బీచ్ ఫెస్టివల్ పేరుతో భారతీయ సంస్కృతిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాడికి పాల్పడుతోందని ఏపీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ అన్నారు. స్థానిక పీసీసీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బీచ్ లవ్ ఫెస్టివల్ అనేదీ.. విదేశీ సంస్కృతి అని, పాశ్యాత్య సంస్క ృతిని తీసుకొచ్చి ఇక్కడ సంప్రదాయాలపై దాడి చేయాలని ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. గతంలో జరిగిన ప్రేమికుల రోజు కార్యాక్రమాల్లో, ప్రేమ జంటలు కూర్చున్న చోటకు బీజేపీ, అనుబంధ సంస్థలు ఏబీవీపీ, భజరంగ్దళ్లు వెళి చట్టానికి వ్యతిరేకంగా దాడి చేసి పరిమితి కొట్టారని గుర్తుచేశారు. బలవంతంగా ప్రేమజంటకు మంగళసూత్రాలు ఇచ్చి కట్టించిన ఘటనలున్నాయని, ఇప్పుడుబీచ్ లవ్ ఫెస్టివల్స్‌పై బీజేపీ అధ్యక్షులు హరిబాబు జవాబు చెప్పాలని డిమాండు చేశారు. అనంతరం విదేశీ యువతులతో టీడీపీ నేత నారా లోకేష్ కలిసివున్న ఫోటోలను ఆమె మీడియాకు విడుదల చేశారు. ఈసమావేశంలో కుర్షిదా, బాడిత పద్మ జక్కుల ఇందిరాగాంధీ పాల్గొన్నారు.

# ఆడుతూ పాడుతూ చదువుకోండి

బాలల హక్కుల పరిరక్షణ పోస్టర్ ఆవిష్కరించిన సీపీ

**రాజధాని ప్రతినిధి ,(విజయవాడ) :** చైల్డ్‌రైట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల హక్కుల పరిరక్షణ - చైతన్య వారోత్సవాల పోస్టరును నగర పోలీస్ కమిషనర్ గౌతమ్ సవాంగ్ ఆవిష్కరించారు. చైతన్య వారోత్సవాల సందర్భంగా, పోలీసులచే రక్షించబడి, వివిధ పిల్లల సంరక్షణ కేంద్రాల్లో చేరిన చిన్నారులంతా సీపీని కలిశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు వారంతా ధన్యవాదాలు తెలుపుతూ, సురక్ష బంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోస్టరుపై సీపీ సవాంగ్ తొలి సంతకం చేసి, బాలలచే ప్రతిజ్ఞ చేయించారు. బాలలంతా ఆడుతూ, పాడుతూ చదువుకోవాలని, సంతోషంగా ఉండాలని సూచించారు. జాయింట్ సీపీ హరికుమార్, డీసీపీ జీవీజీ అశోక్‌కుమార్, సిటీ స్పెషల్ బ్రాంచి ఏసీపీ రమేష్, విజయవాడ సిటీ చైల్డ్‌లైన్ కో - ఆర్డినేటర్ అరవ రమేష్, నవజీవన్, అరుణోదయ ఎస్‌కెసివి చిల్డ్రన్స్ ట్రస్టు బాలలు పాల్గొన్నారు.

# టాటా గ్లోబల్ బేవరేజస్ నుంచి అయుర్వేద టీపొడి విడుదల

**రాజధాని ప్రతినిధి ,(విజయవాడ) :** ప్రజల అరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని టాటా గ్లోబల్ బేవరేజస్ అయుర్వేద మిళితమైన టీ పోడి టీవేద ను విడుదల చేస్తున్నట్లు టాటా గ్లోబల్ బేవరేజస్ రీజనల్ ప్రెసిడెంట్ సుశాంత్‌దాష్ నేడోక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రకటనలో ఆయన వినియోగదారుల అభిరుచికి తగ్గట్టుగా పరిశోధనలు అధ్యయ నాలు చేసి వారి అరోగ్యసంరక్షణను దృష్టిలో పెట్టుకొని ఈ అయుర్వేద టీ ని విడుదలచేస్తున్నట్లు తెలిపారు. ఈ వేదా టీ పోడిలో లూజ్ లీఫ్ టీ,టీ వేదప్రో ఎనర్జీ, టీ వేద ప్రో ఉమెన్ మూడు విభిన్నమైనరకాలు ఉన్నాయని తెలిపారు. టీ వేద ప్రో ఉమెన్ రకం నేటి మహిళ ఒత్తిడితో కూడిన జీవన శైలీన దృష్టిలో పెట్టుకొని అశ్వగంధ, జరవారీ వంటి అయుర్వేద వనమూలికల సమ్మెళనంతో తయారు చేయ్యటం జరిగిందని తెలిపారు. ఈ టీ వేద 250 గ్రాముల ప్యాక్, 100గ్రాముల ప్యాక్‌లలో అన్ని గ్రాసరీ స్టోర్స్‌లో, అమెజాన్, బిగ్‌బాస్కెట్‌లలో లభిస్తాయని తెలిపారు.

# గెలిచి ఓడిన ట్రంప్...



అమెరికా ప్రజలు విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. మెజారిటీతో గెలిచిన అధ్యక్షుడిని ఎంతమాత్రమూ అంగీకరించడం లేదు. నిజానికి ప్రపంచ దేశాలు కూడా ఆయన ఎన్నికవడాన్ని జీర్ణించుకోలేక పోతున్నాయి. ట్రంప్ మా అధ్యక్షుడు కాదని, ప్రజలంతా రోడ్లపైకి వచ్చి ఆందోళన జరుపుతున్నారు. ఆందోళనాకారులను చెదరగొట్టడానికి పోలీసులు బాష్పవాయుగోళాలను ఉపయోగిస్తున్నారు. ఎన్నికయిన అధ్యక్షుడిని అంగీకరించాలని, అయితే శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రజాస్వామ్యంలో ప్రతి వ్యక్తికీ ఉందని ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా తెలిపారు. ఉద్యోగాలు పోతాయని, చదువులు కొనసాగించడం కష్టమని యువత అభిప్రాయపడటమే అందుకు కారణం. వ్యాపారులకు, డబ్బున్నవారికి మాత్రమే ట్రంప్ అనుకూలంగా ఉంటారని అక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆందోళనల వెనుకు మీడియా పనిచేస్తుందని ట్రంప్ విమర్శించారు. దానిని అణిచి వేయాలని కూడా ఆయన ఆదేశించారు. అమెరికాలో నివసిస్తున్న విదేశీయులు అనుకున్నట్లే జరిగింది. 32 కోట్ల జనాభా కలిగిన దేశం నుంచి 30 లక్షల మందిని దేశం నుంచి వెళ్లగొడతామని ట్రంప్ ప్రకటించారు.

ముగ్గురు భార్యలున్న ట్రంప్ చిన్న భార్య మెలనీయ ట్రంప్ కొడుకు బేరన్‌తో శ్వేతసౌధంలోకి అడుగు పెట్టబోతున్నారు. రెండో భార్య మర్లా మేపల్స్ విదేశీ వ్యవహారాలు కోరుకుంటున్నారు. అల్లుడు జారెడ్ కుష్నర్ వైట్ హౌస్‌లో కీలకమైన భాధ్యతలు అందుకుంటానికి ఉత్సాహం చూపుతున్నారు. ఈ నేపథ్యంలో అమెరికాను గొప్ప దేశంగా మారుద్దామని ట్రంప్ ప్రకటించినా దానిని కాలానికే వదిలేయక తప్పదు.

### భారత్‌లో ట్రంప్ నిర్మాణాలు

అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ భారత్‌తో సహా 30 దేశాల అధిపతులకు ఫోన్లు చేశారు. మోడీ పాలన బాగుందని, రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడతాయని, ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రంప్‌కు భారత్‌లో ఐదు లగ్జరీ ప్రాజెక్టులు ఉన్నాయి. ఇందులో ట్రంప్ టవర్ కూడా ఉంది. దీనిని పుణెలో పంచశిల రియాలిటీ సంస్థతో కలిసి 46 అంతస్తుల్లో నిర్మిస్తున్నారు. మరో 300 అపార్టుమెంటులు ముంబయిలో నిర్మాణంలో ఉన్నాయి. భారత్‌లో వ్యాపారం మరింత విస్తరించేందుకు ట్రంప్ వారసులు ఆసక్తి కనబరుస్తున్నారు.

### న్యూయార్క్ టైమ్స్ ఝులక్...

అమెరికా అగ్రపీఠాధ్యక్ష ఎన్నికల్లో తను గెలిచినప్పటికీ, కవరేజీ సరిగా చేయనందున్న న్యూయార్స్ టైమ్స్ పత్రిక పాఠకులను తీవ్రంగా కోల్పోవాల్సి వస్తుందంటూ తెగ విమర్శలు గుప్పించిన డొనాల్డ్ ట్రంప్‌కు ఆ పత్రిక షాకిచ్చింది. సారీ డొనాల్డ్ ట్రంప్.. అమెరికా ఎన్నికల్లో గెలిచినప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు ఆరుసార్లు ఆ పత్రిక కవరేజీపై ట్రంప్ మండిపడ్డారు.

ఆ విమర్శలను కొట్టిపారేస్తూ న్యూయార్క్ టైమ్స్, తన పత్రికకు, డిజిటల్ న్యూస్ ప్రొడక్ట్స్‌కు ఈ వారంలో దాదాపు 41 వేల చెల్లింపు సభ్యత్వాలు నమోదయ్యాయంటూ వెల్లడించింది. నవంబర్ మొదట్లో మూడో క్వార్టర్లో ఈ పత్రిక తన ప్రకటనా ఆదాయాలను భారీగా కోల్పోయిన సంగతి తెలిసిందే. అయితే చందాదారులు పెరిగారని, డిజిటల్ న్యూస్ బాగా పెరిగినట్టు ఆ పత్రిక తెలియ చేసింది. 116,000 మంది కొత్త పాఠకులను చేర్చుకుని, మొత్తం 1.3 మిలియన్ సభ్యత్వాలను సొంతంచేసుకున్నట్టు పేర్కొంది. భారత సంతతి మహిళ దక్షిణ కరోలి గవర్నర్ నిక్కీ హేలీ (44)ను ట్రంప్ కేబినెట్‌లోకి తీసుకున్నారు.

### జాతీయ భద్రతా సలహాదారుగా మైఖేల్

తనకు అత్యంత నమ్మకస్తుడైన రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ మైఖేల్ ఫ్లిన్‌ను అమెరికా జాతీయ భద్రతా సలహాదారుగా నియమించాలని ట్రంప్ భావిస్తున్నారు. నిఘా అధికారిగా పనిచేసిన 56 ఏళ్ల ఫ్లిన్ ముక్కుసూటి మనిషిగా పేరుంది. తీవ్రవాదులకు చేయూతనివ్వడం మానుకోకుంటే పాకిస్థాన్ కు అమెరికా అందిస్తున్న ఆర్థిక సహాయం నిలిపివేయాలని ఫ్లిన్ తన పుస్తకంలో రాశారు. ఉగ్రవాదానికి అంతం చేయడానికి అవసరమైతే రష్యాతో చేతులు కలపాలని ట్రంప్ కు సలహాయిచ్చింది ఆయనేనని న్యూయార్క్ టైమ్స్ వెల్లడించింది.

- బోస్

## ఏపీ భవన్ విభజనపై సమావేశం 21కి వాయిదా

**హైదరాబాద్ :** ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ విభజనపై ఈనెల 18న జరగవలసిన ఉన్నతస్థాయి సమావేశం 21వ తేదీకి వాయిదా పడింది. పెద్ద నోట్లరద్దు, దేశంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో కేంద్రహోంశాఖ నిర్వహించాల్సిన ఈ సమావేశాన్ని వాయిదా వేసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఈ సమావేశానికి రెండు తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, ఉన్నతాధికారులు హాజరు కావాలని ఇప్పటికే కేంద్ర హోంశాఖ ఆయా రాష్ట్రాలకు సమాచారం అందించింది. ఢిల్లీలో ఉన్న ఏపీ భవన్‌ను 58,42 నిష్పత్తిలో విభజించాలని ఏపీ ప్రభుత్వం డిమాండ్ చేస్తుంటే ఈ భవనమంతా తమదేనని, తమ ప్రభుత్వానికి దక్కుతుందని తెలంగాణ ప్రభుత్వం వాదిస్తున్న సంగతి తెలిసిందే. ఇరు రాష్ట్రాల మధ్య సమన్వయం కుదుర్చేందుకు రంగంలోకి దిగిన హోంశాఖ 18న సమావేశం ఖరారు చేసింది. తాజా పరిణామాలతో ఈ సమావేశం 21వ తేదీకి వాయిదా పడింది.

## హ్యుందాయ్ ఎస్‌యూవీ టస్కాన్

### ధర రూ.18.99 లక్షలు



**న్యూఢిల్లీ :** ఎస్‌యూవీ పోర్టుఫోలియోను మరింత బలోపేతం చేసుకోవడానికి హ్యుందాయ్ మోటార్ ఆవిష్కరించింది. ప్రారంభ ధర రూ.18.99 లక్షల నుంచి రూ.24.99 లక్షల వరకు (ఎక్స్ షోరూం) ఢిల్లీగా నిర్ణయించారు. థర్డ్ జనరేషన్ టస్కాన్‌పెట్రోల్, డిజెల్ పవర్‌ట్రెయిన్ వెర్షన్‌లలో అందుబాటులో ఉంచింది. మాన్యువల్ పెట్రోల్ వెరియెంట్ ధర రూ.18.99 లక్షలు, డిజెల్ వర్షన్ ధర రూ.21.59 లక్షల నుంచి రూ. 23.48 లక్షల వరకు ఉంటుంది. పెట్రోల్ ఆటోమోటిక్ ధర రూ.21.79 లక్షల నుంచి డిజెల్ పవర్ ట్రెయిన్ ధర రూ.24.99 లక్షల వరకు ఉంటుందని కంపెని ఎండీ సీఈవో వైకె కూ మీడియాతో చెప్పారు. కొత్త టస్కన్‌ను అందుబాటులోకి తేవడంతో హుందాయ్ భారతీయ కస్టమర్లకు డ్రైవింగ్‌లో కొత్త అనుభూతిని కల్పిస్తుందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 45 లక్షల యూనిట్ల ఎస్‌యూనిట్ల ఎస్‌యూవీలు తిరుగుతుంటే వాటిలో టస్కాన్ వాటా గణనీయంగా ఉందని ఆయన అన్నారు. ఫీచర్ల విషయానికి వస్తే రెండు లీటర్ల పెట్రోల్, డిజెల్ ఇంజిన్లతో పాటు ఫుడ్‌ల్యాంప్, డౌన్‌హిల్ బ్రేక్ కంట్రోల్, ఫ్రంట్, రెయిర్‌పార్కింగ్ సెన్సా ర్లను అందుబాటులో ఉంచామన్నారు. పెట్రోల్ వెర్షన్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ 155 పీఎస్ పవర్‌తో లీటరుకు 13.03 మైలెజీ ఇస్తుందని పెట్రోల్ ఆటోమోటిక్ 12.95కిలో మీటర్లుమైలెజీ ఇస్తుంది. డిజెల్ వెర్షన్‌కు వస్తే 185 పీఎస్ పవర్‌తో లీటరు డిజెల్‌కు 18.42 కిలోమిటర్లు, ఆటోమెటిక్ వెర్షన్‌కు 16.38 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుంది. హ్యుందాయ్ మోటార్ ఇండియా దేశీయ మార్కెట్లో 70 లక్షల యూనిట్లు విక్రయించింది. వీటిలో ఎగుమతులు కూడా ఉన్నాయి. వచ్చే నాలుగేళ్లలో మరో నాలుగు ఎస్‌యూవీ మోడల్స్‌ను భారత్ మార్కెట్లో విడుదల చేస్తామని కూడా అన్నారు.

## శ్రీచెన్నమల్లేశ్వరునికి వెండి త్రిశూలం బహూకరణ


**రాజధాని ప్రతినిధి-కోనసీమ, జిన్‌రావ్ :** అమలాపురం పట్టణంలో ప్రసిద్ధిచెందిన భ్రమరాంబా సమేత చెన్నమల్లేశ్వరస్వామివారి ఆలయంలో ఉన్న శ్రీచెన్నమల్లేశ్వరస్వామికి రూ.99వేల విలువైన 1 కిలో 70గ్రాముల బరువైన వెండి త్రిశూలాన్ని పట్టణానికి చెందిన నందిపాటి శ్రీనివాసరత్నకుమార్ కుంటుంబ సభ్యులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముచ్చర్ల రెడ్డినాయుడు, రేకపల్లి ప్రసాద్, దున్నాల బాబి, తోట శ్రీను, ఆర్యవైశ్యసంఘ ప్రముఖులు పాల్గొన్నారు.

## ఆక్వాజోన్‌పై అభ్యంతరాల స్వీకరణ

**రాజధాని ప్రతినిధి-కోనసీమ, జిన్‌రావ్ :** ముమ్మిడివరం నగర పంచాయితీ పరిధిలో ఏర్పాటుచేసిన ఆక్వాజోన్‌పై అభ్యతంరాలు ఉంటే స్ధానిక మత్స్య శాఖ కార్యాలయానికి అందజేయాలని మత్స్య శాఖ సహాయ విస్తరణాధికారి వి.విమలకుమారి సూచించారు. నగర పంచాయితీ కార్యాలయంలో కమిషనర్ పి.రవివర్మ అధ్యక్షతన జరిగిన ఆక్వాజోన్ అవగాహనా సదస్సుపై ఆమె మాట్లాడారు. నగర పంచాయితీ పరిధిలోని సోమిదేవరపాలెం, చిప్పలపాలెం, బందరుపాలెం గ్రామాల్లో 110 హెక్టార్లను ఆక్వాజోన్‌గా గుర్తించారని దీనిపై అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## విస్తరణబాటలో అపోలో హాస్పటల్స్

### రూ.1,400 కోట్లు పెట్టుబడులు



**ముంబై :** హెల్త్‌కేర్ గ్రూపు అపోలో హాస్పటల్స్ విస్తరణ బాటపట్టింది. వచ్చే రెండళ్లలో రూ.1,400 కోట్లుపెట్టుబడులు పెడుతున్నట్లు కంపెనీ అధికారి ఒకరు ప్రకటించారు. కేన్సర్ కోసం త్వరలో చెన్నైలో అపోలో ఆస్పత్రిలో అత్యాధునిక ప్రోటాన్ థెరపి చికిత్సలు మొదలుపెడుతున్నట్లు చెప్పారు. అపోలో హాస్పటల్స్ చైర్మన్ ప్రతాప్ సీరెడ్డి ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ... వచ్చే రెండేళ్లలో రూ.1,400 కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు ఈ పెట్టుబడులతో కొత్త ఆస్పత్రులను ఏర్పాటు చేయడంతోపాటు... ప్రస్తుతం ఉన్న ఆస్పత్రులను విస్తరిస్తామని పేర్కొన్నారు. ప్రతాప్‌రెడ్డి ఇక్కడి నవీముంబైలో సూపర్ స్పెషాలిటీ టెరిటరీ కేర్ హాస్పటల్స్ ప్రారంభించిన తర్వాత ఈ విషయం తెలియజేశారు. చెన్నైలో ప్రోటాన్ థెరపి చికిత్స గురించి ప్రస్తావిస్తూ.. వచ్చే ఏడాదిన్నర కాలంలో ప్రోటాన్ థెరపి చికిత్సలు మొదలుపెడతామన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ చికిత్సలు కేవలం రెండు దేశాలు ఒకటి చైనా, రెండోది జపాన్‌లో మాత్రమే అందుబాటులో ఉన్నాయని, కేన్సర్ చికిత్సకు ప్రోటాన్ థెరపి వాడుతామని.. ప్రపంచంలో ప్రోటాన్ చికిత్సలో భారత్ మూడవస్థానానికి చేరుతుందని అపోలో హాస్పిటల్స్ మేనేజింగ్ డెరెక్టర్ సునీతారెడ్డి చెప్పారు. వైజాగ్, భువనేశ్వర్‌లలో కూడా ఆంకాలజీని సేవలు అందిస్తామని ఆమె తెలిపారు.

## రాయపూడిలో చెత్తకుండీలు శుభ్రత



**రాజధాని ప్రతినిధి :** రాజధాని ప్రాంతం తుళ్ళూరు మండలం రాయపూడి గ్రామ పంచాయితీ ఏరియాలో శానిటేషన్ నిమిత్తము శనివారం ప్రత్యేకంగా ప్రైవేటు సిబ్బందిచే ఊడ్చి, కాలువయందు గల సిల్టును, సదరు చెత్తను ట్రాక్టర్ ద్వారా ఎత్తించి దురంగా డంపింగ్ చేయుంచున్నామని వారు చెప్పారు.

## ఎస్‌బీఐ వద్ద మహిళా కాంగ్రెస్ ధర్నా



**రాజధాని ప్రతినిధి-విజయవాడ :** పెద్దనోట్ల రద్దు వల్ల కలిగిన ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో విజయవాడ కాళేశ్వరరావు మార్కెట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అనాలోచితంగా పెద్ద నోట్లు రద్దు చేయడంతో సామాన్యులు కష్టాలు పడుతున్నారన్నారు. బ్యాంకులు వద్ద మహిళాలు, వృద్ధులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. రోజుకు రూ.10 వేలు మార్చుకునే వెసులుబాటుతోపాటు అవసరమైనన్ని రూ.100 నోట్లు బ్యాంకులోనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.2వేల నోట్లతో నల్లధనం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, మహిళా కాంగ్రెస్ నాయకురాలికి మధ్య తీవ్ర స్థాయిలో కొద్ది సేపు వాగ్వాదం చోటుచేసుకుంది. సుంకర పద్మశ్రీతోపాటు మహిళా కాంగ్రెస్ నాయకులు సంబూరి లక్ష్మీ, బడితా పద్మ, జక్కుల ఇందిరా గాంధీ, కుర్షదాలను పోలీసులు వాహనంలో ఎక్కించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## "విధి నిర్వాహణ యే ఘనతకు మార్గం" వజీర్




విధి నిర్వాహణ యే ఘనతకు మార్గం అని ఉర్దూ కల్చరల్ అండ్ లిటరరీ అసోసియేషన్ అధ్యాక్షులు మహమ్మద్ వజీర్ అన్నారు. స్థానిక ఉర్దూ అకాడమీ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు గ్రహిత ఇస్మాయిల్ జబివుల్లా సన్మాన కార్యమములో పాల్గొని ప్రసగింస్తూ నజీర్‌పై విధంగా అన్నారు. గౌరవ అధ్యక్షులు అబ్దుల్ ఖయ్యుం మాట్లాడుతూ జబివుల్లా మంచి ఉపాధ్యాయులతోపాటు ఒక మంచి సోషల్ వర్కర్ అన్నారు. ఉపాధ్యాక్షులు సలీంబాష మాట్లాడుతూ ఇస్మాయిల్ జబివుల్లా ఒక మంచి వక్తా అని అన్నారు. ఈ కార్యక్రమములో డాక్టర్ కరీం,అబ్దుల్,రహిం, అహమద్ అలి,ముఖ్తియార్ అహమద్, పర్వేజ్ చిష్టి,రఫి, తదితరులు పాల్గొన్నారు.

## రూ.50కే పోస్టల్ అకౌంట్



**రాజధాని ప్రతినిధి-గుంటూరు :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి సేవలకు ఆదేశించినా పోస్టల్ శాఖ తనదైన శైలిలో ప్రజలకు సేవలు అందిస్తూనే ఉంది జిల్లావాసులు ఇటీవల పెద్ద నోట్లను రద్దు చేసిన నేపథ్యంలో వేల రూపాయలు పెట్టి బ్యాంకులో ఖాతాలు తెరవలేని సామాన్యుల కోసం తపాలా శాఖ వారు యాభై రూపాయలకే అకౌంట్ తెరిచే అవకాశం కల్పిస్తోంది. ఈ ఖాతాల ద్వారా నగదును జమ చేసుకోవచ్చు. డిపాజిట్లు చేసుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితిలో పెద్ద నోట్లను బదిలీ చేసుకునేందుకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న పోస్టల్ కేంద్రాలలో ఈ ఖాతాలు తెరుచుకోవచ్చు.

**ఖాతా తెరవాల్సిన విధానం...**

పోస్టల్ శాఖలో 50 రూపాయలకే అకౌంట్ తెరిచేందుకు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు కచ్చితంగా ఉండాలి. ఈ ఖాతాలో ఖాతాదారుడు రూ.49 వేల రూపాయల వరకు జమ చేసుకోవచ్చు. అంతకంటే అధికంగా నగదు డిపాజిట్ చేసుకునే ఖాతాదారులకు పాన్ కార్డ్ కచ్చితంగా ఉండాలి. ప్రభుత్వం బ్యాంక్ ఖాతాదారులతో పాటు పోస్టల్ శాఖలో ఖాతాలు ఉన్న వారికి కూడా వారంలో రూ.24 వేల రూపాయాలు తీసుకునేందుకు అవకాశం కల్పించింది.

## తపాలాశాఖాలో రూ.194.13 కోట్ల పాతనోట్ల మార్పిడి

### ఏపీ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ ఎం.సంపత్

**రాజధాని ప్రతినిధి-విజయవాడ :** భారత ప్రభుత్వం రద్దుచేసిన పాత పెద్దనోట్ల (రూ.500,1000)ను ఏపీలోని అన్ని తపాలా శాఖ కార్యాలయాల ద్వారా, ఇప్పటివరకూ రూ.194.13 కోట్ల నగదును ప్రజలు మార్చుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ ఎం.సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. సేవింగ్స్ ఖాతాల్లోకి మరో రూ.547.13 కోట్ల పాత నోట్ల నగదును మార్పిడి చేసుకున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజల సౌకార్యలయాల్లోనూ రద్దయిన నోట్లను సేవింగ్స్ ఖాతాల్లో జమ, విత్ డ్రాయల్ కోసం అవకాశం కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రధాన, ఉపతపాలా కార్యాలయలు ప్రతిరోజూ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకూ పనిచేస్తున్నాయని వివరించారు. వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించామని, ఈ అవకాశాన్ని సద్వినియోడం చేసుకోవాలని కోరారు.

## డిసెంబర్ 10న మాదిగల ఆమరణ నిరాహార దీక్ష

### నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాసరావు మాదిగ



**రాజధాని ప్రతినిధి-గుంటూరు :** శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ నవ్యాంధ్ర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆధ్వర్యంలో డిసెంబర్ 10న గుంటూరు కలెక్టరేట్ ఎదుట మాదిగల సామూహిక అమరణ నిరాహార దీక్ష చేపడుతున్నట్లు ఆ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు మాదిగ తెలిపారు. మార్కెట్ సెంటర్‌లోని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భారతీయ జనతా పార్టీపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. టీడీపీ, బీజేపీ మాదిగలకు ఇచ్చిన హామీలు, ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయాలని కోరారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చారని, కానీ రెండున్నరేళ్లుగా వర్గీకరణ చేయకపోవటం బాధాకరమన్నారు. నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మల్లవరపు రవిరాజా మాదిగ, కొరిటెపాటి ప్రేమ్‌కుమార్ మాదిగ, ఆర్.ఇశ్రాయేలు మాదిగ వినుకొండ బాబు మాదిగ, బి.జోషఫ్ తంబీ, జి.నాగేశ్వరరావు మాదిగ, జార్జి మాదిగ, బెంజిమెన్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఉండి హైస్కూలును మోడల్‌గా తీర్చిదిద్దుతాం!



**తాళం హనుమంతరావు, ఉండి(రా.వా) :** పురాతనమైన ఉండి హైస్కూలును దాతల సహకారంతో మోడల్ స్కూలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఉండి హైస్కూలు హెచ్‌ఎం ఎం శివరామరాజు అన్నారు. హైస్కూలు వద్ద దాతల అభినందన సభకు ఆయన అద్యక్షత వమించి మాట్లాడారు. ఈయజ్ఞంలో అన్ని వర్గాల జనం కలిసి రావాలని కోరారు. హెచ్‌ఎం మాట్లాడుతూ తెలుగుదేశం మండల పార్టీ ఉపాద్యక్షులు సాగిరాజు సాంభరాజు స్కూలు వద్ద ఆర్వో ప్లాంటుకు రూ1,20,000లు, సైకిల్ స్టాండు నిర్మాణానికి మరో రూ2లక్షల సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. పెదపుల్లేరుకు చెందిన లయన్స్‌క్లబ్ ప్రతినిధి కలిదిండి సీతారామరాజు స్కూలు ఫెన్సింగ్ కోసం రూ50వేలు విరాళం అందించారని వివరించారు. అదే గ్రామానికి చెందిన దాత తటవర్తి పాండురంగగుప్త 3క్రాంప్తన్ ఫ్యానులు, ఉపాధ్యాయని కె దుర్గాచాముండేశ్వరి ఒక ఫ్యాను, 82-83 పూర్వపు విద్యార్థుల బ్యాచ్ రూ5వేలు, పెమ్మరాజు సుబ్బరాజు రూ5వేలు, హిందీ టీచర్ ఎస్ రామలక్ష్మి రూ5వేలు విరాళాలుగా అందజేసినట్లు చెప్పి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో దాతలు , ఉపాధ్యాయులు గోపాలరాజు, రామకృష్ణారావు, సాయిరామ్, సత్యనారాయణరాజు, హనుమంతు వెంకటేశ్వరరావు, లక్ష్మీపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములకు 'కంచె'

- కబ్జాకు గురికాకుండా కట్టుదిట్ట చర్యలు
- రాష్ట్రంలో 92 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమి గుర్తింపు

**రాజధాని ప్రతినిధి-విజయవాడ :** పారిశ్రామికాభివృద్ధి పేరుతో కార్పోరేట్‌వర్గాలకు పెద్దమొత్తంలో భూములు కట్టబెట్టేందుకు సిద్ధమైన ప్రభుత్వం, వాటిని కబ్జాలకు గురికాకుండా సంరక్షించేందుకు అవసరమైన కట్టుదిట్ట చర్యలు చేపట్టింది. గ్రామాల వారీగా ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపడుతున్నారు. రాష్ట్ర విభజన అనంతరం భూములు ధరలు రాష్ట్రవ్యాప్తంగా పెరిగాయి. ఇదే అదనుగా కొందరు అక్రమార్కులు దీంతో ప్రభుత్వం సర్కార్ భూముల పరిరక్షణకు రంగంలోకి దిగింది. ముఖ్యంగా రాజధాని ప్రాంతం అమరావతితోపాటు విశాపట్నం, రాజమండ్రి, కాకినాడ, తిరుపతి తదితర ముఖ్య నగరాల్లో విద్యా సంస్థలు, పరిశ్రమలు ఏర్పాటు అవుతుండడంతో నివాస స్థలాల ఆవశ్యకత పెరిగింది. దీంతో సహజంగానే భూములకు గారికీ పెరిగి క్రయ, విక్రయాలు జోరందు కున్నాయి. ఈ నేపథ్యంలో కొందరు అక్రమార్కులు దృష్టి ప్రభుత్వ భూములపై పడింది. కొందరు అవినీతి అధికారుల అండతో రాత్రికి రాత్రి ప్రభుత్వ భూముల్లో పాగా చేసి పొజిషన్ సర్టిఫికెట్లు పొంది. కబ్జాకుపాల్పడుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకునేలోపే కోర్టుల ద్వారా స్టేలు తెస్తూ ప్రభుత్వ యంత్రాంగాన్ని నిస్సహాయులను చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందు జాగ్రత్తగా సర్కారు భూములన్నిటినీ గుర్తించి వాటి పరిరక్షణకు నడుంబిగించింది. ఇలా ఏపీలోని 13 జిల్లాల్లో 30లక్షలకు పైగా సర్వేనెంబర్లులోని 92 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములను గుర్తించారు. ఈ భూములు కబ్జాకు గురికాకుండా వుండేలా చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, నిర్ణయించింది

**భూముల కంప్యూటరీకణ**

సర్కారు భూములను రాష్ట్రవ్యాప్తంగా గుర్తించి వాటిని కంప్యూటరీకరణ చేస్తున్నారు. ఏ గ్రామంలో ఎంత భూమివుంది. మండలంలో, జిల్లాలో మొత్తం సర్కారు భూమి ఎంత? అనేది ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. ఈ సర్వేనెంబర్లన్నీ అన్ని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నమోదవుతాయి. దీనివల్ల ఎక్కడైనా ప్రభుత్వం భూమి కబ్జాకు గురి అయితే వెంటనే గుర్తించడానికి వీలవుతుంది. అదే సమయంలో ఎవరైనా ఆ భూములను అమ్మకానికి ప్రయత్నిస్తే వాటి వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చడం వల్ల అప్పటికే రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆ సర్వే నెంబర్లు రికార్డు చేసి వుండడం వల్ల క్రయ, విక్రయాలకు బ్రేక్ పడుతుంది.



**ఏయే జిల్లాలో ఎంతెంత భూమి?**

ఏపీలోని 13 జిల్లాల్లో 92 లక్షల ఎకరాలకు పైగా సర్కారు భూములున్నట్లు రెవిన్యూ అధికారులు గుర్తించారు. జిల్లాలవారీగా పరిశీలిస్తే అత్యధికంగా కర్నూలు జిల్లాలో 14.53 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమి వుంది. ఆ తర్వాత చిత్తూరు జిల్లాలో 12.84 లక్షల ఎకరాలు, కడపలో 12.09 లక్షలు ఎకరాలు, నెల్లూరులో 11.52 లక్షల ఎకరాలు, అనంతపురంలో 8.86 లక్షలు, ప్రకాశం జిల్లాలో 6.67 లక్షలు, పశ్చిమగోదావరిలో 3.69 లక్షలు, శ్రీకాకుళంలో 2.60 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములున్నట్లు అధికారులు గుర్తించారు.

## లయోలలో అలరించిన పుస్తక ప్రదర్శన

**రాజధాని ప్రతినిధి - విజయవాడ :** ఆంధ్ర లయోల కళాశాల పీజీ లైబ్రరీ రీడింగ్ హాలులో జాతీయ పుస్తక వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పుస్తక ప్రదర్శనను సోమవారం డాక్టర్ రెక్స్ ఎంజిలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ,చదువు మనిషిని పరిపూర్ణుడిగా మార్చగలదని సూచించారు.ప్రిన్సిపాల్ జీఏపీ కిశోర్, ఆంధ్రా లయోల కళాశాల లైబ్రరిన్ జిఏ ప్రసాదరావు, వైస్ ప్రిన్సిపాల్ మెల్కియార్, ఎన్.భారతి పాల్గొన్నారు.

## నేషనల్ హెరాల్ట్ పున:ప్రారంభం

**న్యూఢిల్లీ :** ఎనిమిదేళ్ల ఏళ్ల కిందట మూతపడిన నేషనల్ హెరాల్ట్(ఎన్‌హెచ్) పత్రిక డిజిటల్ వర్షన్‌లో పున:ప్రారంభమైంది.వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్లు అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ తెలిపింది. ప్రింట్ వర్షన్‌ను కూడా త్వరలో పున:ప్రారంభిస్తామంది. 'కాలానుగుణంగా ప్రింట్ నుంచి డిజిటల్ వర్షన్‌కు ఎన్‌హెచ్ మారింది. ఎన్‌హెచ్ వ్యవస్థాపకులు నెహ్రూ నియమాలను, సంపాదకీయ దృష్టిని కొత్త వెబ్‌సైట్ కొనసాగిస్తుంది' అని వివరించింది.

## హాటెస్ట్ ఇయర్‌గా 2016 రికార్డు

**మరాకెచ్ :** అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన సంవత్సరంగా 2016 రికార్డులకెక్కింది. ఈ మేరకు ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూ ఎంవో) మొరొకాన్ నగరంలో సోమవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మరింత అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపింది.నివేదిక ప్రకారం ఈ ఏడాది సాధారణ ఉష్ణోగ్రతల కంటే 1.2 డిగ్రీల సెల్సియస్ మేరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించింది. భారతదేశంలో రాజస్థాన్‌లోని పలోడీలో ఈ ఏడాది మే నెలలో అత్యధికంగా 51 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్లు చెప్పింది. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈ ముందస్తు హెచ్చరికలను గమనించి విపత్తు నిర్వహణను, వాతావరణాన్ని అంచనా వేసే విధానాలను మరింత ధృడపరుచుకోవాలని డబ్ల్యూ ఎంవో సూచించింది. ఈ ఏడాది వేడి గాలులు కూడా అత్యంత ఎక్కువగా వీచాయని తెలిపింది.

## స్వర్ణభారతి ట్రస్ట్‌కి ఎంత చేరింది?

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

**రాజధాని ప్రతినిధి - అమరావతి :** పెద్ద నోట్ల రద్దు తనకు తెలీదంటున్న కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు తన స్వర్ణభారతి ట్రస్టులోకి ఎన్ని వేల కోట్ల రూపాయలు వచ్చి చేరాయో బయటపెట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. విజయావాడలో సోమవారం బ్యాంకుల బాట పట్టిన ఆయన ఖాతాదారుల ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోట్లకు పడగలెత్తిన పెద్దలు ముందే జాగ్రత్త పడ్డారని, సామాన్య ప్రజలే అవస్థలు పడుతున్నారన్నారు. నోట్ల రద్దు విసయం బీజేపీ, మిత్ర పక్షాలకు ముందే తెలుసునని, ఆరోపించారు. వీదేశీ బ్యాంకుల్లో రూ.80 లక్షల కోట్ల నల్లధనం ఉందని చెబుతున్న మోదీ ప్రభుత్వం ఆ డబ్బును ఎందుకు తీసుకురాలేపోయిందని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో అమ్నెస్టీ స్కీమ్ ద్వారా రూ.10వేల కోట్లు వైట్ చేసుకున్నారని చెబుతున్నారని, ఆ వ్యక్తిపై తక్షణం కేసు బనాయించి డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో విచారణ చేయాలని కోరారు. ఆయన వెంట సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీఎస్ మూర్తి, రాష్ట్ర కార్య దర్శివర్గ సభ్యులు రావు వెంకయ్య, జీ.ఓబులేసు, జిల్లా సీపీఐ కార్యదర్శి అక్కినేని వనజ, నగర పార్టీ అధ్యక్షుడు దోనేపూడి శంకర్ ఉన్నారు.

## బిల్లు చెల్లించని పంచాయితీలకు కరెంటు కట్!

- వచ్చే నెల నుంచి అమల్లోకి...
- క్షేత్రస్థాయి ఆదేశాలు జారీ
- రూ.1,200 కోట్ల బకాయిల వసూలపై దృష్టి

**రాజధాని ప్రతినిధి - అమరావతి :** రాష్ట్రంలో విద్యుత్ బిల్లులు చెల్లించని పంచాయితీలకు వచ్చే నెల నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేయాలని విద్యుత్ పంపిణీ సంస్థలు నిర్ణయించాయి. ఈ మేరకు క్షేత్రస్థాయి ఆదేశాలు కూడా వెళ్లాయి. పెండింగ్ బిల్లులు అన్నీ చెల్లించిన తర్వాతే తిరిగి పునరుద్ధరిస్తామని, ఈ విషయాన్ని ఇప్పటికే ప్రభుత్వానికి కూడా తెలిపామని డిస్కమ్‌ల ఉన్నతాధికారులు అంటున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా 12,920 గ్రామ పంచాయితీలున్నాయి. వీటి నుంచి రూ.1,200 కోట్ల మేర విద్యుత్ బకాయిలున్నాయి. కొన్ని పంచాయితీలు దాదాపు ఐదేళ్లుగా ఎలాంటి బిల్లులు చెల్లించడం లేదు.మరికొన్ని పాక్షికంగా చెల్లించాయి. బిల్లులను చెల్లించాలని ప్రతీ ఆరు నెలలకోసారి నోటీసులు పంపుతున్నా, పంచాయితీల నుంచి ఎలాంటి స్పందన రావడంలేదని అధికారులు అంటున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ టక్కర్‌కు అధికారులు వివరించారు. బిల్లు చెల్లించకుంటే నిబంధనల ప్రకారం విద్యుత్ సరఫరా నిలిపివేయాలని సీఎస్ కూడా స్పష్టం చేసినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇదే జరిగితే పంచాయితీ వీధుల్లో కారు చీకట్లు అలుముకు అవకాశం ఉంది. తాగునీటి సరఫరాకు పెద్ద ఎత్తున ఆటంకం ఏర్పడనుంది. 'ఉదయ్' పథకంలో చేరడం వల్ల పెండింగ్ బిల్లులకు తామే బాధ్యత వహించాల్సి ఉంటుందని, అందువల్ల విద్యుత్ సరఫరా నిలిపివేత అనివార్యమని విద్యుత్ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

## రెండు వేల నోట్లంటే భయం...భయం


**రాజధాని ప్రతినిధి - నగరం :** ఒక పక్క పాత నోట్ల రద్దుతో నానా అవస్థలు పడుతున్న ప్రజలు కొత్తగా వచ్చిన 2 వేల నోట్లు తీసుకోవాలంటే భయపడి పోతున్నారు. 2 వేల నోట్లకు చిల్లర దొరకటం కష్టమనేది ఒక కారణంగా కాగా 2 వేల నోట్లను రద్దు చేయాలని స్వయంగా రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో పాటు బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాకు ఫోన్ చేయడం అవసరమైతే కార్యాచరణకు దిగుతానని హెచ్చరించటం ప్రజల మధ్య కలకలం రేపింది. 2 వేలు నోట్లు వచ్చిరాగానే వాటి స్థానంలో దొంగనోట్లు వచ్చాయనే ఎలక్ట్రానిక్ మీడియా కథనాలు కూడా ఆనోటు ముట్టుకోవడానికి కొందరు భయపడుతున్నారు.

## కార్తీక వన సమారాధన

**గురజాల, (కెఎన్‌ఎన్) :** ప్రభుత్వ ఉద్యోగుల కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహజంచడం జరుగుతుందని గురజాల రెవిన్యూ ఉద్యోగుల అధ్యక్షులు కే ఆదినారాయణ తెలిపారు. బుధవారం విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ గురజాల మండల ఉద్యోగులు సోమవారం దాచేపల్లి మండలంలోని మైహోం సిమెంట్స్ కార్యాలయం వద్ద వన సమారాధణ కార్యాక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్డీవో ఈ మురళీ, తహాశీల్దార్లు, ఎంపీడీవోలు, రెవిన్యూ సిబ్బంది పాల్గొంటున్నట్లు తెలిపారు.

## తెలుగులో బీబీసీ ప్రసారాలు

**ముంబై :** యూకే మీడియో దిగ్గజం బీబీసీ తన సేవలను మరో 11 భాషలకు విస్తరించనున్నట్లు బుధవారం ప్రకటించింది. ఇందులో భారతీయ భాషలు తెలుగు, గుజరాతీ, మరాఠీ, పంజాబీ కూడా ఉన్నాయి. 1940 తరువాత సంస్థ చేపడుతున్న అతిపెద్ద విస్తరణ ఇదే. ప్రస్తుతం బీబీసీ ప్రసారాలు హిందీ, బెంగాలీ, తమిళం భాషల్లో కొనసాగుతున్నాయి. ఆ సంస్థ భారత్‌లో కొత్తగా 157 ఉద్యోగాలను కల్పించనుంది. యూకేకు ఆవల ఢిల్లీలో అతిపెద్ద బ్యూరోను నెలకొల్పనుంది. బీబీసీ కార్యక్రమాలు 29 భాషల్లో వారానికి సుమారు 35 కోట్ల మందికి చేరుతున్నాయి. తాజా విస్తరణల ఆరు కొరియా, ఆఫ్రికా భాషల్లో కూడా సేవలు మొదలవుతాయి.




రెండు కోట్ల కుటుంబాలని ఉద్దేశించిన ప్రసంగం : ఈ ప్రభుత్వం కనీసం 6 విషయాలలో భరోసా ఇచ్చేలా పరిపాలన చేసిందా అని ప్రజలను ఉద్దేశించి జగన్ మోహన్ రెడ్డి 6 విషయాలలో ప్రజల ముందు గళం విప్పారు. రాష్ట్ర విభజన తో బాగు పడ్డామో నష్టపోయమో ఆలోచించండి! మన హక్కుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏమైన పోరాటం చేసిందా, ప్రతి గ్రామం లో పిల్లలను చదివించుకోవాలని, చదువుకున్న పిల్లలకు మంచి ఉద్యోగం రావాలని, ఉండడానికి సరైన ఇల్లు ఉండాలి. రోగాలు వస్తే ఆస్తులు అమ్ముకోకుండా వైద్యం అందాలని వృద్దులైన తల్లిదండ్రులకు అండదండలు అందించే ప్రభుత్వం తోడుగా ఉండాలని చేసే ప్రతి పనిలో ఆదాయం తగ్గకుండా ఉండాలని మనం అందరం ఆశించాం. ఈ పై ఆరు విషయాలలో గడచిన రెండున్నర సంవత్సరాలలో మన రాష్ట్రము మనజీవన స్థితిలో ఎంత అభివృద్ధి జరిగిందో ప్రతి ఒక్కరు చూస్తూనే వున్నారు.

**బాబు వస్తే జాబు వస్తుంది**

ఎన్నికలలో బాబు వస్తే జాబ్ వస్తుంది అని మన అందరికి ఒక ఆశ చూపించితేనే లాంటి పలుకులు పలికి ఈ రోజు రెండున్నర సంవత్సరాలు కాలం గడచినా నిరుద్యోగ సమస్య రోజు రోజుకి పెరిగి పోతున్నా యువత భవిష్యత్తు గురించి పట్టించుకోని ఈ ప్రభుత్వం తీరును ప్రతి నిరుద్యోగ యువత తల్లిదండ్రులు చూస్తూనే వున్నారు.

**చేయి చేయి కలపండి - సమిష్టిగా పోరాడుదాం - జగన్**

మీరు ఆశించిన ప్రత్యేక హోదా వచ్చిందా ? అదిగో ప్రత్యేక హోదా వచ్చేస్తుంది మన రాష్ట్రం ఎంతో అభివృద్ధి చేందుతుంది ప్రజలు కష్టాలు తీరిపోతాయని అంటూ రెండున్నర సంవత్సరాలుగా ప్రగల్భాలు పలికి, నేడు రాష్ట్ర ప్రజలకు మొండి చేయి మాత్రమే మిగిలింది.

**మన రాష్ట్రంలో పరిశ్రమలు రావాలంటే ప్రత్యేక హోదా కావాలి.**

ఉద్యోగం రావాలంటె ప్రత్యేక హోదా కావాలి. మన పిల్లలు మన రాష్ట్రంలోనే మంచి ఉద్యోగాలు చేసుకుంటూ, మంచి జీతాలు సంపాదించు కోవాలనే కలలు నెరవేలాలంటే ప్రత్యేక హోదా కావాలి, అందుకే మన మందరం ప్రత్యేక హోదా వచ్చే వరకు ఉద్యమం ఆపరాదు. మేధావులారా గొంతెత్తండి.ఏ.పి.ప్రజలారా ప్రత్యేక హోదా వచ్చే వరకు చేయిచేయి కలపండి, సమిష్టిగా పోరాడుదాం, ప్రత్యేక హోదా సాధిద్దాం. మన రాష్ట్రము లో గత రెండున్నర సంవత్సరాలుగా మేధావులు మౌనంగా ఉండడం వలన ప్రభుత్వం అన్ని తప్పుడు నిర్ణయాలు తీసుకుంటోంది. ప్రభుత్వమును సరియైన దారిలో నడిపించాలి. ప్రత్యేక 2దా రావాలంటే మేధావుల సలహాలు చాలా ముఖ్యం. మన రాష్ట్ర ఆర్థిక స్థితి మెరుగు పడాలన్నా నిరుద్యోగ సమస్య తీరాలన్న వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలన్నా రైతులు కష్టాల్లోంచి బయటకు రావాలన్నా,డ్వాక్రా మహిళలు అభివృద్ధి చెందాలన్నా,పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందాలన్నా, కష్టాల ఊబిలో కూరుకుని పోయిన ప్రజానీకం బయటకు రావాలన్నా , రాష్ట్రంలో అందరికీ సమాన హోదా కలగాలన్నా ప్రతి ఇంటా ఆనందపు వెలుగులు నిండాలన్నా, మేధావులంతా చేయి చేయి కలిపి పోరు బాట వైపు నడచిన నాడే ప్రత్యేక హోదా సాధిస్తాం.



గడపగడపకు వైఎస్సార్ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు



హోదా గురించి ఆవేశంగా ప్రసంగిస్తున్న జగన్

విభజన ముందు అబద్ధాలు, అసత్యాలు ప్రచారం చేశారు. ప్రత్యేక హోదా ఇవ్వలేమని కేంద్రం చెబుతూ ఉంటే ఏ ప్యాకేజి ఇవ్వకపోయినా, అదిగో ప్రత్యక ప్యాకేజి ఇచ్చేస్తున్నారని అబద్ధాలు, అసత్యాలు ప్రచారం చేసి కాల యాపన చేసి ఐదున్నర కోట్ల ప్రజలకు నేడు వెన్నూ పోటు పొడిచారు.

**చంద్రబాబు ! ప్రత్యేక హోదా ఆకాశం నుండి ఊడి పడేది కాదయా !**

నా ఆవేదనను మీతో పంచుకోవడానికి వచ్చాను. మన రాష్ట్రంలో ప్రజలందరూ ప్రభుత్వం చెప్పిన మాయ కబుర్లలో పడి వారున్న పరిస్థితి తెలుసుకోలేకపోతున్నారు. నేను కొన్ని ఆలోచనలతో వచ్చాను. రాష్ట్ర విభజనతో మనం లాభ పడ్డామో నష్ట పోయమో చేతులెతి మీరే చెప్పండి ఎంత మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వచ్చాయో మీరే చెప్పండి.ఎన్నికలలో చేసిన వాగ్దానాలు, ఈ ప్రభుత్వం ఎన్ని నెరవేర్చిందో, చేతులెత్తి మీరే చెప్పండి.

రైతులు గత రెండున్నర సంవత్సరాలుగా ఆనందంగా వున్నారా ? లేరా ? చేతులెత్తి చెప్పండి. డ్వాక్రా మహిళలు ఏమైనా అభ్యుదయం సాధించారా ? లేదా? చేతులెత్తి మీరే చెప్పండి మీ గ్రామం లో ప్రతి ఒక్కరికి వైద్యం అందుతొందా ? లేదా ? చేతులెత్తి మీరే చెప్పండి. ఇప్పుడు సమయం ఆసన్నమైంది. ప్రతి ఒక్కరు మీరున్న పరిస్థితి అర్థం చేసుకొని ఉద్యమ బాట పట్టాలి.

**యువతా - మీకు జాబు వచ్చిందా - జగన్ చేతులెత్తి చెప్పండి-జగన్ పిలుపు**

గడప గడపకు : గత 47 రోజులుగా రాజోలు నియోజక వర్గంలో గడప గడపకు వైయస్ఆర్ కార్యక్రమం జోరుగా సాగుతోంది. వైయస్ఆర్‌సీపీ కార్యకర్తలు ఎంతో ఉత్సహంగా నియోజక వర్గంలో వున్న ప్రతి గడపకు వైయస్ఆర్‌సీపీ సందేశాన్ని చేర్చాలని, ప్రతి గడపలో నిలడబి మహిళలను, ఇంటి యజమానులను చైతన్య వంతులను చేయాలని పార్టీని బలోపేతం చేయాలని నియోజక వర్గంలో తిరుగులేని పార్టీగా చేయాలని రాజోలు రావ అధ్వర్యంలో మహిళలు, కోఆర్డినేటర్ బొంతు రాజేశ్వరరావు అధ్వర్యంలో మహిళలు, యువకులు వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోయినా, జోరున వాస పడుతున్నా, లెక్క చేయకుండా 15,000 గడపలకు వెళ్లడం, సుమారు 80,000 మందిని చైతన్యవంతులు చేయడం జరిగింది.

**ప్రజల్లో చైతన్యం**

గడప గడపలో ప్రజలు వారి దీనావస్థలు చెబుతూ ఉంటే, మన నియోజక వర్గంలో జీవన స్థితి గతులు ఎంత వరకు దిగ జారి పోయాయన్న పరిస్థితులను చూస్తున్నాము. ఉద్యోగాలు రాక యువకులు, పంటలు లేక రుణవిమోచన జరగక రైతులు అందవలసిన ప్రభుత్వ పథకాలు అందక మహిళలు, వర్షాలతో పారిశుద్యం లేక వ్యాధులతో భాదపడుతున్న ప్రజలు, ఈ విధమైన పరిస్థితులలో ప్రభుత్వం ఏంచేస్తోందని ప్రతి ఒక్కరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**క్రాప్ హాలిడే**

భారత దేశంలో అన్నపూర్ణ గా పిలవబడే కోనసీమ లో రైతులు ఈ సంవత్సరం క్రాప్ హాలిడే తీసుకున్నారు, అంటే ఈ ప్రభుత్వం తలవంచుకుకొని సిగ్గు పడాల్సిన సమయం. రైతులు క్రాప్ హాలిడే వల్ల ప్రతి రోజు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవడం, పిల్లలను చదివించలేక, ఎటువంటి శుభకార్యాలు చేసుకోలేక, కనీసం పండగలు చేసుకోలేక, వున్న దుస్థితి, మనం అందరం చూస్తున్నాం. గడప గడపకు కార్యక్రమంలో రైతులు వారి కుటుంబ సభ్యులు ఎంతో విచారంగా మా రాబోయో కాలం ఎలా ఉంటుందో ఊహించలేక పోతున్నామని భాధ వ్యక్తం చేశారు.

### ప్రజల ఆవేదన

ప్రతి గడపలో వైయస్ఆర్‌సీపీ కార్య కర్తలకు ప్రజలు వారి యొక్క ఆవేదన వేళ్ళ బోసుకున్నారు. కార్యకర్తలు అడిగిన ప్రశ్నలకు అమ్మా మీకు డ్వాక్రా రుణాలు మాఫీఅయ్యాయా అంటే, లేదు అన్న సమాధానం, పూర్తిగా రైతుల రుణా మాఫీ అయిందా అంటే, లేదు అన్న సమాధానం, మీ ఇంట్లో ఎవరికైనా ఉద్యోగం వచ్చిందా? అంటే "లేదు" అన్న సమాధానం, ఉద్యోగం రాకపోతే 2000/-రూపాయలు నిరుద్యోగ భృతి వచ్చిందా? అంటే, లేదు అన్న సమాధానం, ఇంకా ఏమైనా ప్రయోజనం కలిగిందా అంటే, లేదు లేదు అన్న సమాధానం తో గడప గడపలో వారి కష్టాలు చెప్పుకుంటూ, ప్రతి ఆడబడుచు కంట తడి పెట్టుకున్న దృశ్యాలు మాత్రమే కనబడుతున్నాయి. ప్రతి మహిళ ముందు గడప వలసిన సంవత్సరాలు ఎలా అనే దిగులుతో కుంగి పోతున్నారు.

## బ్యాంకులు,ఏటీఎంల ముందే పడిగాపులు




**న్యూఢిల్లీ :** డబ్బుల కోసం జనం సోమవారం తెల్లవారుజాము నుంచే ఏటీఎంలకు పోటెత్తగా..... చాలా కొద్ది మంది మాత్రమే అదృష్టం దక్కించుకున్నారు.ఒక ట్రెండు గంటల్లోపే ఏటీఎంల్లో నగదు ఖాళీ అవడంతో చాలాచోట్ల ప్రజలు బ్యాంకు సిబ్బందితో గొడవపడ్డారు. గురునానక్ జయంతి కావడంతో దేశ ఉత్తర, పశ్చిమ ప్రాంతంలో బ్యాంకులు పనిచేయలేదు. దక్షిణ,తూర్పు భారత రాష్ట్రాల్లో బ్యాంకులు పనిచేసినా జనాలకు డబ్బు సరిపోక ఇబ్బందులు పడ్డారు.

నోట్ల లభ్యతపై మోదీ అత్యవసర సమీక్ష.... నోట్ల సరఫరా..లభ్యతపై ఆదివారం అర్ధరాత్రి వరకు ప్రధాని నరేంద్ర మోదీ సమీక్షించారు. కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్,అరుణ్ జైట్లీ, వెంకయ్య, ఆర్బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ తదితరులు భేటీలో పాల్గొన్నారు. కగా,కొత్త నోట్లకు అనుగుణంగా ఏటీఎంల్లో మార్పుల పర్యవేక్షణకు ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ ఎస్ఎస్ ముంద్రా నేతృత్వంతో టాస్క్‌ఫోర్స్ బృందం ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా రెండు లక్షల ఏటీఎంలు ఉండగా అందులో సగం ఇంకా పనిచేయడం లేదు. అవసరానికి తగినంత నగదు ఉందని కేంద్రం తెలిపింది. 1.3 లక్షల పోస్టాఫీసుల్లో నగదు నిల్వల్ని పెంచుతామంది. కొత్త నోట్ల విత్ డ్రా కోసం వందల కొద్దీ మైక్రో నగదు ఏటీఎంల్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసుకునేందుకు సరిపడా నగదు అందుబాటులో ఉంచామని, బ్యాంకులకు వర్తించే నిబంధనలే డీసీసీబీలకు వర్తిస్తాయంది.

**కొత్త నోట్ల తయారీ ఖర్చు రూ.10,861 కోట్లు !**

పాత రూ.500,రూ.1000 నోట్లను మార్చుకునేందుకు జనం బ్యాంకుల వద్ద కాలాన్ని ఖర్చు పెడుతుంటే.. కొత్త నోట్ల ముద్రణ కోసం ప్రభుత్వం రూ.10,861 కోట్లు ఖర్చు చేస్తోంది. 2015-16 లో దేశంలో చలామణిలో ఉన్న మొత్తం కరెన్సీలో రూ.500, రూ.1,000 నోట్ల వాటా 24.4 శాతం కాగా వీటి విలువ మొత్తం నోట్లలో 86.4 శాతం.

## రూ.50,100 నోట్ల రద్దు లేదు

**న్యూఢిల్లీ :** త్వరలో రూ.100, రూ.50 నోట్లను కూడా రద్దు చేస్తారంటూ వచ్చిన వదంతులను కేంద్ర ప్రభుత్వం కొట్టిపారేసింది. ఆ నోట్లను రద్దు చేసే ఉద్దేశం లేదని స్పష్టంచేసింది. రూ.50/100 నోట్లు చెల్లవంటూ ప్రధానమంత్రి జాతినుద్దేశించి మరోసారి ప్రసంగిస్తారంటూ వచ్చిన వార్తలు కట్టుకథలని తేల్చి చెప్పింది. నోట్ల రద్దుతో ప్రయోజనాల కంటే వ్యయమే ఎక్కువగా ఉందన్న వ్యాఖ్యలను కూడా కేంద్రం ట్విటర్‌లో కొట్టిపారేసింది. అలాగే బ్యాంకు లాకర్లను, బంగారు, వజ్రాల ఆభరణాలను సీజ్ చేసే ఉద్దేశమేది ప్రభుత్వానికి లేదని తెలిపింది. రూ.2 వేల నోటు నాణ్యత సరిగాలేదని, నోటు రంగు వెలిసిపోతోందంటూ వచ్చిన ఫిర్యాదులపై స్పందిస్తూ... దీని గురించి ఆందోళనవసరం లేదని, అదొక భద్రతాపరమైన అంశమని పేర్కొంది. వీటిని ఇంటాగ్లియో ప్రింటింగ్ అనే ఫీచర్‌తో రూపొందించామని, అసలు నోటుపై బట్టతో రుద్ది పరీక్షిస్తే టర్బో ఎలక్ట్రిక్ ప్రభావం వల్ల ఆ ఇంకు రంగు బట్టకు అంటుకుంటుందని తెలిపింది. రూ.2 వేల నోటులో చిప్‌ను దాచి ఉంచారని వచ్చిన వదంతులను తోసిపుచ్చింది. నల్లధనాన్ని నియంత్రించేందుకు విదేశీ ప్రభుత్వాలతో




సమాచారాన్ని పంచుకుంటామని, బినామీ లావాదేవీల చట్టంలో సవరణలు తెస్తామని తెలిపింది. నోట్ల రద్దు విషయాన్ని పూర్తి గోప్యంగా ఉంచామని, ఏ ఒక్కరికీ లీక్ చేయలేదని స్పష్టంచేసింది.

## సుష్మాకు త్వరలో కిడ్నీ మార్పిడి

- ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరిక
- త్వరగా కోలుకోవాలని ఆకాక్షింస్తూ వందలాది ట్వీట్లు

**న్యూఢిల్లీ :** మూత్రపిండం వైఫల్యంతో బాధపడుతున్న విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్(64)కు ఢిల్లీలోని ఎయిమ్స్ వైద్యులు డయాలసిస్ నిర్వహిస్తున్నారు. త్వరలో ఆమెకు కిడ్నీ మార్పిడి చేసే అవకాశముంది. అయితే, కిడ్నీ మార్పిడికి కొంతసమయం పట్టొచ్చని, సుష్మ కుటుంబంలో దాత సరిపోలనందున, బయటి దాత కోసం అన్వేషిస్తున్నామని వైద్యులు చెప్పారు. తన కిడ్నీ సమస్య అంశాన్ని సుష్మానే ట్విటర్‌లో తెలిపారు. మిత్రులారా.... మూత్రిండం వైఫల్యంతో ఎయిమ్స్‌లో చేరాను. డయాలసిస్ చేస్తున్నారు. కిడ్నీ మార్పిడి సంబంధం పరీక్షలు నిర్వహిస్తున్నారు. శ్రీకృష్ణపరమాత్ముని ఆశీస్సులు



ఉంటాయనుకుంటున్నా' అని బుధవారం ట్వీట్ చేశారు. ఎయిమ్స్‌లో ముఖ్య విభాగాల వైద్యుల బృందం ఆమెకు వైద్యం అందిస్తోంది. సుష్మ ట్వీట్‌కు నెటిజన్లు స్పందించి, త్వరగా కోలుకోవాలని ట్వీట్లు చేశారు. కిడ్నీ ఇవ్వడానికి తాము సిద్ధమనికొందరన్నారు. .. త్వరగా కోలుకోవాలని కాంగ్రెస్ నేత రాహుల్,జయంత్ సిన్హా, ఢిల్లీ, రాజస్తాన్ సీఎంలు కేజ్రీవాల్, వసుంధరా రాజే, కాంగ్రెస్ నేత అంబికా సోనీ, నేసనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా తదితరులు ఆకాంక్షించారు.20 ఏళ్లుగా మధుమేహంతో బాధపడుతున్న సుష్మా ఏప్రిల్‌లోనూ ఊపిరితిత్తులు, ఇతర ఆరోగ్య సమస్యలతో ఎయిమ్స్‌లో చేరారు.

# అంగరంగ వైభవంగా గాలి జనార్ధన్ కుమార్తె వివాహం




మైనింగ్ టైకూన్ గాలిజనార్దన్ కుమార్తె బ్రహ్మిణి రెడ్డి వివాహంఅత్యంత వైభవంగా జరిగింది. బీబీఎం చదివిన బ్రహ్మిణికి హైదరాబాదు వ్యాపారవేత్త విక్రమదేవ రెడ్డి కుమారుడు రాజీవ్ రెడ్డితో ఈనెల 16న ఆమె వివాహం జరిగింది. విదేశాల్లో కూడా వ్యాపారాలున్న విక్రమ్‌కు ఆఫ్రికాలో మైనింగులున్నాయని అవి రాజీవ్ రెడ్డి చూసుకుంటారని తెలిసింది. 6 నెలల నుంచి పెళ్లి ఏర్పాట్లను ప్రారంభించారు. పెండ్లి కార్డు నుంచి ప్రతిదీ అత్యంత ఖరీదుగా, ఆధునికంగా ఉన్నాయి. ఈ వివాహం కోసం 15 శతాబ్ధానికి చెందిన శ్రీకృష్ణదేవరాయలు రాజభవనాలను సిద్దం చేశారు. దానిలో ఒకటి హంపి దేవాలయం నమూనాలో ఏర్పాటు చేశారు. కన్నడ సినిమా పనిచేసిన అడపా శశిధర్ కొన్ని నెలలపాటు శ్రమించి పెళ్లిమంటపాలను అత్యంత వైభవంగా నిర్మించారు. వెడ్డింగ్ కార్డును ఎల్ఈడీలో రూపొందించి పెళ్లికి ఆహ్వానించగా, పెళ్లి పట్టుచీరను 22 క్యారెట్ల బంగారు పోగులతో తయారు చేయించారు. దీని ఖరీదు సుమారు రూ.19 కోట్లు, ఆమె వివాహానికి ధరించిన నగలు అన్నీ బంగారు వజ్రాభరణాలే వీటికి రూ. 98కోట్లు ఖర్చుపెట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానంలోని 8 మంది పురోహితులు పెళ్లి మంత్రాలను వల్లెవేశారు. పెళ్లిలో 1000 రకాలు ఆహార పదార్థాలను వివిధ దేశాల మాస్టర్ చెఫ్‌లు వడ్డించారు. దాదాపు 30 వేల మంది అతిధులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి 1,500 స్టార్ హోటల్ రూములను బుక్ చేశారు. 2000 ట్యాక్సీలను అందుబాటులో ఉంచారు. అతిథుల కోసం 15 హెలిపాడ్‌లను ఏర్పాటు చేశారు. భద్రత కోసం 3000 మంది బౌన్సర్లు, 3000 మంది పోలీసులు, స్నిపర్ డాగ్స్, బాంబుస్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు.







- బోస్

## కారుణ్య నియామకాలపై డిసెంబరులో చలో ఢిల్లీ

**రాజధాని ప్రతినిధి-విజయవాడ(గాంధీనగర్) :** కారుణ్య నియామాకాలు చేపట్టాలంటూ అధికారిక ఉత్తర్వులున్నప్పటికీ అధికారులు ఎటువంటి కారణాలు చూపకూండా తిరస్కరించడం తగదని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డిసీజ్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు యమ్.గంగాధరరావు తెలిపారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయకపోతే డిసెంబర్ 6వ తేదీన చలో ఢీల్లీ కార్యక్రమం చేపడతామన్నారు.విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆంధ్రా, తెలంగాణ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థలో విధి నిర్వహణలో మృతి చెందిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం అవకాశం కల్పించాల్సి ఉందన్నారు. అయితే 1995 నుంచి ఇప్పటి వరకు ఒక్క నియామకం కూడా చేపట్టలేదన్నారు. ఆంధ్రా, తెలంగాణలో క్లాస్-4, క్లాస్-3 ఉద్యోగాలకు అర్హత కలిగిన 900 మంది అన్ని పత్రాలు అధికారులకు అందచేశారని గుర్తు చేశారు. కొందరికి ఇంటర్వ్యూలు జరిగినా వివాహం అయ్యిందని, మరికొన్ని కారణాలతో అనర్హులంటూ లేఖల ద్వారా తెలపడం దారుణమన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ అశ్విన్‌కుమార్, జనరల్ సెక్రటరీ సి.జగదీష్, సెక్రటరీ క్రాంతి, ఆర్గనైజర్ కె.డి.ఎం.కిరణ్ పాల్గొన్నారు.

## ఎస్‌బీఐ రూ.7 వేల కోట్ల రైటాఫ్

**మాల్యాకు రూ.1200 కోట్ల బహుమానం**

**న్యూఢిల్లీ :** రిజర్వు బ్యాంకు అనుమతించిన అడ్వాన్స్ అండర్ కలెక్షన్ అకౌంట్స్ (ఆకా) అనే పద్ధతిని అవలంబించిది. దీని ప్రకారం మొండి బకాయిలు లేదా నిరర్ధక ఆస్తులను ప్రత్యేకమైన అకౌంటులోకి బదిలీ చేస్తారు. తద్వారా ముందుగా అవి బ్యాంకు బ్యాలెన్సు షీటులో కనిపించవు. తద్వారా బ్యాంకు పనితీరు మెరుగుపడినట్లు కనిపిస్తుంది. కానీ అంతమాత్రాన వాటిని పూర్తిగా మాఫీ చేసినట్లు కాదు. వన్‌టైమ్ సెటిల్మెంట్లు తప్ప మిగిలిన బకాయిలన్నింటినీ సాంకేతికంగా రైటాఫ్ చేసినట్లు చూపించినా, వాటిని ఆకాలో యథాతథంగా ఉంచుతారు. అంటే, చిట్టచివరి రూపాయి వసూలయ్యే వరకు వాటి రికవరీ విధానం కొనసాగుతూనే ఉంటుంది.సామాన్యులకు, రైతులకు రుణాలు ఇవ్వటానికి నానా కొర్రీలు పెట్టే.. ఎస్బీఐ వేల కోట్లు ఎగనామం పెట్టిన బడా బాబులకు రుణమాఫీ చేయాలని ఓ సంచలన నిర్ణయం తీసుకుంది. భారీమొత్తంలో ఉన్న రుణ బకాయిలను వేరే ఖాతాలోకి మళ్లించి... తన బ్యాలెన్సు షీటులో మొండి బకాయిల భారం లేకుండా చూసుకుంది. ఈ పద్ధతిలో మొత్తం 63 మంది డిఫాల్టర్లకు చెందిన మొండి బకాయిలను రైటాఫ్ చేసినట్లు తెలిసింది.దాదాపు రూ.7,016 విలువ చేసే నిరర్థక ఆస్తులను ఇలా చేసినట్లు ఎస్‌బీఐ ప్రకటించింది. ఈమేరకు డైలీ న్యూస్ అనాలిసిస్ ఒక కథనం ప్రచురించింది. ఈ ప్రకారం...బ్యాంకులకు పంగనామం పెట్టి విదేశాలకు పారిపోయిన లిక్కర్ కింగ్ విజయ్ మాల్యాకు చెందిన కింగ్ ఫియర్ ఎయిర్ లైన్స్ బకాయిలు రూ.1,201 కోట్లు కూడా ఉన్నాయి. మొండిబకాయిల జాబితాలో కింగ్ ఫిషర్ ఎయిర్ లైన్స్ అగ్రస్థానంలో ఉంది.మరికోన్ని తెలుగు కంపెనీల రుణాలనూ ఎస్బీఐ రైటాఫ్ చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విక్టరీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ రూ.93.91 కోట్లు,విక్టరీ ట్రాన్స్ అండ్ స్విచ్ గేర్స్ లిమిటెడ్ రూ.66.57 కోట్లు,కెఆర్ఆర్ ఇన్‌ఫ్రాప్రాజెక్టు రూ.86.73 కోట్లు,ఘన్ శ్యాం దాస్ జెమ్స్ అండ్ జ్యువెల్లర్స్ రూ.61.72 కోట్లు రైటాఫ్ చేసింది. తెలంగాణకు చెందిన తోటెం ఇన్ ఫ్రా లిమిటెడ్ రూ.93.68కోట్లు, ఎస్ఎస్‌బీజీ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్స్ రూ.65.24 కోట్టు వీటితోపాటు కేఎస్ ఆయిల్ (రూ596కోట్లు), సూర్య ఫార్మాస్యూటికల్స్ (రూ526 కోట్లు) జీఈటీ పవర్, (రూ400 కోట్లు) సాయి అండ్ ఇన్ఫోసిస్టమ్(రూ376 కోట్లు) ఉన్నాయి. 63 ఖాతాలను పూర్తిగా ఆకాలోకి మళ్లించగా,31 ఖాతాలను పాక్షికంగా మళ్లించినట్లు తెలిపింది. ఆరింటిని మొండి బకాయిలుగా చూపించారు.ఈ తరలింపు ద్వారా దాని బ్యాలెన్స్ షీట్లు సర్దుబాటు చేసినట్టు తెలుస్తోంది.

## 24న ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి శంకుస్థాపన

- రాజధానిలో మరో ప్రముఖ విద్యాలయం
- నీరుకొండలో ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులకు ఆదేశాలు

**రాజధాని ప్రతినిధి : గుంటూరు-** అమరావతి రాజధాని నగరంలో మరో ప్రముఖ విద్యా సంస్థ అడుగు పెట్టబోతోంది. దేశవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన ఎస్.ఆర్.ఎం. యూనివర్సిటీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు పచ్చజెండా ఊపారు. రాజధానిలోని నీరుకొండలో సుమారు 200 ఎకరాల భూమిని ఈ సంస్థకు కేటాయించేందుకు సీఆర్‌డీఏ నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ నెల 24 వ తేదీన శంకుస్థాపన కార్యక్రమం జరగనుంది. దీనికి సంబంధించి ఏర్పాట్లు చేయాల్సిందిగా ఈవెంట్ ఆర్గనైజర్ జీవన్‌కు ఆదేశాలు అందాయి. శంకుస్థాపన ఏర్పాట్లపై కలెక్టర్ కాంతీలాల్ దండే కూడా చర్చించారు. రాజధానిలో ఇటీవలే వెల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్)కు శంకుస్థాపన జరిగిన విషయం తెలిసిందే. అదే రీతిలో ఎస్.ఆర్ఎం. యూనివర్సిటీ శంకుస్థాపన కార్యక్రమం జరగనుంది. దీని వలన రాబోయే రోజుల్లో సుమారు 38 వేలమంది విద్యార్థులు ఇక్కడ ఉన్నత చదువులు అభ్యసించే అవకాశం కలుగుతుంది. ఎస్.ఆర్.ఎం. యూనివర్సిటీలో ఇంజనీరింగ్, మెడికల్, మేనేజ్‌మెంట్ వంటి ప్రొఫెషనల్ కోర్సులు విద్యార్ధులకు అందుబాటులో ఉంటాయి. విద్యా ప్రమాణాలకు ఎస్ఆర్ఎం. పేరు సంపాదించుకుంది. తమిళనాడులోని కాంచీపురం జిల్లాలో ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటై ఉన్నది. ఈ సంస్థకు అనుబంధంగా మరికొన్ని కళాశాలలు ఉన్నాయి.1985వ సంవత్సరంలో ఈ సంస్థకు ఒక కళాశాలగా ప్రారంభమై అంచెలంచెలుగా ఎదిగింది.

# ఏటీఎంల ప్రక్షాళనకు టాస్క్‌ఫోర్స్

**న్యూఢిల్లీ:** పెద్ద నోట్ల రద్దుతో సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలకు త్వరితగతిన పరిష్కారం చూపే దిశగా కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) డిప్యూటీ గవర్నర్ ఎస్ఎస్ ముంద్రా ఛైర్మన్‌గా టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న ఏటీఎంల ద్వారా తక్కువ సమయంలో రూ.2వేల నోట్లను అందుబాటులోకి తెచ్చేందుకు ఇది కృషి చేయనుంది. ప్రస్తుతం ఏటీఎంల ద్వారా వేగంగా రూ.2వేల నోట్లను ఖాతాదారులకు అందించేందుకు ప్రయత్నిస్తున్నాం. రూ.2వేల నోట్లను డ్రా చేసుకునేందుకు అనువుగా వీలైనన్ని ఏటీఎంలలో మార్పులు చేపట్టాల్సిన అవపరం ఉంది. ఇందుకోసం ఎస్ఎస్ ముద్రా ఛైర్మన్‌గా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేస్తున్నాం అని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి శక్తికాంతదాస్ తెలిపారు. ఈ బృందం బ్యాంకులతో పాటు వివిధ ఏజెన్సీలను సమన్వయం చేసుకుంటూ ఏటీఎంలలోని హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లను రూ.2వేల నోట్లు జారీకి అనుగుణంగా త్వరితగతిన మార్చేందుకు కృషి చేయనుంది. దీనిపై చర్చించేందుకు టాస్క్‌ఫోర్స్ అత్యున్నత భేటీ జరగనుంది. ఆర్థిక, హోం మంత్రిత్వశాఖలతో పాటు బ్యాంకులకు చేందిన ఎనిమిది మంది సభ్యులు టాస్క్‌ఫోర్స్ బృందంగా ఏర్పాటు చేశారు.వీరితోపాటు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా,చీఫ్ జనరల్ మేనేజర్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కరెన్సీ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఆర్‌బీఐ సభ్యులు కూడా ఇందులో భాగస్వాములు కానున్నారు. అంతేకాకుండా ఏటీఎం.ఓఈఎమ్‌లు, క్యాష్ ఇన్ ట్రాన్సిట్ కంపెనీలు, వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్లు కూడా తమ ఆలోచనలను ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ బృందంతో పంచుకుంటారు. ఏటీఎంలలో మార్పునకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి మాఅభిప్రాయాలను కూడా తీసుకోవడం అభినందనీయం. క్లిష్ట సమయాల్లో ఉత్సాహంగా పనిచేయడానికి ప్రోత్సహించినట్ల వుతుంది' అని క్యాష్ లాజిస్టిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు రితురాజ్ సిన్హా అన్నారు. దేశవ్యాప్తంగా సుమారు2లక్షల ఏటీఎంలు ఉన్నాయి.వీటి ద్వారా రూ.2వేల నోటు ఖాతాదారులకు అందించాలంటే అందుకు అనుగుణంగా హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లలో మార్పులు చేయాల్సి ఉంది.




# జగన్ 24 కేసుల్లో ప్రధాన ముద్దాయి

**నారా లోకేష్‌బాబు**

**అనంతపురం :** వైఎస్ ఆర్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 24 కేసుల్లో ప్రధాన ముద్దాయిగా ఉన్నాడని 16 నెలలు జైల్లో ఉన్నాడని యువనేత, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్‌బాబు విమర్శించారు. నగర పరిధిలోని పీవీకేకే కళాశాలలో యువచైతన్య యాత్ర, నవ్యాంధ్ర నిర్మాణంలో యువత పాత్ర, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లోకేష్‌బాబుతోపాటు ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి, చీఫ్‌విప్ కాలువ శ్రీనివాసులు, విప్ యామినీబాల, అనంతపురం శాసనసభ్యులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి, టీడీపీ జిల్లా పరిశీలకులు జయనాగేశ్వర్‌రెడ్డి, మసాల పద్మజలు హాజరయ్యారు. ఈసందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ 2014లో రాష్ట్ర విభజన జరిగినప్పుడు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్ర రూ.16 వేల కోట్లు లోటు బడ్జెట్‌తో ఉందన్నారు. కనీసం అమరావతిలో కూర్చోవడానికి కుర్చీలు కూడా లేవని, ఫైళ్లు కూడా లేని పరిస్థితి ఉందన్నారు. ఆ కష్ట కాలంలో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు అలుపెరగకుండా పనిచేసి అమరావతికి రూపురేఖలు తెచ్చారన్నారు. రాష్ట్రానికి 16 శాతం పరిశ్రమల కోసంపెట్టుబడులు వస్తున్నాయని, భవిష్యత్తులో నిరుద్యోగులు అనే వారు ఉండరన్నారు. అనంతపురం జిల్లాలో కూడా పరిశ్రమలు నెలకొల్పుతు న్నట్లు, తద్వారా 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. 18 నెలల్లో పట్టిసీమ ప్రాజెక్టు పూర్తిచేసి నీరు అందించిన హంద్రీనీవా ద్వారా నీరు ఇచ్చారని గుర్తు చేశారు. ఐఏఎస్ అధికారులను కూడా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, అతని తనయుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జైళ్లకు పంపించారన్నారు.


తాను విదేశాల్లో 400 సెల్ఫీ ఫోటోలను దిగానుని, ఆ ఫోటోలను ప్రచురించకుండా కేవలం మూడు ఫోటోలను సాక్షి దినపత్రికలో ప్రచురించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రాజదానికి 33 వేల ఎకరాల భూమి అవసరముంటే అంత భూమి అవసరం లేదని జగన్మోహన్‌రెడ్డి అనడం పద్ధతి కాదన్నారు. పరిశ్రమలు నెలకొల్పడానికి విస్తారమైన భూమి ఉండటానికే 33 వేల ఎకరాలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. బెంగళూరులో జగన్మోహన్‌రెడ్డి వందలాది ఎకరాల్లోఇళ్లు నిర్మించుకున్నా రని, ప్రజల కోసం చంద్రబాబు పరితపిస్తుంటే ఆయన విమర్శించడం సిగ్గుమాలిన చర్య అన్నారు. చిత్తూరు జిల్లాకు మైక్రోమ్యాక్స్, లావా, కార్బన్ కంపెనీలు కూడా వస్తున్నాయని తద్వారా 10 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పార్థసారథి, ఉన్నం హనుమంతురాయచైదరి, ఈరన్న, గౌనుగుంట్ల సూర్యనారాయణ, మేయర్ మదమంచి స్వరూప, ఎమ్మెల్సీలు మెట్టు గోవిందురెడ్డి, పయ్యావుల కేశవ్, శమంతకమణి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, టీడీపీ నాయకులు పామిశెట్టి రంగ నాయకులు, డిప్యూటి మేయర్ గంపన్న, దేవళ్ల మురళీ, రాయల్ మురళీ, .జెఎల్ మురళీ, కార్పొరేటర్లు జిల్లా పల్లవి,సద్దల హేమలత, కార్పొరేటర్లు , జెడ్పిటిసిలు ఎంపిటిసిలు , జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న నారా లోకేష్

# ముందుస్తు ఆలోచన లేని మోడీ సర్కార్ :ఉత్తమ్

**హైదరాబాద్:** నల్లధనం వెలికితీతకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష్యులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. అయితే ముందుస్తు ఆలోచన లేకుండా తొందరపాటుగా పెద్దనోట్లను రద్దు చేయడం వల్ల సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నోట్ల రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని ప్రజల ఇబ్బందులు తొలిగాక, మోడీ సర్కార్ ఎలాంటి నిర్ణయమైనా తీసుకోవచ్చన్నారు. నోట్ల రద్దును నిరసిస్తూ అబిడ్స్ చౌరస్తాలో కాంగ్రెస్ ధర్నా నిర్వహించింది. ఈ ధర్నాలో మాజీ ఎంపి అంజన్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి దానం నాగేందర్, సుధీర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీకి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఆందోళన చేస్తున్న పార్టీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి గాంధీ నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.అంతకు ముందు ధర్నానుద్దేశించి ఉత్తమ్ మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను మోడీ సర్కార్ విస్మరిస్తున్నందునే తాము నిరసన తెలుపుతున్నామన్నారు. నోట్ల రద్దును ఉపసంహరించుకోవాలని,ప్రజలకు ఇబ్బంది లేని విధంగా నల్లధనం వెలికితీతకు కేంద్రం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాని తన సన్నిహితులకు,అనుకూల ముఖ్యమంత్రులకు, వ్యాపార సంస్థలకు ముందుగానే పెద్దనోట్ల రద్దును లీక్ చేశారని ఆరోపించారు. దీంతో ఆంధ్రప్రదేశ్,తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, చంద్రశేఖరరావులు లబ్ధిపోందారని ప్రజల్లో అనుమానాలు న్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం జవహర్‌లాల్ నెహ్రూను విస్మరించిందన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా కేంద్ర ఇచ్చిన ప్రకటనల్లో నెహ్రూ చిత్రపటాన్ని పెట్టకపోవడం దారుణమన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించడే కాకుండా తొలి ప్రధానిగా బాధ్యతలు నిర్యహించిన నెహ్రూను విస్మరించడం తగదని ఉత్తమ్ అన్నారు.



## ప్రజలను అవమానపరిచే మోడీ వ్యాఖ్యలు

**కోల్‌కతా:** నోట్ల రద్దు అనంతరం దేశంలో సామాన్య ప్రజలు ప్రశాంతంగా నిద్రపోతున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేసిన వ్యాఖ్యలను పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనార్జీ తప్పుపట్టారు. మోడీ వ్యాఖ్యలు సామాన్య ప్రజానీకాన్ని అవయాన పరిచేలా ఉన్నాయని ఆమె ఆరోపించారు. పెద్దనోట్లు రద్దు కావడంతో ప్రజలు ప్రశాంతంగా నిద్రపోతున్నారని మోడీ చేసిన వ్యాఖ్యలు వారిని అవమాన పరిచేలా ఉన్నాయి. అధికారం అందించిన దేశ ప్రజలను ఈపద్ధతిలో వేదనకు గురి చేయడం సరైంది కాదని ఆమె అన్నారు. నోట్ల రద్దు వల్ల దేశంలో ఇబ్బందులు ఎదుర్కొంటోంది సామాన్య ప్రజలేనని తెలిపారు. నోట్ల రద్దు చేయండ మొదటి నుంచి తీవ్రంగా వ్యతిరేకిస్తున్న మమతా బెనర్జీ చిరకాల ప్రత్యర్థి సీసీఎంతో పాటు కాంగ్రెస్, ఎస్పీ తదితర పార్టీలతో కలిసి కేంద్రం చేసిన తప్పిదాన్ని ఎండగట్టుతామని అన్నారు.

## తుంగభద్రపై చెక్‌డ్యాం నిర్మాణంతో 10 వేల ఎకరాలకు ప్రయోజనం

**రాజధాని ప్రతినిధి-కర్లపాలెం :** కర్లపాలెంలోని తుంగభద్ర కాలువపై చెక్‌డ్యాంను నిర్మిస్తే 10వేల ఎకరాలకు పైగా సాగు నీరు అందుతుందని ఎమ్మెల్సీ అన్నం సతీష్‌ప్రభాకర్ తెలిపారు. కర్లపాలెం తుంగభద్ర కాలువను ఎమ్మెల్సీ ఇరిగేషన్ అధికారులు, రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ సముద్రం నుంచి వస్తున్న ఆటు పోట్లతో కాలువలో నీరు ఉప్పుగా మారుతుందని తెలిపారు. దీంతో పంట నీరు కూడా ఉప్పుగా మారుతుందని తెలిపారు. చెక్‌డ్యాం ఏర్పాటు చేయటం వలన మురుగు నీటితో 10 వేల ఎకరాల సాగుకు నీరు సరిపోతుందన్నారు. దీంతో ఇరిగేషన్ ఈఈ ఏసుబాబుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీనివాసరావు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు నక్కల వెంకటస్వామి, పెనుమత్స ఆంజేయరాజు, నాగరాజు, ఎంపీటీసీ షేక్ బాజీ, సర్పంచి బోద్దుకూరి విజయ,ఎస్సీ సెల్ హేమ మైనార్టీ సెల్ అజీజుల్లాబేగ్, స్టాలిన్,బుల్లియ్య, సాంబశివరావు తదితరులున్నారు.

## నోట్ల మార్పిడి అంటు 50 లక్షలతో పరారీ

**హైదారాబాద్ :** నోట్ల మార్పిడి ప్రజలకు పెద్ద సమస్యగా మారింది. తమ వద్ద ఉన్న డబ్బును మార్చుకునేందుకు బ్యాంకుల వద్ద బారులు తీరుతున్నప్పటికీ.ఎక్కువ మొత్తంలో డబ్బు ఉన్నవారు మోసగాళ్ల చేతిలో మోసపోతున్నారు. కమీషన్ల పేరుతో.. బ్లాక్‌ను వైట్ చేస్తామని చెప్పికొందరు మోసగాళ్లు లక్షల్లో డబ్బును మాయం చేస్తున్నారు రాజేంద్రనగర్ అత్తాపూర్‌లో నోట్ల మార్పిడి పేరుతో ఘరానా మోసం జరిగింది. నోట్లు మార్పిడి చేస్తామంటూ ఓ వ్యక్తి వద్ద రూ.50 లక్షలను కొందరు దుండగులు ఉడాయించారు. బాధితుడు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా..కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

# చాంతాడులే చిన్నబోయే క్యూలైన్లు



చిలకలూరిపేటలో ఓ ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద జన సందోహం






### సర్జికల్ దాడులంటే ..

ప్రక్కవారికి ఏ మాత్రం నష్టం కలిగించకుండా పథకం ప్రకారం ఎంచుకున్న లక్ష్యాలపై చేసేదాడిని సర్జికల్ దాడులంటారు. నవంబరు 8 అర్ధరాత్రి ప్రధాని మోడీ మాట్లాడుతూ నల్లధనం అరికట్టడానికి సర్జికల్ దాడులు జరుపుతున్నామని ఇకపై రూ.500,1000 నోట్లు చిత్తుకాగితాలని ప్రకటించారు. దీంతో తెల్లవారి నుంచి ప్రజలంతా భయాందోళనలకు గురయ్యారు. రెండు రోజుల తర్వాతి నుంచి చేంతాడులు చిన్నబోయేలా క్యూలైన్లు మొదలయ్యాయి. ఈ లైన్లలోనే ఇప్పటివరకు 40 మంది వరకు చనిపోయారు. దీంతో మోడీ సామాన్యులను లక్ష్యం చేసుకున్నారా ? నల్ల కుబేరులను లక్ష్యంగా చేసుకున్నారా ? అని ప్రజలు వాపోతున్నారు.

### స్వచ్ఛ సమాజం కోసం స్వచ్ఛపాలిటిక్స్ కావాలి : ప్రవీణ్



“మీకేంటి సార్ అన్నీ కాళ్ల దగ్గరకొస్తాయి. కాని మాకు అలా ఉండదుకదా, అర్ధరాత్రి నిర్ణయం తీసుకునే ముందు ప్రజలు ఇబ్బంది పడకుండా ముందు జాగ్రత్త ఏమైఏనా తీసుకున్నారా?నిర్ణయం మీది, ఇబ్బందులు మాకా..కనీసం ఏటీఎం సెంటర్లు కూడా పనికొచ్చే చర్యలు తీసుకోలేదు. మేం బతికేదెలా ? జాలికలిగి కడుపునింపేవాళ్లెవరూ లేరు కదా !..నల్లకుబేరుల లిస్టు చేతిలో పట్టుకొని సామాన్యుడిని ఇబ్బంది పెడితే ఎలా ? సాహసోపేత నిర్ణయ తీసుకునే ముందు లిస్టులో ఉన్నవారిని కూపీలాగకుండా మమ్మల్ని ఎందుకు సార్ ఇబ్బంది పెడతారు ? స్వచ్ఛ సమాజం కోసం స్వచ్ఛ పాలిటిక్స్ కావాలి” అంటూ సోషల్ మీడియాలో వాపోయారు ప్రవీణ్.

### కేంద్రంపై బ్యాంకు ఉద్యోగుల ఫెడరేషన్ గరంగరం

**ముంబై:** ఏటీఎంలలో నగదు కొరతతో ప్రజల ఇబ్బందుల నేపథ్యంలో బ్యాంకు ఉద్యోగుల ఫెడరేషన్ మండిపడుతోంది. ప్రభుత్వం తీసుకున్న చర్యతో బ్యాంకు సిబ్బందికి, ప్రజలకు మధ్య అంతరాన్ని పెంచుతోందని, నూతనంగా ప్రవేశపెట్టిన నోట్లను తగినంతగా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఎఫ్‌ఎఫ్‌ఐ) కోరింది. ప్రత్యామ్నాయ చర్యలు, కరెన్సీలు లభ్యతపై భరోసా లేకుండా తీసుకున్న నిర్ణయం ప్రజల అవసరాలను తీర్చలేని పరిస్థితికి బ్యాంకులు నెట్టబడ్డాయనీ, దీంతో ప్రజలకు, బ్యాంకు ఉద్యోగులకు మధ్య లేనిపోని విభేదాలు తలెత్తుతున్నాయని బీఎఫ్‌ఎఫ్‌ఐ అధ్యక్షుడు నరేంద్రన్ వ్యాఖ్యానించారు. కరెన్సీ రద్దుతో నకిలీ కరెన్సీ, నల్లధనం వెలికి వస్తుందన్న ప్రభుత్వ వాదనను కొట్టిపారేసిన ఆయన ఈ చర్య పేదల కష్టాలను మరింత పెంచిందన్నారు. పెద్దనోట్ల రద్దుతో దేశంలో ఏర్పడిన పరిస్థితులపై కేంద్ర జోక్యం చేసుకోవాలన్నారు. కరెన్సీ లభ్యతను మెరుగుపర్చి ప్రజలకు మరింత భరోసా ఇవ్వాలని కోరారు. కరెన్సీని అందుబాటులోకి తీసుకురావడంలో, ఆర్థిక వ్యవస్థ నిర్వహణలోపంతో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ప్రయివేటీకరణ, బడాబాబులకు వత్తాసు పలికే చర్యల కారణంగానే ఈ పరిస్థితి నెలకొందన్నారు. ప్రైవేట్ కాంట్రాక్టర్ ఏజెన్సీల కారణంగా ప్రజలు ఏటీఎంల నుంచి నగదును పొందలేకపోతున్నారని, దీంతో దేశంలో అప్రకటిత ఆర్థిక అత్యవసర పరిస్థితి నెలకొందని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కరెన్సీ బ్యాన్ తదనంతర పరిణమాలపై సరైన హోంవర్క్ లేకుండానే ఆర్థిక వ్యవస్థలో 6 శాతా వాటా ఉన్న పెద్ద కరెన్సీ నోట్ల రద్దును ప్రకటించారని నరేంద్రన్ విమర్శించారు.

### నోట్ల రద్దు మోడీకి ఎదురుదెబ్బే : ఆర్థికవేత్త స్వామినాథన్



అధికారపార్టీ నాయకులు ఎంత గొప్పగా చెప్పుకున్నప్పటికీ సాధారణ ప్రజలు తీవ్రంగా ఇక్కట్లపాలవుతున్నారని, చివరికి ఇది మోడీకి పెద్ద సమస్యగా మారుతుందని ప్రముఖ ఆర్థిక వేత్త స్వామినాథన్ అంకాలేశ్వర్ స్పష్టం చేశారు. నోట్ల రద్దు ఆర్థిక వ్యవస్థపై పెద్ద ప్రభావం చూపుతుందని, మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలపై ఉంటుందని, వారి కొనుగోలు శక్తి పడిపోతుందని ఆయన హెచ్చరించారు. కొత్తనోట్లు ప్రజల వద్దకు చేరేలోపు వ్యాపారాలన్నీ దెబ్బతింటాయన్నారు. నోట్లరద్దుతో నల్లకుబేరులను తరిమివేయాలని, 100 శాతం మందిని ఇబ్బంది పెట్టి 0.1 శాతం అక్రమార్కులను పట్టుకోవాలను కోవడం అవివేకమన్నారు.


**- ఖాన్**

### మోడీకి నాలుగోతరగతి కుర్రాడి ప్రశ్న

పెద్దనోట్లను రద్దుచేస్తూ హఠాత్ నిర్ణయం తీసుకునే ముందు అన్ని బ్యాంకుల్లో, ఏటీఎంలలో ఎందుకు చిల్లర నోట్లు పెట్టలేదు... ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని తెలీదా అని మోడీని సూటిగా ప్రశ్నించారు. రూ. 2000 నోటును ఆరు నెలల నుంచి మైసూర్ ప్రెస్‌లో ఎవ్వరికీ తెలియకుండా ప్రింటు చేశామంటున్నారు. అయితే అప్పటి ఆర్‌బీఐ గవర్నర్ రఘురాం రాజన్ పేరులేకుండా రెండు నెలల (సెప్టెంబరు 40న) క్రితం చేరిన ఉర్జిత్ పటేల్ పేరు ఎలా వచ్చిందని మోడిని ప్రశ్నించారు. మోడీ ఖచ్చితంగా ఈ ప్రశ్నలకు సమాధనం చెప్పాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారు.



### ఉర్జిత్ నియమకాన్ని తప్పపట్టిన కాగ్ : ప్రశాంత్ భూషణ్



ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిల్ పటేల్ 1997 నుంచి 2006 వరకు రిలయన్స్ సంస్థల వ్యాపారాల అభివృద్ధి కమిటి అధ్యక్షుడిగా, గుజరాత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో పనిచేశారు. ప్రైవేటు సంస్థల్లో పనిచేసిన వ్యక్తులను ఆర్‌బీఐ గవర్నర్‌గా నియమించడాన్ని కాగ్ కూడా తప్పుబట్టిందని ప్రఖ్యాత లాయర్, ప్రశాంత్ భూషణ్ ట్వీట్ చేశారు.

### నకిలీ నోట్లు రాకుండా జాగ్రత్తలు లేవు : అసదుద్దీన్



నోట్ల తయారీకి పాకిస్థాన్, భారత దేశాలకు ఇంకు, సెక్యూరిటీ థ్రెడ్స్ అందించే సంస్థ ఒక్కటేనని అందువల్ల దేశంలో నకిలీ నోట్లు రాకుండా ఉండవని ఎంఐఎం పార్టీ నాయకుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పార్లమెంటులో వెల్లడించారు. ప్రభుత్వం కట్టుదిట్టంగా నోట్ల ముద్రణ చేయకుండా హడావుడి నిర్ణయాలు తీసుకుందన్నారు. మార్కెట్ నుంచి హడావుడిగా పెద్ద నోట్లు రద్దు చేసి సామాన్య ప్రజలను తీవ్రంగా నష్టపరిచారని ఆయన ప్రభుత్వంపై మండి పడ్డారు.

### మత్తుమందు ఇవ్వకుండా ఆపరేషను చేశారు : ఉండవల్లి



ఆరోగ్యం కోసమే అయినా... ఏ డాక్టరైనా మత్తు మందు ఇవ్వకుండా ఆపరేషన్ చేస్తారా ? కాని అలాంటి పని భారత ప్రభుత్వం చేసింది. నల్లడబ్బుకోసమే అంటూ ముందుస్తు జాగ్రత్త చర్యలు లేకుండా నోట్లు రద్దు చేసి ప్రజలను రోడ్లపాలు చేశారు.

### విదేశీ నగదుపై ఆర్డినెన్స్ తేవాలి : సుబ్రమణ్య స్వామి



విదేశీ బ్యాంకుల్లో భారతీయులు దాచిన డబ్బులను వెనక్కు తేవాలంటే ముందుగా భారత ప్రభుత్వం ఆ ధనంపై ఆర్డినెన్స్ తేవాలి. దాంతో నల్లకుబేరులు బయట పడతారు. సరైన ఆధారాలు చూపిన నగదును వారికప్పగించి మిగతా ధనాన్ని జాతీయం చేయాలి. చట్టప్రకారం ఆర్‌బీఐ ద్వారా వచ్చిన నగదును మాత్రమే దేశంలోకి అనుమతించాలి. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ప్రవాస భారతీయ పెట్టుబడిదారులకు ఇచ్చే స్కీంలను రద్దు చేయాలి. మంత్రులు, వారి బంధువులు, మిత్రులు విదేశీ బ్యాంకులు ఖాతాలను తెరవడానికి ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. లేనట్లయితే వీరిదగ్గర ఉన్న ధనాన్ని నల్లధనంగా గుర్తించాలి..

**- బోస్**

## కానూరులో ఉత్సాహంగా జనచైతన్య యాత్ర



సనత్ నగర్ జన చైతన్య యాత్రలో పాల్గొన్న అన్నె రాధాకృష్ణమూర్తి, అబ్దుల్ లతీఫ్, ఎమ్మెల్యే బోడె ప్రసాద్

**రాజధాని ప్రతినిధి(సనత్‌నగర్) :** కానూరులోని సనత్‌నగర్‌లో జనచైతన్య యాత్ర ఉత్సాహంగా జరిగింది. స్థానిక ఎమ్మెల్యే బోడే ప్రసాద్ , గ్రామ సర్పంచ్ అన్నె రాధాకృష్ణ మూర్తి, ఉప సర్పంచ్ అబ్దుల్ లతీఫ్ జనచైతన్య యాత్రలో పాల్గొని ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. వార్డు సభ్యురాలు సత్యవతి మునీర్ ఖాన్,గుల్జార్ మునీర్‌బాను రహమాన్ , బుజ్జి, బాజీ, అన్వర్, రహీంఖాన్, కే రాజు, సాబు,రబ్బానీ, బేగ్, సాదిక్, అమీర్,సిద్దిక్ గ్రామ పెద్దలు, యువకులు మహిళలు ఈ యాత్రలో పాల్గొన్నారు.

అతి త్వరలో దినపత్రికగా రానున్న
రాజధాని వార్తలు
పత్రికకు విజయవాడలో డీటీపీ ఆపరేటర్లు,సబ్ -ఎడిటర్లు, డిజైనర్లు కావలెను
94406 62699, 96768 44442

# దేశంలో ఆర్థిక విధ్వంసం



దిష్టి బొమ్మను దగ్ధం చేస్తున్న స్థానికులు

- రూ.400 కోట్ల నకిలీ నోట్ల రద్దుకు 12 వేల కోట్లు ఖర్చు
- పనికిరాని నగదును ముద్రించడానికి ఏడాదిన్నర సమయం
- ముందుగానే నగదు మార్చిన బడాబాబులు

పెద్దనోట్ల రద్దుతో దేశంలో ఎన్నడూ లేని విధంగా ఆర్థిక విధ్వంసం జరిగింది. ముందు వెనుక ఆలోచించకుండా మోడీ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో దేశవ్యాప్తంగా సామాన్యులంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎవరి సలహాలు , సంప్రదింపులు లేకుండా ఒంటెత్తు పోకడతో తీసుకున్న ఈ నిర్ణయాన్ని సమర్థించుకునేందుకు నల్లధనంపై లక్షిత దాడులుగా సమర్థించుకుంటున్నారు. మన ఆర్థిక వ్యవస్థలో దాదాపు రూ. 400 కోట్లు నకిలీ నోట్లు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రకటించిన మొత్తం బడ్జెట్‌లో 19.7 లక్షల కోట్లు నకిలీవి అంటే 0.025 శాతం మాత్రమే.. పాత నోట్లు రద్దు చేసి కొత్త నోట్లు ముద్రించడానికి దాదాపు రూ. 12 వేల కోట్లు కోట్ల రూపాయలు ఖర్చవుతుంది. రూ. 400 కోట్లను నిర్మూలించడానికి రూ. 12,వేల కోట్లు ఖర్చు చేయడం తెలివైన ప్రభుత్వ విధానమేనా...

అత్యంత రహస్యంగా ఈ నిర్ణయం జరిగిందని, చెబుతున్నప్పటికీ ఈ ప్రకటన వెలువడక ముందే బడాబాబులకు కబురందింది. అందుకే తక్కువ విలువైన నోట్లను పెద్దమొత్తాల్లో ముందుగానే బ్యాంకుల నుంచి తీసుకున్నారని ఎస్‌బీఐ తెలిపింది. నోట్లరద్దు ప్రకటనకు ముందే పశ్చిమ బెంగాల్ బీజేపీ యూనిట్ల్ కోటిరూపాయలు డిపాజిట్ చేసింది. ఇవన్నీ రూ. 2,000 నోట్లు. నోట్లరద్దు సమాచారం బయటకు పొక్కిందన్న అంశాన్ని తెలియచేస్తున్నాయి. గత మూడు నెలల్లో అమాంతం బ్యాంకు డిపాజిట్లు పెరిగాయి. నల్లధనం ఉన్నవారు కూడా వ్యవస్థలోని అనేక లోపాల కారణంగా ఇతర మార్గాల ద్వారా పాత నోట్లను మార్చుతున్నారు.

నల్లధనం సృష్టిస్తున్న మూలాలను ప్రభుత్వం ముట్టుకోలేదు. వార్షిక జీడీపీలో 20 శాతం నల్లధనం ఉంటోంది. అంటే ముప్పై లక్షల కోట్లకు పైగా నల్లధనం తయారవుతోంది. చలామణిలోఉన్న 17.77 లక్షల కోట్లకంటే నల్ల ధనం శాతమే ఎక్కువ. తక్కువ విలువైన నోట్లను సరిపడినన్ని సరఫరా చేసేందుకు నోట్లు ఆర్జీఐ వద్ద లేవు. దీంతో పాతబడి, నలిగిపోయిన చినిగి పోయిన వందనోట్లను కూడా సరఫరా చేస్తున్నారు. రూ. 2000 లను తగిన సెక్యూరిటీ అంశాలు లేకుండానే ప్రభుత్వం హడావుడిగా విడుదల చేసింది. కొత్త నోట్లు విడుదల చేయాలంటే కనీసం 3 సంవత్సరాల సమయం తీసుకుంటున్నారు. ప్రభుత్వం మాత్రం 6 నెలల్లో పెద్దనోట్లను రద్దు చేసి కొత్తనోట్లను విడుదల చేసింది.

వెయ్యి నోటుకు బదులుగా రూ. 2000 నగదును ప్రవేశపెట్టి నల్లధనం అరికడతామంటే ప్రజలు నమ్మే స్థితిలో లేరు. ప్రజల చేతిలో డబ్బులేకుండా చేసి, వారి కొనుగోలు శక్తిని కుదించి వేశారు.

మన దేశంలో 46 శాతం మాత్రమే బ్యాంకింగ్ సౌకర్యాలు ఉన్నాయి. 22 శాతం ఇంటర్‌నెట్ అనుసంధానం ఉంది. 19 శాతం ప్రజలకు విద్యుత్ సౌకర్యం లేదు. విద్యుత్ ఉన్నవారికి ఎప్పుడు కరెంటు పోతుందో తెలియదు. కోటీ నలభై లక్షల మంది వ్యాపారులకు 12 లక్షల మంది వద్దే ఆధునిక సాధనాలు ఉన్నాయి. అందువల్ల దేశంలో నగదు రహిత లావాదేవీలు జరగటం కష్టం. దేశంలో డిజిటల్ విద్య చాలా తక్కువ స్థాయిలో ఉంది. పెద్ద నోట్ల రద్దుతో ఆర్థిక కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం పడింది. ప్రజలు డబ్బుకోసం నానా తంటాలు పడుతున్నారు. కార్మికులు, కర్షకులు, కూలీలు పనులు మానుకొని బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. మార్కెట్ నుంచి 86 శాతం కరెన్సీని మార్కెట్ నుంచి రద్దు చేయడంతో దేశ ఆర్థిక రంగం అతలాకుతలం అయ్యింది. 2016 అక్టోబరు నాటికి చెలామణిలో ఉన్న కరెన్సీ 17,50,000 కోట్లు చలామణిలో ఉంది. ప్రభుత్వ నిర్ణయంతో 14 లక్షల కోట్లు పనికిరాకుండా పోయాయి. ప్రస్తుతం 40 వేల కోట్లు చెల్లు బాటులో ఉన్నాయి. గత వారం రోజుల్లో ప్రజలకు అందింది కేవలం 70 వేల కోట్లు. బ్యాంకుల నుంచి సామాన్య ప్రజలకు వచ్చే 50 రోజుల్లో అందే మొత్తం లక్షా 20 వేల కోట్లు మాత్రమే.. 2016 అక్టోబరు నాటికి ముద్రణ అయిన 2000నోట్లు 408 కోట్లు. ఏతావాతా చెప్పేదేమంటే 14 లక్షల కోట్లు ముద్రించడానికి ఏడాదిన్నర సమయం తీసుకుంటుంది.

**- బోస్**



పని లేదు మనీ లేదు

### మానవత్వం పరిమళించిన వేళ



ఎవరెన్ని ఆటంకాలు కల్పించిన సాటి మానవుడు కష్టపడుతుంటే తోడుండే వాడు సామాన్యుడే... తిండి, తిప్పలు లేకుండా క్యూలైన్లలో నిలబడిన సాధారణ పౌరులకు ఒక టీ షాపువారు టీలు అందించి సేదతీర్చితే మరొక చోట పిజ్జాలు పంచి ఆకలి తీర్చారు.



శ్రీ కల్కి అందరివారు
విశ్వశాంతి ధర్మ స్థాపకులు,దైవ సత్యస్వరూపి,
ఎం.బేగ్
లోక రక్షకులు జగద్గురువులు శ్రీ కల్కి
కలియుగ కాల ప్రమాణము 4,32000 సంవత్సరాలు
3658 వ సం॥క్రీ॥ శ॥ 570 సం॥లో వచ్చారు. శ్రీ కల్కి
అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారు
కలియుగము మహా మంత్రమునకు సామ వేదములో
హా హా 1 లా ఇలాహ
హూ హూ 2 ఇల్లల్లాహు
హీ హీ 3 మొహమ్మదుర్ రసూలుల్లాహి
8143307812
ఎవరూ నరకాని పోకుండా స్వర్గానికి వెళ్లాలనే ఆకాంక్షిస్తూ.

## వెలగపూడికి తరలినున్న తుళ్లూరు పోలీసులు



**రాజధాని ప్రతినిధి, తుళ్లూరు :** రాజధాని ప్రాంత భద్రత, రక్షణ కొరకు పోలీసు శాఖ రక్షణ కౌన్సిల్‌ను ఏర్పాటు చేస్తోంది, దీనిలో భాగంగా తుళ్లూరు పోలీసుస్టేషన్‌ను వెలగపూడికి తరలించ నున్నారు. తాత్కాలిక సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న ఈ పోలీస్ స్టేషన్‌లో మెట్టమొదటి ఏఎస్పీగా విక్రాంత్ పాటిల్‌ను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం మందడం నుంచి ఆయన కార్యకలాపాలు నిర్వహించనున్నారు. వెలగపూడిలో ఏర్పాటు చేయనున్న తుళ్లూరు పోలీసు స్టేషన్‌కు 1.5 ఎకరాల కేటాయించాలని ఐజీ ఎన్ సంజయ్ ప్రభుత్వాన్ని కోరారు. దీనితో పాటు పోలీసు కంట్రోల్ రూము ఏర్పాటు కొరకు 5 ఎకరాల స్థలం కొరకు ప్రతిపాదన పంపామన్నారు.

సామాజిక,ఆర్థిక,సాంస్కృతిక, రాజకీయ,వారపత్రిక
రాజధాని వార్తలు క్లాసిఫైడ్స్ - రూ.500/- మాత్రమే
94406 62699, 96768 44442

Printed, Published and Owned by Pattan Hussain Khan, Published at 6-45/1, Rayapudi Post, Thullur Mandal, Guntur District, AP 522237. Printed at Jagathi Publications Ltd., D.No : 5-625, Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. Editor : Pattan Hussain Khan, Cell: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18